శుక్రవారం
11-4-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 199
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మాజీ ఎమ్మెల్యే షకీల్ అరెస్ట్

విశాలాంధ్ర - హైదరాబాద్: గత కొంతకాలంగా పోలీసుల నుంచి తప్పించుకుని దుబాయ్‌లో ఉంటున్న బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో గురువారం షకీల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గతంలోనే వివిధ కేసుల్లో షకీల్‌పై అరెస్ట్ వారెంట్ జారీ అయింది. కొంతకాలంగా ఆయన దుబాయ్‌లోనే ఉంటున్నారు. అతడి తల్లి బుధవారం అనారోగ్యంతో కన్నుమూశారు. అంత్యక్రియల కోసం షకీల్ హైదరాబాద్‌కు వస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు శంషాబాద్ విమానాశ్రయంలోనే

- మిగతా 2 లో

వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా
రేపు సీపీఐ ఆందోళన

న్యూఢిల్లీ: రాజ్యాంగ విరుద్ధ వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 12న ఆందోళనకు సీపీఐ పిలుపునిచ్చింది. పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అన్ని శాఖలకు పార్టీ జాతీయ కార్యదర్శి వర్గం గురువారం ఒక ప్రకటనలో సూచించింది. ప్రతిపక్షాలు సూచించిన సవరణలను పరిగణనలోకి తీసుకోకుండా వివాదాస్పద వక్ఫ్ చట్టాన్ని అర్ధరాత్రి సమయంలో మోదీ ప్రభుత్వం ఆమోదింపజేయించిందని, ఇందుకోసం పార్లమెంటు ఉభయ

- మిగతా 2 లో

హంతకుడొచ్చాడు

- భారత్ చేరిన తహవ్వుర్ రాణా
- ప్రత్యేక విమానంలో తరలింపు
- అదుపులోకి తీసుకున్న ఎన్ఐఏ
- ప్రత్యేక కోర్టులో విచారణ



న్యూఢిల్లీ: పదిహేడేళ్ల క్రితం అనగా 2008, నవంబర్‌లో జరిగిన ముంబై ఉగ్ర దాడి నిందితుడు తహవ్వుర్ రాణా(64) ఎట్టకేలకు భారత్ చేతికి చిక్కాడు. ప్రత్యేక విమానంలో అతడిని అమెరికా నుంచి భారత్‌కు తరలించారు. రాణా ఇంతకాలం భారత్‌కు చిక్కకుండా శతవిధాల ప్రయత్నించాడు. మొత్తానికి అతని ఆటలు సాగలేదు. రాణాకు అమెరికాలో ఉండేందుకు ఉన్న చట్టపరమైన అవకాశాలు మూసుకుపోవడంతో అతడిని భారత్‌కు అప్పగించేందుకు అమెరికా నిర్ణయం తీసుకుంది. రాణాను తీసుకువచ్చేందుకు

- మిగతా 2 లో

నా బ్రాండ్ యంగ్ ఇండియా

- దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉంది
- హోంగార్డు నుంచి డీజీపీ పిల్లల వరకు అవకాశం
- వర్సిటీలో ప్రతి విద్యార్థికి ఉద్యోగ భద్రత
- పోలీస్ స్కూల్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్: దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉంటుందని, అందుకే విద్య, ఉపాధిని తమ ప్రభుత్వం బ్రాండ్‌గా పెట్టుకుని ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను గురువారం సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ... దేశ చరిత్రలో ఎంతో మంది ప్రధానులు, ముఖ్యమంత్రులు అయ్యారనీ, కానీ అందులో కొద్దిమంది మాత్రమే చరిత్రలో గుర్తుండిపోయారని చెప్పారు. ఆ కొద్దిమంది తీసుకున్న నిర్ణయాలే చరిత్రను మలుపు తిప్పాయని... ఆ విధంగా ముఖ్యమంత్రుల్లో ఒక్కొక్కరికి ఒక్కో బ్రాండ్ ఉందని వివరించారు. కిలో రెండు రూపాయల బియ్యంతో ఎన్టీఆర్ ప్రతి పేదవాడి మనసులో స్థానం సంపాదించుకుంటే, హైదరాబాద్‌లో ఐటీని అభివృద్ధి చేసి చంద్రబాబు నాయుడు ఒక బ్రాండ్ క్రియేట్ చేసుకున్నారని, అలాగే రైతు బాంధవుడిగా ప్రజలు వైఎస్ ను గుర్తుంచుకుంటారని తెలిపారు. ప్రస్తుతం తాను "యంగ్ ఇండియా" బ్రాండ్‌ను సృష్టించానని వ్యాఖ్యానించారు. సాంకేతిక నైపుణ్యంలో నిరుద్యోగులకు శిక్షణనిచ్చేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. తమ ఎన్నికల మ్యానిఫెస్టోలోనే యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ అంశాన్ని పొందుపరిచామని చెప్పారు. ఆనాడు జవహర్ నెహ్రూ సారథ్యంలో దేశంలో యూనివర్సిటీల పునాదులు పడ్డడంతోనే మన దేశం ప్రపంచ దేశాలతో పోటీపడే స్థాయికి చేరిందన్నారు. స్కిల్ వర్సిటీకి ఆనంద్ మహేంద్రను చైర్మన్‌గా నియమించామన్నారు. వర్సిటీలో చేరిన ప్రతి విద్యార్థికి ఉద్యోగ భద్రత ఉంటుందన్నారు. దేశంలోనే ది బెస్ట్‌గా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. రాబోయే ఒలంపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ, అకాడమీని ఏర్పాటు చేసుకోబోతున్నట్లు వివరించారు. ప్రతీ నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామన్నారు. ప్రీ-స్కూల్ విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు చెప్పారు. సైనిక్ స్కూల్ కు ధీటుగా పోలీస్ స్కూల్‌ను తీర్చి దిద్దాలని, నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. సామాజిక బాధ్యతగా ప్రైవేటు కంపెనీలు పోలీస్ స్కూల్ కు ఆర్థిక సాయం అందించాలని కోరారు. రూ. 100 కోట్లు కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమతులకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ... పోలీసుల పిల్లలకు ప్రత్యేక స్కూల్ ను ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణకే దక్కుతుందని, ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హోంగార్డు నుంచి డీజీపీ పిల్లల వరకు అందరికీ ఇక్కడ చదువుకునే అవకాశం కల్పించామని చెప్పారు. తొలుత సీఎం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ లో స్టాఫ్ రూమ్స్, తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఫుట్‌బాల్ గ్రౌండ్ ను సందర్శించి చిన్నారులతో సరదాగా కాసేపు ఫుట్ బాల్ ఆడారు. సీఎంతో పాటు ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఉన్నారు.

'స్లాట్ బుకింగ్'తో
సేవలు వేగవంతం

15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి

దళారుల జోక్యానికి అడ్డుకట్ట: మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర - హైదరాబాద్: ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన స్లాట్ బుకింగ్ విధానానికి తొలిరోజే అనూహ్యస్పందన లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా 626 రిజిస్ట్రేషన్లు జరిగాయి. ప్రయోగాత్మకంగా వివిధ జిల్లాల్లో 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గురువారం నుంచి స్లాట్ బుకింగ్ విధానం అమలులోకి వచ్చిందని, వీటి ఫలితాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రజలకు సులువుగా న్యాయమైన, వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలను ప్రారంభించినట్లు మంత్రి వివరించారు. రెవెన్యూ విభాగంలో ఏ సంస్కరణ చేపట్టినా ప్రజల కోణంలోనే ఉండాలని అధికారులకు సూచించారు. స్లాట్ బుకింగ్‌పై ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా రిజిస్ట్రేషన్‌కు వచ్చి గంటల తరబడి నిరీక్షించి క్యూ లైన్లలో నిల్చునే విధానానికి అడ్డుకట్ట వేసేందు ఈ స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. దీని ద్వారా కేవలం 15 నిమిషాలలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అవుతుండడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రిజిస్ట్రేషన్‌శాఖ అధికారిక వెబ్‌సైట్ registration.telangana.gov.in స్లాట్ బుకింగ్ మాడ్యూల్ ద్వారా ఏరోజు వీలుంటే ఆరోజు ఆ సమయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకునేలా ఉపయోగపడుతుందన్నారు. సేవల్లో జాప్యం,

- మిగతా 2 లో

అమానవీయం

చెన్నై: నెలసరి శుభ్రతపై ఓవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధానాలు రూపొందిస్తూ... అవగాహన కార్యక్రమాలు చేపడుతుంటే... కొందరు మాత్రం కనీస విచక్షణ లేకుండా ప్రవర్తిస్తున్నారు. పీరియడ్స్‌లో ఉన్న ఓ దళిత విద్యార్థిని పరీక్ష రాయడానికి వస్తే ఆమెను తరగతి బయటే కూర్చోబెట్టారు. ఈ అమానవీయ ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. కోయంబత్తూరులో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినికి ఏప్రిల్ 5న తొలిసారి రుతుక్రమం మొదలైంది. రెండు రోజుల తర్వాత ఏప్రిల్ 7న ఫైనల్ పరీక్షలు రాసేందుకు ఆమె తన పాఠశాలకు వచ్చింది. అయితే, ఆ విద్యార్థినిని లోపలికి అనుమతించని

- మిగతా 2 లో

ఏపీలో 28 మంది డీఎస్పీల బదిలీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పోలీసు శాఖలో పనిచేస్తున్న 28 మంది డీఎస్పీ (సివిల్) హోదాగల వారి బదిలీలు, నియామకాలకు డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా గురువారం ఉత్తర్వులు జారీజేశారు. ఎస్.మహేంద్రను మదనపల్లి ఎస్‌డీపీఓ, డి.కొండయ్య నాయుడును సీఐడీ డీఎస్పీగా, పి.రామకృష్ణుడును ఏసీబీ డీఎస్పీగా, ఎం.గిరిధరరావును ఏసీబీ డీఎస్పీగా, ఎన్.సుధాకర్‌ను ఏసీబీ డీఎస్పీ-కడప, ఎం.బాలసుందరరావును

- మిగతా 2 లో

ఆర్థిక నేరాలపై
సిట్‌తో విచారణ

చిట్‌ఫండ్, అగ్రిగోల్డ్ మోసాలపై అసెంబ్లీలో మాట్లాడతా

కఠిన చట్టాలు అవశ్యం: కూనంనేని

విశాలాంధ్ర- హైదరాబాద్ : చిట్‌ఫండ్ కంపెనీలు, అగ్రిగోల్డ్, సహారా వంటి కంపెనీల ఆర్థిక నేరాలపై సిట్‌తో విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న కంపెనీలపై చర్యలు తీసుకొని వాటి ఆస్తులు, డిపాజిట్లను సీజ్ చేయాలని కోరారు. ఇందిరా పార్క్ వద్ద గురువారం అక్షర చిట్‌ఫండ్ బాధితులు ధర్నా చేశారు. పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ తో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ

- మిగతా 2 లో

ఏరివేత పేరుతో హత్యలా?

- అడవులను కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర
- మావోయిస్టుల సాకుతో మనుషులను చంపేస్తారా
- వక్ఫ్ బిల్లు ఆమోదం లౌకిక వ్యవస్థకు చీకటి రోజు
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-తిరుపతి: మావోయిస్టుల భావజాలాన్ని అణచివేయడంలో తప్పులేదని, కానీ నక్సల్స్ ఏరివేత పేరుతో నిర్దాక్షిణ్యంగా చంపడం దుర్మార్గమని, ఇది సరైన విధానం కాదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అభిప్రాయపడ్డారు. తిరుపతి గంధమనేని శివయ్య భవనంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2026 మార్చికల్లా మావోయిస్టులను తుదిముట్టిస్తామన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు గిరిజన ప్రాంత వాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని నారాయణ అన్నారు. మావోయిస్టుల భావజాలంపై పోరాటం చేయకుండా... వారిని చంపడానికి చేస్తున్న దుశ్చర్య సబబు కాదని మండిపడ్డారు. అడవుల నుంచి

- మిగతా 2 లో

పోషకాహార తెలంగాణే లక్ష్యం

'అంగన్వాడీ'ల్లో చిన్నారులు లేరని చెప్పడం సరికాదు

మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులతో మంత్రి సీతక్క

2 లో

భూకంపం ముప్పు?

- రామగుండం కేంద్రమని నిపుణుల హెచ్చరిక
- హైదరాబాద్, వరంగల్, అమరావతి వరకు ప్రకంపనలు
- 'ఎర్త్‌క్వేక్ రీసెర్చ్ అండ్ అనాలసిస్' వెల్లడి
- ధృవీకరించని ప్రభుత్వ వర్గాలు, శాస్త్రీయ సంస్థలు
- అప్రమత్తం అవశ్యమన్న అధికారులు



విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణకు భూకంప హెచ్చరిక ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. రామగుండంలో భూకంపం వచ్చే అవకాశం అధికంగా ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తీవ్రత గట్టిగా ఉంటుందని చెబుతున్నారు. భూకంప ప్రభావం హైదరాబాద్... అమరావతి వరకు కూడా ఉంటుందని అంటున్నారు. తెలంగాణకు భూకంపం వచ్చే అవకాశం ఉందని ఎర్త్‌క్వేక్ రీసెర్చ్ అండ్ అనాలసిస్ అనే సంస్థ స్పష్టం చేసింది. తమ పరిశోధనల ఆధారంగా తెలంగాణలో రామగుండం సమీపంలో భారీ భూకంపం సంభవించి అవకాశం ఉందని.. ఆ ప్రకంపనలు హైదరాబాద్, వరంగల్, అమరావతి వరకు చేరే అవకాశం ఉందని పేర్కొంది. అయితే ఎర్త్‌క్వేక్ రీసెర్చ్ అండ్ అనాలసిస్ సంస్థ

- మిగతా 2 లో

టారిఫ్ యుద్ధాలకు దూరంగా ఉండండి

బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ పిలుపు 2లో

కొత్తపట్నం రాజకీయ పాఠశాల

తమ సభ్యులకు సిద్ధాంతపరమైన శిక్షణ ఇప్పించడానికి కమ్యూనిస్టు పార్టీ మొదటి నుంచీ కృషి చేస్తూనే వచ్చింది. అందులో భాగంగానే 1937 మే నుంచి జూన్ 10వ తేదీ వరకు 40 రోజులపాటు ఒంగోలుకు పది మైళ్ల దూరంలో సముద్ర తీరంలోని కొత్త పట్నంలో రాజకీయ సిద్ధాంత పాఠశాల నిర్వహించాలని సంకల్పించింది. కానీ ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం ఈ రాజకీయ పాఠశాలను నిషేధించింది.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

సీఎంకు ఓ న్యాయం... రైతుకు మరో న్యాయమా?

హెచ్‌సీయూ భూములపై కేంద్ర సాధికారిక కమిటీకి బీఆర్ఎస్ బృందం నివేదిక

విశాలాంధ్ర - హైదరాబాద్: చట్టంలో అందరికీ ఒకేతరహా న్యాయం ఉంటుందని, హెచ్‌సీయూ భూముల విషయంలో మాత్రం రైతుకు ఒక న్యాయం, సీఎంకు ఒక న్యాయమా అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని పరిశీలించేందుకు పర్యావరణ, అటవీ శాఖల కేంద్ర సాధికారిక కమిటీ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మీ బట్టలు ఉతికి, ఇస్త్రీ చేయించాలా వద్దా? త్వరగా ఏ విషయం చెప్పండి!

టారిఫ్ యుద్ధాలకు దూరంగా ఉండండి

బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ పిలుపు

లండన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరతీయడం, కొత్త సుంకాలు అమల్లోకి తేవడంతో టారిఫ్ యుద్ధాలకు దూరంగా ఉండాలంటూ బ్రిటన్ వర్కర్లు, వినియోగదారులకు అక్కడి కమ్యూనిస్టులు హెచ్చరించారు. అమెరికా-ఈయూ, చైనా వ్యతిరేక సుంకాల యుద్ధాలలో తలదూర్చవద్దని బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ స్పష్టంచేసింది. తద్వారా బ్రిటన్ వర్కర్లకు, వినియోగదారులకు కలిగే ప్రయోజనం ఏమీ ఉండదని పార్టీ ప్రధాన కార్యదర్శి రాబర్ట్ గ్రిఫిత్స్ తెలిపారు. 'ఎగుమతులు, దిగుమతులపై అధిక సుంకాలతో మన పెట్టుబడులకు, ఉద్యోగాలకు, జీవన ప్రమాణాలకు ముప్పు ఏర్పడుతుంది. బ్రిటన్ వాణిజ్య లోటు నేపథ్యంలో లఘు పరిశ్రమలపై ప్రైవేటు-విదేశీ ఆధిపత్యం పెరిగింది. హైటెక్ పెట్టుబడులు, కార్మికుల నైపుణ్యాలు, విద్య, శిక్షణ వంటివి ప్రభావితం అవుతున్నాయి. టీటీఐపీ శైలి అమెరికా-బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో ప్రైవేటీకరణకు ప్రయోజనం కలుగుతుంది. కార్మికులు, వినియోగదారుల ప్రమాణాలు తగ్గుతాయి. ఈయూతో సింగిల్ మార్కెట్ ఒప్పందం కూడా ఇదే తరహా పరిణమించవచ్చు. ఇంధనం, రియల్ ఎస్టేట్, ఉత్పత్తి, ఆయుధాలు, ఇన్ఫోటెక్ రంగాల్లో కార్పొరేట్లకు కొమ్ముకాయడమే ట్రంప్ టారిఫ్ యుద్ధాల లక్ష్యం' అని పేర్కొన్నారు.

ప్రజల హక్కులన్నీ హరించేందుకు, నిబంధనలన్నింటినీ తుంగలో తొక్కేందుకు ప్రోటో ఫాసిస్టు మిత్రులతో కలిసి ట్రంప్ పనిచేస్తున్నట్లు రాబర్ట్ వ్యాఖ్యానించారు. భూగోళం భవిష్యత్, అమెరికా రాజ్యాంగాన్ని పణంగా పెట్టేస్తున్నారన్నారు. తయారీ పరిశ్రమలో, హరిత ఇంధనంలో పెట్టుబడులు పెట్టాలని లేబర్ ప్రభుత్వానికి సూచించారు. ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా అమెరికాలో ప్రజాందోళనలను స్వాగతించారు. నియంత పాలనకు దారితీసే మార్గాన్ని ప్రజా ఉద్యమం ద్వారా అడ్డుకోవడంలో దేశ కార్మిక సంఘాలు ప్రధాన పాత్ర పోషించాలన్నారు. రిపబ్లికన్ పార్టీ ఆశావహులు, బడా వ్యాపారవేత్తలు, టెక్ మొగల్స్, అగ్రస్థాయి అధికారులతో కూడుకున్న ట్రంప్ కూటమిలో బీటలు మొదలయ్యాయని రాబర్ట్ అన్నారు. ఇదిలావుంటే, అమెరికా-కెనడా కమ్యూనిస్టు పార్టీలకు బ్రిటన్ కమ్యూనిస్టులు సంఘీభావ సందేశాలు పంపారు. రఫా శివార్లలో పలస్తీనా ఎయిడ్ వర్కర్ల మారణహోమంపై స్వతంత్ర దర్యాప్తు కోసం అంతర్జాతీయ పిలుపునకు మద్దతు ప్రకటించారు. ఆక్రమిత పలస్తీనాలో ఇజ్రాయిల్ యుద్ధ నేరాల్లో పాల్గొన్నందుకు బ్రిటన్ పౌరులను నిలదీయాలని డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్యం కోసం

పోరాటం పున:ప్రారంభం

స్వాజిలాండ్ కమ్యూనిస్టు పార్టీ పిలుపు

ఎస్వాటిని: 'రాజకీయ ప్రతిష్ఠంభన ముగిసిపోవాలి... ప్రజాస్వామ్యం కోసం పోరాటం పున:ప్రారంభం కావాలి' అని స్వాజిలాండ్ కమ్యూనిస్టు పార్టీ (సీపీఎస్) పిలుపునిచ్చింది. మార్క్సిజం-లెనినిజం ఆధారంగా 2011 ఏప్రిల్ 9న సీపీఎస్ ఏర్పడింది. తాజాగా 14వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంది. వ్యవస్థాగత అసమానతలు, ప్రజలు ఎదుర్కొనే అన్యాయాలపై పోరాటమే లక్ష్యంగా ముందుకెళుతోంది. తాము సాధించిన పురోగతిని, అధిగమించిన సవాళ్లను, ఎదుర్కొన్న ఒడిదుడుకులను వివరిస్తూ వార్షికోత్సవం సందర్భంగా ఓ ప్రకటన విడుదల చేసింది. అలాగే, తాజా రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్‌లో తీసుకోవాలన్సిన చర్యలను పేర్కొంది. దేశంలో నెలకొన్న రాజకీయ ప్రతిష్ఠంభన కారణంగా ప్రజా ఉద్యమానికి అడ్డుకట్ట పడిందని వెల్లడించింది. మార్పు సాధ్యం కాదన్న భావన ప్రజల్లో బలంగా ఉందని, దీనిని పోగొట్టడం సవాల్‌గా మారిందని తెలిపింది. కష్టపడి సాధించుకున్న విజయాలు పూర్తిస్థాయిలో బూడిదలో పోసిన పన్నీరు కాకముందే మేల్కోవాలని... సంఘటిత ఉద్యమ స్ఫూర్తితో ముందడుగు వేయాలని పిలుపునిచ్చింది. అణగారిన వర్గాల తరపున పోరాటాలను పున:ప్రారంభించాలని పేర్కొంది. సుస్థిరతతోనే విజయం సాధ్యమని నొక్కిచెప్పింది. స్వీయసమృద్ధి సాధన లక్ష్యంగా అన్ని రంగాలను కలుపుకొని ముందుకెళ్లాలని పిలుపునిచ్చింది. సమానత్వ, న్యాయ, విమోచన సిద్ధాంతాలకు పార్టీ కట్టుబడి ఉన్నట్లు తెలిపింది. సోషలిస్టు స్వాజిలాండ్ నిర్మాణానికి కార్యాచరణ రూపొందాలని, ఇందుకోసం క్షేత్రస్థాయి నుంచి ఉద్యమ నిర్మాణం జరగాలని సూచించింది. ప్రగతిశీల, సామ్యవాద వ్యతిరేక శక్తులు క్రియాశీలం కావాలని, ప్రజాస్వామ్యం కోసం శాంతియుత పోరాటాలను నూతన ఉత్సాహంతో సిద్ధం కావాలని పిలుపునిచ్చింది. కార్యాచరణకు, సంఘీభావానికి 14వ వార్షికోత్సవాన్ని చోదకశక్తిగా మల్చుకోవాలని సూచించింది. 15వ వార్షికోత్సవాన్ని పూర్తి భిన్నమైన వాతావరణంలో, క్రియాశీల పోరాటాలతో రూపుదిద్దుకున్న సమాజంలో జరుపుకుందామని ఆకాంక్షించింది. ప్రజాస్వామ్యం, ప్రజా ఉద్యమాలు, విప్లవాలు, సీపీఎస్ వర్ధిల్లాలని స్వాజిలాండ్ కమ్యూనిస్టు పార్టీ నినాదాలు ఇచ్చింది.

ఆర్టీఐ చట్టానికి చేటు తేవద్దు

- డీపీడీపీ సెక్షన్ 44 (3)రద్దు చేయాలి
- ఇండియా ఐక్యసంఘటన డిమాండ్

న్యూఢిల్లీ: డిజిటల్ వ్యక్తిగత సమాచార రక్షణ చట్టం(డీపీడీపీ) సెక్షన్ 44 (3)ని రద్దు చేయాలని ఇండియా ఐక్యసంఘటన డిమాండ్ చేసింది. ఇది సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టాన్ని నాశనం చేస్తుందని పేర్కొంది. న్యూఢిల్లీలో జరిగిన సంయుక్త విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ... ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో సహా ఇండియా ఐక్యసంఘటనకు చెందిన పార్టీలకు చెందిన 120 మందికి పైగా ఎంపీలు ఈ సెక్షన్ రద్దు కోసం ఉమ్మడి మెమోరాండంపై సంతకం చేశారని... దానిని సమాచార, సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎంఎం అబ్దుల్లా (డీఎంకే), ప్రియాంక చతుర్వేది (శివసేన-యూబీటీ), జాన్ బ్రిట్టాస్ (సీపీఎం), జావేద్ అలీ ఖాన్ (ఎస్పీ), నావల్ కిషోర్ (ఆర్జేడీ) పాల్గొన్నారు. ఆర్టీఐ చట్టం, 2005లోని సెక్షన్ 8 (1) (జే)కి ప్రత్యామ్నాయంగా చూపబడుతున్న డీపీడీపీ చట్టంలోని సెక్షన్ 44 (3)ని పౌర హక్కుల కార్యకర్తలు వ్యతిరేకిస్తున్నారని గొగోయ్ పేర్కొన్నారు. సెక్షన్ 8 (1) (జే)...ఏదైనా ప్రజా కార్యకలాపాలకు లేదా ఆసక్తికి సంబంధం లేకుంటే లేదా గోప్యతపై అనవసరమైన దాడికి దారితీస్తే వ్యక్తిగత సమాచారాన్ని బహిర్గతం చేయడాన్ని నిలిపివేయడానికి అనుమతిస్తుంది. అయితే, ఈ పరిమితి ఒక ముఖ్యమైన రక్షణకు లోబడి ఉంటుంది. కేంద్ర ప్రజా సమాచార అధికారి, రాష్ట్ర ప్రజా సమాచార అధికారి లేదా అప్పీలేట్ అథారిటీ సమాచారాన్ని బహిర్గతం చేయడం వల్ల విస్తృత ప్రజా ప్రయోజనం ఉంటుందని నిర్ధారించినట్లయితే... దానిని అందుబాటులో ఉంచవచ్చు.కాగా

డీపీడీపీ చట్టంలోని సెక్షన్ 44 (3)... ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 8(1)(జే)ని సవరిస్తుంది. ఇది ప్రభుత్వ సంస్థలు ప్రజా ప్రయోజనాలను లేదా మరే ఇతర మినహాయింపులను పరిగణనలోకి తీసుకోకుండా వ్యక్తిగత సమాచారానికి సంబంధించిన సమాచారాన్ని నిలిపివేయడానికి అనుమతిస్తుంది.

'స్లాట్ బుకింగ్'తో సేవలు వేగవంతం

(మొదటిపేజీ తరువాయి)

సిఫార్సులు, దళారుల జోక్యం లేకుండా ప్రజలు మెరుగైన సేవలు అందుతాయని అన్నారు. స్లాట్ బుకింగ్ ద్వారా అపాయిమెంట్ తేదీ, సమయాన్ని ముందే తెలుసుకోవచ్చునన్నారు. కొనుగోలుదారులు, అమ్మకం దారులు, సాక్షులు తగిన సమయంలోనే రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు చేరుకోవడానికి వీలు కలుగుతుందన్నారు. పారదర్శకతతో మధ్యవర్తుల ప్రభావానికి తెరపడనుందన్నారు.

మాజీ ఎమ్మెల్యే షకీల్ అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

అదుపులోకి తీసుకున్నారు. అయితే తల్లి అంత్యక్రియలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరగా పోలీసులు అంగీకరించారు. అంత్యక్రియలు ముగిసిన వెంటనే ఆయనను అదుపులోకి తీసుకున్నారు. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో షకీల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రజాభవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో పంజాగుట్ట పోలీసులను మేనేజ్ చేసి తన కుమారుడిని కేసు నుంచి తప్పించే ప్రయత్నం చేశారంటూ షకీల్‌పై గతంలోనే పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. దీంతో కేసు నమోదైంది. విషయం తెలిసిన షకీల్ ఇండియాకు రాకుండా దుబాయ్‌లోనే ఉండిపోయారు.

భూకంపం ముప్పు?

(మొదటిపేజీ తరువాయి)

భూకంపం సూచనలను ప్రభుత్వ వర్గాలు గానీ, శాస్త్రీయ సంస్థలు గానీ ధృవీకరించడం లేదు. భూకంపాలను కచ్చితంగా ముందస్తు అంచనా వేయడం ప్రస్తుతం శాస్త్రీయంగా సాధ్యం కాదని, ఇలాంటి సూచనలు తరచుగా నిర్ధారణకు నోచుకోవని అధికారులు చెబుతున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పెసిఫిక్ జోన్ రెండు, మూడులో ఉన్నాయి. ఇవి తక్కువ నుంచి మోస్తారు భూకంప ప్రమాదాన్ని మాత్రమే సూచిస్తాయి. గతంలో ఈ ప్రాంతంలో కొన్ని చిన్న చిన్న భూకంపాలు సంభవించాయి. అవి ఏమాత్రం నష్టం కలిగించలేదు. భూకంపాల విషయంలో అప్రమత్తంగా ఉండటం మంచిదే కానీ నిర్ధారణలేని సమాచారంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ఐఎండీ అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల్లో భూకంపాల రికార్డు కూడా పెద్దగా లేదు. కొన్ని సందర్భాల్లో స్వల్ప భూకంపాలు ప్రజలను భయాందోళనకు గురిచేశాయి. 1969లో ఆంధ్రలోని ఒంగోలు ప్రాంతంలో 5.1 తీవ్రత గల భూకంపం వచ్చింది. అది రాష్ట్రాన్ని బాగా ఊపేసిందని చెప్పవచ్చు. 1998లో తెలంగాణ రాష్ట్రం ఆదిలాబాద్ జిల్లాలో 4.5 తీవ్రతతో ప్రకంపనలు నమోదు అయ్యాయి. అలాగే హైదరాబాద్‌లో 1984, 1999, 2013లో చిన్న భూకంపాలు మాత్రమే సంభవించగా... ప్రజలు ఒక్కసారిగా భయపడిపోయారు. కానీ ఎలాంటి ఆస్తి నష్టం సంభవించలేదు. శ్రీశైలం డ్యాం పరిసరాల్లో కొన్ని సందర్భాల్లో భూమి కంపించినట్లు రికార్డు అయ్యాయి. భూకంపాల రాకను కచ్చితంగా అంచనాలు వేయడం శాస్త్రీయంగా సాధ్యం కాదు గనుక భద్రతా చర్యలు తీసుకోవడం, అప్రమత్తంగా ఉండటం మంచిదని అధికారులు అంటున్నారు.

పోషకాహార తెలంగాణే లక్ష్యం

విశాలాంధ్ర-హైదరాబాద్: పోషకాహార తెలంగాణే లక్ష్యంగా పనిచేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ... ఆ శాఖ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలు పూర్తిస్థాయిలో పని చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆ శాఖ సిబ్బందితో గురువారం మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చిన్నారులు లేరనే సాకుతో రాష్ట్రంలో 313 అంగన్వాడీ కేంద్రాలు తెరుచుకోలేదని చెప్పడం సరికాదని, 30 కేంద్రాల్లో అసలు పిల్లలు లేరని, 198 కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య ఐదు లోపే ఉండగా, 586 కేంద్రాల్లో పదిలోపే ఉండడం పై అమె అసహనం వ్యక్తం చేశారు. చిన్నారులు లేని కేంద్రాలను డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు గ్రేడింగులు ఇస్తామని, ఆయా సిబ్బందికి, జిల్లా అధికారులకు అవార్డులు ఇస్తామని తెలిపారు. సరుకుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి సెంటర్ లో కనీసం 20 మంది చిన్నారులు ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. బడిబాట తరహాలోనే చిన్నారులను గుర్తించి అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. చిన్నారుల సంక్షేమంపై ప్రభుత్వం వందల కోట్లు ఖర్చు చేస్తుందని, క్షేత్రస్థాయిలో సిబ్బంది నిబద్ధతతో వ్యవహరిస్తే లక్ష్యాలు నెరవేరుతాయని అభిప్రాయపడ్డారు. చిన్నారుల సంఖ్య పెంచే బాధ్యత మీదే అని స్పష్టం చేశారు. కందిపప్పు కొనుగోలులో సొంత నిర్ణయాలు ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. ఈ-టెండర్ విధానాన్ని పాటించాలన్న ఆదేశాలను ఎందుకు పాటించలేదో చెప్పాలని, మీ తప్పిదాల వల్ల తాము విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని జిల్లాల అధికారులు పాత కాంట్రాక్టర్లకి కందిపప్పు సరఫరాను నామినేషన్ పద్ధతిలో ఎందుకు కట్టబెట్టాల్సి వచ్చిందో సంజాయిషీ ఇవ్వాల్సిందే అని అన్నారు. పాత కాంట్రాక్టర్లకు నామినేషన్ పద్ధతిని నిలిపి వేసి ఈ- టెండర్ విధానాన్నీ అవలంభించండని ఆదేశించారు. పిల్లల అమ్మకాలు, బాల్య వివాహాలు, నిబంధనలకు విరుద్ధంగా దత్తత లపై దృష్టి పెట్టాలని సూచించారు. తల్లిదండ్రుల్లో చైతన్యం కల్పించాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామ చంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

ఏరివేత పేరుతో హత్యలా?

(మొదటిపేజీ తరువాయి)

మావోయిస్టులను, ఆదివాసీలను తరిమివేసి... కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలన్న కేంద్రం వైఖరి సరికాదని హితవు పలికారు. దేశంలో ఒకే ఆలోచన ఉండాలా... భిన్నాభిప్రాయాలు ఉండకూడదా అని ప్రశ్నించారు. ఇతర పార్టీలను భయపెట్టి... బెదిరించి పార్లమెంటులో వక్ఫ్ బిల్లు ఆమోదింపచేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ బిల్లు ఆమోదం పొందడమంటే లౌకిక వ్యవస్థకు చీకటి రోజు వచ్చినట్లేనని నారాయణ అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం భారతదేశం ఆత్మ అని, పార్లమెంటును కూడా అదే పద్ధతిలో రూపొందించుకున్నామన్నారు. అర శాతం, ఒక శాతం గల మతాలను కూడా సమానంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. మెజారిటీ పేరుతో పార్లమెంటులో ఇష్టానుసారం బిల్లులు తీసుకురావడం సరికాదని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాలు దేశాన్ని విచ్ఛిన్నం చేసేలా ఉన్నాయని విమర్శించారు. గత ఎన్నికల్లో బీజేపీ ఓడి గెలిచిందని, 400 సీట్లు సాధిస్తామని గొప్పగా చెప్పుకున్నారని, కానీ ప్రజలు 240 సీట్లకే పరిమితం చేశారని గుర్తుచేశారు. చివరికి బీజేపీకి ఎడమకాలు నితీశ్, కుడి కాలు చంద్రబాబు అయ్యారని ఎద్దేవా చేశారు. ఈ రెండు కాళ్లపై ప్రధాని మోదీ నిలబడి నాటకాలాడుతున్నారని విమర్శించారు. బీజేపీకి ప్రజాదరణ తగ్గడంతో సరికొత్త మార్గాలు ఎంచుకున్నారని, అందుకే భాష, వక్ఫ్ సవరణ చట్టం, డీలిమిటేషన్‌ను తెరపైకి తీసుకొచ్చారని ఎండగట్టారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడా నికి ఈ మూడు అంశాలను ఎంచుకున్నారని చెప్పారు. బీజేపీకి లౌకికవ్యవస్థతోనూ, ప్రజాస్వామ్యం తోనూ, రాజ్యాంగంతోనూ పనిలేదని విమర్శించారు. వక్ఫ్ చట్టం ద్వారా ముస్లిం మైనారిటీల భూములను తన మిత్రులు కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడమే మోదీ సర్కారు లక్ష్యమన్నారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఈ నెల 12వ తేదీన సీపీఐ దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చిందని నారాయణ చెప్పారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా సీపీఐ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిందని గుర్తుచేశారు. ఏప్రిల్ 22 నుంచి 26 వరకు తిరువనంతపు రంలో సీపీఐ జాతీయ సమితి సమావేశాలు నిర్వహిస్తున్నామని, జాతీయ మహాసభలు సెప్టెంబర్‌లో పంజాబ్‌లో జరగనున్న నేపథ్యంలో డాక్యుమెంటరీ తయారీకి ఈ సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోలీసులపై మాజీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలపై నారాయణ స్పందించారు. పోలీసుల దుస్తులు ఊడదీస్తాననడం సబబు కాదన్నారు. గతంలో జగన్ కూడా పోలీసులను వాడుకున్నాడని, ప్రభుత్వాన్ని నడిపిన జగన్ అధికారులపై ఇలా మాట్లాడడం శోచనీయమన్నారు. అధికారులు కూడా లక్ష్మణరేఖ దాటకూడదన్నారు. పోలీసులు ఏం చేసినా ప్రభుత్వం చేసినట్లేనని వ్యాఖ్యానించారు. జగన్ వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. అమెరికా విధించిన సుంకాల కారణంగా మూడో ప్రపంచ యుద్ధం వచ్చినట్లు ఉందని నారాయణ అన్నారు. ఆయుధాలు లేకుండానే అమెరికా దౌర్జన్యంగా వాణిజ్యయుద్ధం చేస్తోందని విమర్శించారు. అమెరికా విధానాలపై అనేక దేశాలు తిరుగుబాటు చేస్తుంటే... మన ప్రధాని నరేంద్ర మోదీ మాత్రం డొనాల్డ్ ట్రంప్‌నకు వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. మోదీ స్పందించకుంటే అత్యంత ప్రమాదకర పరిస్థితిలు దాపరించే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఆక్వా రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, శివారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు పెంచలయ్య, రాధాకృష్ణ, విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఏపీలో 28 మంది డీఎస్పీల బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

డీఎస్పీ-పీటీసీ ఒంగోలు, బి.సునీల్‌ను సీఐడీ డీఎస్పీ గుంటూరు, ఆర్.వసుదేవన్‌ను డీఎస్పీ(పీటీసీ) అనంతపురానికి నియమించారు. ఆర్.గోవింద రావుకు విజయనగరం ఉమెన్ పీఎస్ డీఎస్పీగా, ఆర్‌జీ జయశూర్యను ఎస్‌డీపీఓ భీమవరం, ఎన్.భార్గవి మచ్చిలీపట్నం... ఎన్.భార్గవి మర్రివాడకు ఎస్‌డీపీఓ టెక్కలికి బాధ్యతలు అప్పగించారు. బీఎం జయరామ్ ప్రసాద్‌ను రాజమండ్రి డీఎస్ఆర్‌పీ, పి.మల్లిఖార్జునరావును వీఅండ్ఈ డీఎస్పీ, ఎం.భక్తవస్తాలమ్‌ను తిరుపతి ఎస్‌డీపీఓగా, వీవీ రమణకుమార్‌ను ఉమెన్ పీఎస్ డీఎస్పీ-ప్రకాశం, డి.సోమన్నను ఏసీబీ డీఎస్పీగా బదిలీ చేశారు. టి.శ్రీనివాసులును సెవెంత్ బెటాలియన్ ఏపీఎస్‌పీ డీఎస్పీ, యు.బంగారురాజును డీఎస్పీ(విఅండ్ఈ)గా, కె.రవికుమార్‌ను సీఐడీ డీఎస్పీగా, ఎం.మహేశ్వర రావును డీఎస్పీ(పీటీసీ)గా విజయనగరానికి బదిలీ చేశారు. డి.శ్రీనివాసరెడ్డిని డీఎస్పీ ఉమెన్ పీఎస్(గుంటూరు), బీవీ సుబ్బారావును ఏసీబీ డీఎస్పీ, కేవీ సత్యనారాయణను ఉమెన్ పీఎస్ రాజమండ్రి డీఎస్పీగా, జీఆర్ఆర్ మోహన్‌కు సీఐడీ డీఎస్పీగా, బి.నాగేశ్వరరావుకు డీఎస్పీ నార్త్ కోస్టల్ సెక్యూరిటీగా, వై.గోవింద రావును వీఅండ్ఈ డీఎస్పీగా, యు.నరసింగప్పను పెనుగొండ ఎస్‌డీపీవో, వై.వెంకటేశ్వర్లును పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు బదిలీ చేశారు.

అమానవీయం

(మొదటిపేజీ తరువాయి)

ఉపాధ్యాయులు... తరగతి గది బయటే కూర్చోబెట్టి పరీక్ష రాయించారు. ఈ విషయాన్ని ఇంటికెళ్లాక ఆ అమ్మాయి తన తల్లికి చెప్పింది. బాలిక తల్లి బుధవారం స్కూల్‌కు రాగా... అప్పుడు కూడా ఆ విద్యార్థి తరగతి బయటే కూర్చొని పరీక్ష రాస్తూ కనిపించింది. దీంతో బాలిక తల్లి ఈ ఘటనను వీడియోలో రికార్డ్ చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. కాసేపటికే అది వైరల్‌గా మారడంతో ఆ పాఠశాల యాజమాన్యంపై పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. మరోవైపు బాలిక తల్లి విద్యాశాఖ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారణ జరుగుతోంది.

హంతకుడొచ్చాడు

(మొదటిపేజీ తరువాయి)

భారత్ పంపిన ప్రత్యేక విమానం గురువారం పాలం విమానాశ్రయంలో దిగింది. ఈ మేరకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారికంగా ప్రకటించింది. 2008 అల్లకల్లోలం వెనుక కీలక కుట్రదారుడిని న్యాయం ముందు నిలబెట్టడానికి ఏళ్ల తరబడి చేసిన నిరంతర ప్రయత్నాల తర్వాత తహవ్వుర్ హుస్సేన్ రాణాను అప్పగించడంలో విజయం సాధించినట్లు ఎన్ఐఏ తెలిపింది. అప్పగింతను అడ్డుకునేందుకు రాణా అమెరికాలో అన్ని చట్టపరమైన మార్గాలను వినియోగించుకున్న తర్వాత చివరికి అతడిని మనకు అప్పగించినట్లు ప్రకటించింది. అంతకుముందు పాలం ఎయిర్ ఫోర్స్ బేస్‌లో సిద్ధంగా ఉన్న ఎన్ఐఏ అధికారులు ప్రత్యేక విమానం నుంచి దిగగానే రాణాను అరెస్ట్ చేసి ఢిల్లీ పటియాలా హౌస్ కాంప్లెక్స్‌లోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచేందుకు ఏర్పాట్లు చేశారు. ముందుగా కోర్టు ప్రాంగణాన్ని ఖాళీ చేయించిన పోలీసులు... మీడియా ప్రతినిధులను కూడా అనుమతించలేదు. కోర్టు రిమాండ్ విధించిన వెంటనే తీహార్ జైలుకు తరలించేలా ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో పాలం విమానాశ్రయం, పటియాలా హౌస్ కోర్టు, తీహార్ జైలు వద్ద భారీగా భద్రతా బలగాలను మోహరించారు. తీహార్ జైలులో అత్యంత భద్రత కలిగిన బ్యారక్ లో రాణాను ఉంచేందుకు సర్వం సిద్ధం చేసినట్లు సమాచారం. జైలు నంబర్ 2లో అతడిని ఉంచనున్నట్లు తెలుస్తోంది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఎన్ఐఏ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం మెట్రో స్టేషన్ రెండో గేటును మూసివేశారు. అక్కడ భద్రత కట్టుదిట్టం చేశారు.

ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్

తహవ్వుర్ రాణా అప్పగింత నేపథ్యంలో ముంబై దాడుల కేసులో పటిష్టమైన వాదనలు వినిపించేందుకు కేంద్ర హోంశాఖ పటిష్టమైన న్యాయవాద బృందాన్ని సిద్ధం చేసింది. రాణా అప్పగింత కోసం అమెరికా కోర్టులో వాదనలు వినిపించిన బృందానికి నాయకత్వం వహించిన సీనియర్ న్యాయవాది దయాన్ కృష్ణన్, ఎన్ఐఏ తరపున వాదనలకు నేతృత్వం వహించనున్నారు. మరో సీనియర్ క్రిమినల్ లాయర్ "నరేందర్ మాన్"ను ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కేంద్ర హోంశాఖ నియమించింది. దయాన్ కృష్ణన్‌కు నరేందర్ మాన్ సహాయ సహకారాలు అందించనున్నారు. ఎన్ఐఏ న్యాయవాద బృందంలో సంజీవిశేషాద్రి, శ్రీధర్ కాలే కూడా ఉన్నారు.

విచారణ వేగవంతం!

ముంబయి దాడులపై 2009 నవంబరు 1న ఢిల్లీలోని ఎన్ఐఏ పోలీస్ స్టేషన్ లో వివిధ సెక్షన్ల కింద కేసు నమోదైంది. డేవిడ్ కోల్మన్ హెడ్లీ, తహవ్వుర్ హుస్సేన్ రాణా, ఇతరులను నిందితులుగా చేర్చారు. రాణా, హెడ్లీలను అప్పగించాలని గతంలోనే భారత్ అమెరికాను కోరింది. దర్యాప్తులో సాయం చేయాలని పాకిస్థాన్ ప్రభుత్వానికి లేఖ రాసింది. కేసు దర్యాప్తు పూర్తిచేసిన ఎన్ఐఏ మొత్తం 9 మంది నిందితులపై 2011 డిసెంబర్ 24న పాటియాలా హౌస్ కాంప్లెక్స్‌లోని ఎన్ఐఏ న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేసింది. రాణా రాకతో ఆ కేసు విచారణలో వేగం పుంజుకోనుంది. రాణాను అమెరికా భారత్‌కు అప్పగించకముందే ముంబై దాడుల కేసుకు సంబంధించిన విచారణ ఫైళ్లు ఢిల్లీ కోర్టుకు చేరాయి. నవంబరు 26 దాడులపై ముంబైలోనూ అనేక కేసులు ఉన్న నేపథ్యంలో ఢిల్లీ నుంచి విచారణ దస్త్రాలను అక్కడికి పంపారు. ఇటీవల ఎన్ఐఏ చేసిన విజ్ఞప్తి మేరకు ముంబై కోర్టు నుంచి ఢిల్లీ న్యాయస్థానానికి ఫైళ్లు చేరాయి. జిల్లా కోర్టు న్యాయమూర్తి విమల్ కుమార్ యాదవ్ వాటిని స్వీకరించారు. రాణాను ఎన్ఐఏ కస్టడీకి న్యాయస్థానం అనుమతిస్తే ముంబై దాడుల వెనుక పాకిస్థాన్ ప్రభుత్వ హస్తం బహిర్గతమయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. 2008 నవంబర్ 26న 10 మంది పాకిస్థానీ ఉగ్రవాదులు సముద్ర మార్గంలో ముంబై చేరుకుని సీఎస్ఎంటీ, ఒబెరాయ్ ట్రైడెంట్, తాజ్ హోటల్ తదితర ప్రాంతాల్లో దాడులకు పాల్పడ్డారు. నవంబర్ 29 వరకు జరిగిన నాటి మారణహోమంలో 18 మంది భద్రత సిబ్బంది సహా 166 మంది ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడ్డారు.

రేపు సీపీఐ ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

సభలను బుల్డోజ్ చేసిందని సీపీఐ విమర్శించింది. మైనారిటీలు ముఖ్యంగా ముస్లింలను లక్ష్యంగా చేసుకున్న బీజేపీ.... దేశాన్ని మతం పేరిట విభజించేందుకు స్పష్టమైన ప్రయత్నం చేస్తుందని దుయ్యబట్టింది. విభజించి పాలించు విధానాన్ని అనుసరిస్తూ మైనారిటీ వ్యతిరేక రాజకీయాలను అవలంభిస్తున్నట్లు మోదీ ప్రభుత్వాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. బడా గుత్తేదారుల కోసం భూ సేకరణ లక్ష్యంగా సాగే ప్రయత్నమే ఇదని దుయ్యబట్టింది. వక్ఫ్ బిల్లుపై చర్చ సమయంలో వక్ఫ్ బోర్డు డబ్బును మైనారిటీల సాధికారత కోసం వినియోగిస్తామని బీజేపీ నేతలు బూటకపు హామీలు ఇచ్చారని చెబుతూ... మౌలానా ఆజాద్ స్కాలర్‌షిప్ పథకాల కింద మైనారిటీ విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్‌ను ఆపేయడాన్ని సీపీఐ ఈ సందర్భంగా గుర్తుచేసింది. ఇక చర్చి, క్రైస్తవ మైనారిటీల వ్యవస్థలు, ఆస్తులను లక్ష్యంగా చేసుకుంటే ఆశ్చర్యం లేదని వ్యాఖ్యానించింది. దేశ ఐక్యతకు, రాజ్యాంగంలో మత స్వేచ్ఛకు హామీనిచ్చే నిబంధనలకు విఘాతం కలిగిస్తూ మైనారిటీలు లక్ష్యంగా అమలవుతున్న విధానాలను ఎండగట్టాలని సీపీఐ పిలుపునిచ్చింది. మోదీ ప్రభుత్వ పద్ధతి చాలా ప్రమాదకరమని హెచ్చరించింది. వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ కేవలం నల్ల స్ట్రిప్పులతో నిరసన తెలిపినందుకు మూడు వందల మంది ముస్లింలకు యూపీ ప్రభుత్వం నోటీసులు ఇవ్వడం.... మైనారిటీలను భయపెట్టడానికి కాకపోతే మరెందుకని ఆక్షేపించింది. ఈ నోటీసులు తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. వక్ఫ్ చట్టానికి వ్యతికిస్తూ ఈనెల 12న ఆందోళనను జయప్రదం చేయాలని సీపీఐ పిలుపునిచ్చింది.

మనీశ్ కుంజం ఇంట్లో సోదాలకు ఖండన

అవినీతి వ్యతిరేక పోరాటంలో అగ్రభాగాన నిలిచే సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఆదివాసీ మహాసభ నాయకుడు మనీశ్ కుంజంకు చెందిన సుక్మా ఇంటినిఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ ఆర్థిక నేరాల విభాగం (ఈఓడబ్ల్యూ), అవినీతి నిరోధక బ్యూరో (ఏసీబీ) అధికారులు సోదా చేయడాన్ని పార్టీ తీవ్రంగా ఖండించింది. ఇటీవల స్థానిక సంఘాల ఎన్నికల్లో బీజేపీ ఓటమి అనంతరం జరిగిన ఈ దాడులు రాజకీయ ప్రేరేపితమని వ్యాఖ్యానించింది. దీనిపై రాజకీయంగా పోరాడతామని సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గం వెల్లడించింది.

సీఎంకు ఓ న్యాయం... రైతుకు మరో న్యాయమా?

(మొదటిపేజీ తరువాయి)

గురువారం హెచ్‌సీయూను సందర్శించింది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది. ఈ నేపథ్యంలో హరీశ్‌రావు నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రతినిధి బృందం హోటల్ తాజ్ కృష్ణలో కమిటీతో భేటీ అయింది. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో డాక్యుమెంట్లు, విజువల్స్‌తో కూడిన నివేదికను కమిటీకి అందించింది. అనంతరం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ... సాధారణ రైతు తన సొంత వ్యవసాయ పొలంలో చింతచెట్టునో ... వేపచెట్టునో నరికితేనే పోలీసులు, ఫారెస్ట్, రెవిన్యూఅధికారులు లక్షల పెనాల్టీలు వేస్తారని కాని హైదరాబాద్ నడిబొడ్డున ఇన్ని వేల చెట్లను నరికితే ఎందుకు మౌనం వహిస్తున్నారని మంత్రి నిలదీశారు. హెచ్‌సీయూ భూముల విషయంలో ప్రభుత్వం అన్ని చట్టాలను ఉల్లంగించిందని మండిపడ్డారు. హైడ్రా విషయంలో శని ఆదివారాల్లో కూల్చొదని హైకోర్టు కూడా చెప్పిందని, దాన్ని కూడా ప్రభుత్వం ఉల్లంఘించిందన్నారు. ఇవన్నీ కమిటికి ఆధారాలతో సహా వివరించినట్లు చెప్పారు. వాల్టా చట్టం ప్రకారం చెట్లు కొట్టాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. అటవీశాఖ అనుమతి ఇచ్చాకే చెట్లను నరకాలన్నారు. ఒక్కో చెట్టుకు రూ.400 డిపాజిట్ చేశాకే కొట్టాల్సి ఉంటుందన్నారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో ఆందోళన చేసినా అటవీ శాఖ పట్టించుకోలేదన్నారు. అటవీ శాఖ స్పందించకపోవడంతోనే చెట్లు నరికేశారని, జంతువులు చనిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పులు, మార్గదర్శకాలు, నిబంధనలు స్పష్టంగా ఉన్నప్పటికీ.. వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. 2011లో కంచ గచ్చిబౌలి భూముల్లో జీహెచ్ఎంసీ లక్ష మొక్కలను నాటిందని, ఆ భూముల్లో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ నాటిన మొక్కలు కూడా ఉన్నాయన్నారు. అరుదైన పక్షులు, జంతువులు, చెట్లు కంచ గచ్చిబౌలి భూముల్లో ఉన్నాయని వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అలా కాకుండా రాష్ట్ర ప్రభుత్వమే వాటిని భక్షిస్తోందని విమర్శించారు. కంచ గచ్చిబౌలి భూములను తాకట్టు పెట్టి గతేడాది నవంబర్ 22న రూ.10 వేల కోట్లు రుణం తెచ్చారని, మధ్యవర్తికి రూ.170 కోట్లు లంచం ఇచ్చారని ఆరోపించారు. ఆ విషయాన్ని సాక్షాత్తూ అసెంబ్లీలోనే చెప్పారన్నారు. ఫార్మాసిటీ కోసం సేకరించిన 14వేల ఎకరాలు అభివృద్ధి చేయాలని సూచించారు. అక్కడ ఎలాంటి చెట్లు, వన్యప్రాణులు లేవన్నారు. కంచ గచ్చిబౌలి భూములు హెచ్‌సీయూకి చెందినవే అని సీసీఎల్ఏకు 2012లోనే అప్పటి కలెక్టర్ లేఖ రాశారని హరీశ్‌రావు పేర్కొన్నారు.

ఆర్థిక నేరాలపై సిట్‌తో విచారణ

(మొదటిపేజీ తరువాయి)

చిట్టీల పేరుతో అమాయక ప్రజలను పట్టపగలే మోసం చేసి వేల కోట్ల ఆస్తులు కూడపెట్టుకున్నారని ధ్వజమెత్తారు. ఆస్తులను అమ్మి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సైబర్ నేరస్తుల కంటే ప్రమాదకరంగా చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేసేవారు ఎక్కువయ్యారన్నారు. అక్షర, భవిత శ్రీ, శుభ నందిని, విజయలక్ష్మి , అచల, కనకదుర్గ తదితర చిట్ ఫండ్ కంపెనీలు ప్రజలను, ఏజెంట్లను తీవ్రంగా నష్టపరిచారన్నారు. ప్రీ లాంచ్ ఆఫర్స్ పేరుతో ఇళ్లు నిర్మించి ఇస్తామని పేద ప్రజలను మోసం చేస్తున్నారనీ, కఠినమైన చట్టాలు లేకపోవడం వల్ల నిందితులు బెయిల్‌తో యథేచ్ఛగా బయట తిరుగుతున్నారన్నారు. చట్టాలను కఠినతరం చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజల కోసం మాట్లాడే వారిని అర్బన్ నక్సలైట్లుగా ముద్రవేస్తున్నారని, కమ్యూనిస్టులు, సామాజిక ఉద్యమ కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెడుతున్నారు తప్ప, వేలకోట్ల రూపాయలు కుంభకోణానికి పాల్పడిన లలిత్ మోదీ, నీరవ్ మోదీ విదేశాలలో స్వేచ్ఛగా తిరుగుతున్నారని అన్నారు. చిట్ ఫండ్ అగ్రిగోల్డ్ తదితర ఆర్థిక కుంభకోణాలపై అసెంబ్లీలో మాట్లాడుతానన్నారు. దేవేందర్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన బాధితులు ధర్నా నిర్వహించారు. పశ్య పద్మ మాట్లాడుతూ చిట్ ఫండ్స్ బాధితులకు ఫీజు లేకుండా ఆర్బిట్రేషన్ కు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. బాధితుల నిరంతర విజ్ఞప్తులతో అధికారులపై తీసుకొచ్చిన ఒత్తిడి ఫలితంగా ఎఫ్ఐఆర్ లను సీజ్ చేశారని, అయినా కరీంనగర్లో దానిని ఎలా రిలీజ్ చేశారని పశ్య పద్మ ప్రశ్నించారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతామన్నారు. 53 మందితో రాష్ట్ర కమిటీ ఏర్పడింది. దేవేందర్ రెడ్డి అధ్యక్షుడిగా వజ్రాల అరుణ ప్రధాన కార్యదర్శిగా ఉపాధ్యక్షులుగా మొగిలయ్య, కాసర్ల తిరుపతిరెడ్డి, ఎల్ల స్వామి, అనిల్ కుమార్, కే శ్రావణ్ కుమార్, గణేష్, సహాయ కార్యదర్శిగా శ్యాంసుందర్, మురళి , ఘంటా రవికుమార్ , ఎండి మస్తాన్ కోశాధికారిగా నరేష్ ఎన్నికయ్యారు. ముఖ్యమంత్రి కి వినతి పత్రాలు ఇవ్వాలని, జిల్లాలలో సదస్సులు నిర్వహించి కమిటీలను ఏర్పాటు చేసి ఉద్యమాన్ని తీవ్రతరం చేసేందుకు తీర్మానించారు.

అర్హులైన వారికి సన్న బియ్యం పంపిణీ చేయాలి

జిల్లా కలెక్టర్ అద్వైత కుమార్ సింగ్

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్ : సన్న బియ్యం పథకంలో అర్హులైన వారి అందరికీ (రేషన్ కార్డుదారులకు) పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టొప్పోతో కలిసి జిల్లాలో ఆకస్మిక పర్యటనలు చేశారు. నెల్లికుదురు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు దారుల ఆన్లైన్ నమోదు ప్రక్రియ పరిశీలించి, మండల కేంద్రంలోని రేషన్ దుకాణం నెంబర్ 1ను తనిఖీ చేసి డీలర్ మద్ది బుజ్జమ్మతో మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అర్హులైన రేషన్ కార్డు దారులందరికి అందించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రస్తుత ఎండాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్స్ పరిధిలలో ముందస్తు వైద్య క్యాంపులు నిర్వహించాలని తగినన్ని మందులు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. పౌర సరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, నెల్లికుదురు తాసిల్దార్ రాజు, మహబూబాబాద్ తాసిల్దార్ భగవాన్ రెడ్డి, ఎంపీడీవో రఘుపతి రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ అంటే పేదల ప్రభుత్వం : మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర - తిరుమలపాలెం : ఇందిరమ్మ ప్రభుత్వం అంటే పేదల ప్రభుత్వం అని, పేదలకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చిత్తశుద్ధితో అమలు చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం మంత్రి తిరుమలాయపాలెం మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేసారు. ఇస్లావత్ తండాలో 30 లక్షలతో, మేడిద పల్లిలో 20 లక్షలతో, తెట్టెలపాడులో 20 లక్షలతో, పిండిప్రోలులో 30 లక్షలతో, తిరుమలాయ పాలెంలో 30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డులను, 60.20 లక్షలతో నిర్మించిన సహకార సంఘం గోదాం, కార్యాలయ భవనాన్ని, పిండిప్రోలులో నాబార్డు వారి స్పెషల్ రీఫైనాన్స్ స్కీమ్ క్రింద 47.52 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన పిఎసిఎస్ గోదాం, అగ్రి అవుట్ లెట్స్ ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో తాను మంత్రిగా ఉన్నానని, తాను కొత్తగూడెం వెళ్తాననే ప్రచారం అబద్ధమని స్పష్టం చేశారు. తిరుమలాయపాలెం మండలంలో 14 కోట్లతో గ్రామాలలో రోడ్లు మంజూరు చేశామని. వాటితో పాటుగా సుమారు 2 కోట్ల 74 లక్షలతో ఖమ్మం నుంచి వరంగల్ ఆర్ అండ్ బీ రోడ్డు తక్కెలపాడు వయా పిండిప్రోలు రోడ్డు కూడా మంజూరు అయిందని, త్వరలోనే ప్రారంభించి పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళు.., సన్న బియ్యం పంపిణీ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అందిస్తున్నామని అన్నారు. రాబోయే రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లను విడతల వారీగా ప్రతి గ్రామంలో వేసవి కాలంలో ఇండ్లు నిర్మించుకునేలా మంజూరు పత్రాలు అందిస్తామని అన్నారు. మొదటి విడత లోనే రాష్ట్రంలో ప్రభుత్వం 4.5 లక్షల ఇండ్లు మంజూరు చేసిందని, రాబోయే 4 సంవత్సరాలలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, జిల్లా సహకార అధికారి గంగాధర్, ఆర్ అండ్ బి ఎస్ ఇ యుగంధర్, ఇర్రిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, ఏడిఏ సరిత, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, మండల ఎంపిడివో సిలార్ సాహెబ్, ఇంచార్జ్ తహసీల్దార్ సుధీర్, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నేరస్తుడికి జీవిత ఖైదు : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: పోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదును విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ గురువారం తీర్పును వెల్లడించారు. దీంతో బాధితుల్లో ఆనందం వ్యక్తం అయింది. పోలీసులు అందించిన కేసు వివరాల్లోకి వెళితే గతేడాది జూలై 4న ఇల్లందుమండలం తంగేళ్లగడ్డకు చెందిన భూక్య నాగేశ్వరరావు తన బంధువు కుమార్తెలయిన 6 ఏళ్ళు, 4 ఏళ్ళ అక్కా చెల్లెలు ఇద్దరిని చాక్లెట్ ఇస్తానని చెప్పి తన ఇంట్లోకి తీసుకొని వెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. చిన్నారులు అరుపులకు నాగేశ్వరరావు పారిపోయినాడు. తమ పై జరిగిన దాష్టికాన్ని బాలికలు తల్లిదండ్రులకు చెప్పారు. దింతో తండ్రి మరుసటి రోజు ఇల్లందు పోలీసులకు ఫిర్యాదు చేసారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ బత్తుల సత్యనారాయణ కేసు నమోదు చేసారు. అప్పట్లో ఇల్లందు ఇంచార్జి డిఎస్పి గా వ్యవహరిస్తున్న ప్రస్తుత కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రెహమాన్ సమగ్ర విచారణచేపట్టారు. ఇరు పక్షాల వాదనలు విన్న జడ్జి నిందితుడు భూక్యా నాగేష్ అలియాస్ నాగేశ్వరరావు పై నేరం రుజువు కావడంతో అతనికి జీవిత ఖైదు తోపాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషిచేసిన డిఎస్పీ లు రెహమాన్, చంద్రభాను తోపాటు ఇల్లందు సీఐ సత్యనారాయణ, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలగల నాగిరెడ్డి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పివిడి లక్ష్మి, భరోసా సెంటర్ కొత్తగూడెం లీగల్ ఆఫీసర్ గద్దాడ శిరీష, కోర్ట్ నోడల్ ఆఫీసర్ ఎస్సై జి.ప్రవీణ్ కుమార్, లైజన్ ఆఫీసర్ ఎస్కే అబ్దుల్ ఘని, డ్యూటీ ఆఫీసర్ తాళ్లూరి శ్రీనివాసరావు లను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు.

వేగంగా జరుగుతున్న ఉపాధి హామీ పనులు : యంపిడిఓ

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : మంగపేట మండలంలోని వివిధ గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులు వేగంగా జరుగుతున్నాయని, 710 మంది ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్నారని మంగపేట మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి బానోత్ భద్రు నాయక్ తెలిపారు. గురువారం ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ రాజ్ యువ శక్తి పథకం కోసం ఇప్పటికే 1633 మంది దరఖాస్తులు పెట్టున్నారని, పూరెడ్ పల్లి గ్రామం మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్ల పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

విద్యార్థినిలు లక్ష్యసాధనకు కృషి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : విద్యార్థినిలు ఉన్నత లక్ష్యసాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. గురువారం ఆమె నల్గొండ జిల్లా, పెద్దవూర లోని గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినిలతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. భోజనం ఎలా ఉందని ఎలా చదువుకుంటున్నారని ప్రశ్నించారు. బాగా చదువుకోవాలని చెప్పారు. ఐఐటి అంటే ఏమిటి? క్రిటికల్ కేర్ యూనిట్ జాకెట్ తదితర పదాలకు స్పెల్లింగ్‌లను అడిగి తెలుసుకున్నారు. అంతేగాక కాకతీయ సామ్రాజ్యం, ఇతర సామ్రాజ్యాలు, మహాలక్ష్మి దేవత, గురించి అడిగి వారి తెలివితేటలను పరిశీలించారు. ఐఐటీ సాధించేందుకు లెక్కల్లో పర్ఫెక్ట్‌గా ఉండాలన్నారు. ఐఐటి చదివే విద్యార్థులకు నల్గొండలో ఉచితంగా కోచింగ్ ఇప్పిస్తానని, ఎంత మందికి కోచింగ్ కావాలో పేర్లు ఇవ్వాలని అడిగారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, గిరిజన సంక్షేమ శాఖ ఇన్చార్జి అధికారి రాజ్ కుమార్, స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ ఉన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొమరం భీం : ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాంతో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఆయుష్ వైద్యులు, ప్రధానమంత్రి జన్ మన్ వైద్య సిబ్బంది, సూపర్ వైజర్లతో వైద్య ఆరోగ్య సేవలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల గిరిజన ప్రాంతాలు, పి వి టి జి ప్రాంతాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది పర్యటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించే దిశగా చర్యలు తీసుకోవాలలన్నారు.

కార్పోరేట్ల ఖజానా నింపుతున్న ప్రధాని మోడీ...

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : గ్యాస్, ఇందన, నిత్యావసర సరుకుల ధరలను ఇష్టారా జ్యాంగ పెంచుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తన అనుకూల కార్పోరేట్ల ఖజానాను నింపుతున్నట్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, చుంచుపల్లి మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలిలని డిమాండ్ చేస్తూ గురువారం సిపిఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శేషగిరిభవన్ నుంచి బస్టాండు సెంటర్ వరకు ఖాళీ సీలిండర్లతో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమరవీరుల స్తూపం సెంటర్లో మానవాహారం చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 11ఏళ్ళ మోడీ సారథ్యం లోని కేంద్ర పాలనలో ప్రజలెవరూ సంతోషంగా లేరన్నారు. కార్పోరేట్ కంపెనీలకు గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుకునే వెసులుబాటు కల్పించిన మోడీ ప్రభుత్వం సామాన్యుల నడ్డి విరుస్తోందని విమర్శించారు. సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు వీరాస్వామి, గెడ్డాడు నగేష్, భూక్యా శ్రీనివాస్, ఎస్ కె. ఫహీమ్, రత్నకుమారి, ధనలక్ష్మి, జె. గట్టయ్య, ధర్మరాజు, యండి. యూసుఫ్, పాటి మోహన్, నేరెళ్ల రమేష్, గుత్తుల శ్రీనివాస్, బోయిన విజయ్ కుమార్, సత్యనారాయణ చారి, దుర్గ, విజయలక్ష్మి, శ్రీను, జహీర్, విజయలక్ష్మి, షమీమ్, రసూల్, వినయ్, చందర్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

విశాలాంధ్ర- తొర్రూర్: అకాల వర్షంతో నష్టపోయిన రైతులను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తొర్రురు మండలం హరిపిరాల గ్రామంలో వడగండ్ల వానకు నేలకొరిగిన వరి పొలాలను స్థానిక బి.ఆర్.ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి పరిశీలించారు. హరిపిరాల గ్రామానికి చెందిన రైతు కూన వెంకన్న తాను 10 ఎకరాల వరి పొలం వేశానని వడగండ్ల వానకు తాను నష్టపోయానని తన గోడు మాజీమంత్రి దయాకర్‌రావుకు బోరున విలపించి విన్నవించుకున్నాడు. ఈ సందర్భంగా మాజీ మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీ ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. రైతులను ఆగం చేసి, వాళ్ళకి కనీసం సాగునీరు ఇయ్యకుండా ఇప్పటికే రైతులు నష్టపోయారని, సాగునీరు ఇయ్యకుండా నష్టపోయిన రైతులకు వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు 25000 వేల నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ జెడ్పి ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చిన్న అంజయ్య, కుర్ర శ్రీనివాస్, అంకుష్, జిల్లా, మండల, గ్రామ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సోలిడార్ విద్యార్థులకు అభినందనలు : ఎస్సై

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : సోలిడార్ తెలంగాణ బధిర పాఠశాల విద్యార్థులకు కొండమల్లేపల్లి ఎస్సై ముత్యాల రామ్మూర్తి అభినందనలు తెలియజేశారు. ఇటీవల కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రంలో జరిగిన జాతీయ స్థాయి క్రీడలలో సోలిడార్ తెలంగాణ పాఠశాల విద్యార్థులు పాల్గొని విజయం సాధించారు. ఈ సందర్భంగా సోలిడార్ తెలంగాణ పాఠశాల నిర్వహకులు కొండమల్లేపల్లి లో 80 మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కొండమల్లేపల్లి ఎస్సై ముత్యాల రామ్మూర్తి గురువారం జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీర బలం కన్నా బుద్ధిబలం గొప్పదని ఇట్టి విషయాన్ని గ్రహించి విద్యార్థులు క్రీడలలో రాణించడం అభినందనీయమన్నారు. పాఠశాల నిర్వాహకులను ఎస్సై అభినందించారు. కొండమల్లేపల్లి ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ ఏరుకొండ రాము, క్రాంతి కళాశాల ప్రిన్సిపాల్ దుండిగళ్ల అశోక్, సోలిడార్ తెలంగాణ పాఠశాల డైరెక్టర్ దార్ల భాస్కర్, నిర్వాహకులు సురేష్ కుమార్, ఏరుకొండ చంద్రయ్య, వినోద్, సైదా నాయక్, వెంకటమ్మ, సంపత్, కవిత పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షలో బోల్లేపల్లి విద్యార్థులు ప్రతిభ

విశాలాంధ్ర - గూడూరు : తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్షలో బోల్లేపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రధానోపాధ్యాయులు ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్షలకు నలుగురు విద్యార్థులు వ్రాయగా ముగ్గురు విద్యార్థులు వారి ప్రతిభ కనబరిచి గురుకులాలలో సీట్లు పొందారనీ ఆనంద్ తెలిపారు. హెచ్ అక్షయ, పాలెపు నాగమోక్షిత్, సంగేపు. సాద్విన్, ముగ్గురు విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్, ఉపాధ్యాయులు రామచందర్, విద్యార్థుల తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల రామచంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలే విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు విస్తాయని అందుకు నిదర్శనమే ఈ గురుకులాల సీట్లను పొందిన విద్యార్థులని తెలిపారు.

జనక్ ప్రసాద్‌కు ఐఎన్టీయుసి నేత షకీర్ సన్మానం

విశాలాంధ్ర - ఇల్లందు : ఐఎన్టీయూసీ వేజ్ బోర్డ్ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ను ఏరియా ఐఎన్టీయూసీ సభ్యుడు ఎండి. షకీర్ ఆత్మీయంగా సన్మానించారు. గురువారం ఇల్లందు ఏరియా జేకే -5 ఓసిలో జరిగిన ఫిట్ మీటింగ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనక్ ప్రసాద్ వచ్చారు. ఆయనను షకీర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఐఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, త్యాగరాజన్, జనరల్ సెక్రెటరీ ఆల్బర్ట్, సెంట్రల్ కమిటీ మెంబర్ శ్రీనివాస్ లు కూడా పాల్గొన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం తమ సంఘం నిరంతరం కృషి చేస్తుందని జనక్ ప్రసాద్ ఈ సందర్భంగా తెలిపారు. రాబోయే కాలంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఐఎన్టీయూసీ నేతలు, కార్యకర్తలకు ఆయన దిశా నిర్దేశం చేశారు.

ఇంగ్లీష్‌పై భయాన్ని పోగొట్టి ఆత్మస్థైర్యాన్ని పెంచాలి : కలెక్టర్

విశాలాంధ్ర - ములుగుజిల్లా బ్యూరో : ఇంగ్లీష్ పట్ల భయాన్ని పోగొట్టి ఆత్మస్థైర్యాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని 54 ప్రాథమిక పాఠశాలల్లో రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు దిశ ఫౌండేషన్, ఈ ఎల్ ఎఫ్ ఇంగ్లీష్ సహకారంతో చేపట్టిన 80 రోజుల లెర్న్ టు రీడ్ (ఇంగ్లీష్ బోధన కార్యక్రమం) ముగిసిందనున జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ వేడుకకు జిల్లా కలెక్టర్ దివా కర టిఎస్ ముఖ్య అతిథిగా పాల్గొని పిల్లల్లో ఇంగ్లీష్ పట్ల భయాన్ని పోగొట్టి ఇంగ్లీష్ మాట్లాడాలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కలెక్టర్ మెమెంటో, సర్టిఫికెట్‌లను అందచేశారు. జిల్లా విద్యాశాఖాధికారి జి పాణిని, సెక్టోరల్ అధికారి అర్షం రాజు, సాంబయ్య, దిశా ప్రతినిధులు ఐశ్వర్య, ప్రతిభ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకోదండ రామాలయ తొలి వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్లలో నిర్మించిన శ్రీ కోదండ రామస్వామి దేవాలయం తొలి యేడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రథమ వార్షికోత్సవ వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ కొణతం సత్యనారాయణ రెడ్డి, ధర్మకర్త రాచకొండ నాగ మాధవ్‌ల నేతృత్వంలో ఆలయ పూజారులు మొలుగు శ్రీనివాసా శాస్త్రి, ఉపేంద్ర శర్మల ఆధ్వర్యంలో మొదట గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రసనం అనంతరం పంచామృతాల కళాశాలతో స్వామివారిలను అభిషేకించారు. అనంతరం పట్టు వస్త్రాలతో స్వామివారిని అలంకరించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి రాచకొండ రామ్మోహన్ రావు, కోశాధికారి టిఎన్ స్వామి, పులిజాల వెంకట రమణారావు, గోళ్ళ సుధాకర్, యాగా శ్రీనివాస రావు, ఉప్పల కృపాకర్, నాగండ్ల శ్రీధర్, యడవల్లి వెంకటరెడ్డి, రాగిరెడ్డి గోపాల్ రెడ్డి, మాశెట్టి సైదయ్య, పివిటి, చిత్తనూరు సత్యనారాయణ, గుండా సత్యనారాయణ, రాచకొండ శ్రీనివాసరావు,పొనుగోటి జంగయ్య, రెడ్డిమల్ల వెంకట రమణారెడ్డి, నిమ్మగడ్డ సుబ్బారావు, మురారిశెట్టి రమేష్, కొణతం చిన్న సీతారామ్ రెడ్డి, కొణతం నారాయణరెడ్డి, భువనగిరి అంజయ్య, చింతకుంట్ల పూర్ణ చంద్రారెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీపై విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదు

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : కాంగ్రెస్ పార్టీ అంటే ఈ దేశానికి హానికరమైన వ్యాధులాంటిదని ఎమ్మెల్సీ సీ. అంజి రెడ్డి అన్నారు. గురువారం నాడు సంగారెడ్డి బిజెపి ఆఫీస్‌లో ఏర్పడి చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1885లో రిటైర్డ్ బ్రిటిష్ అధికారి ఏ.ఓ.హ్యూమ్ చేత స్థాపించబడిన ఈ పార్టీ ఇప్పటికీ ప్రజలను మోసం చేసే రాజకీయాన్ని కొనసాగిస్తోందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు తమ చరిత్రను మర్చిపోయి బీజేపీపై విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. బ్రిటిష్ పాలనలో "విభజించి పాలించు" అనే రాజకీయ శిల్పకళ కనిపించగా, బీజేపీ మాత్రం "సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్' అనే నినాదంతో దేశాన్ని ముందుకు తీసుకెళ్లోందని అన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు దేశ్ పాండే, జిల్లా జనరల్ సెక్రటరి రాజశేఖర్ రెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ వెంకట నరసింగారెడ్డి, మల్లిఖార్జున్ పాటిల్, మహిళా మోర్చా జనరల్ సెక్రటరీ మీనా గౌడ్, జిల్లా యువమోర్చా ప్రెసిడెంట్ ప్రవీణ్, జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్, అసెంబ్లీ కో-కన్వీనర్ మల్లేష్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గార్ల : పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక సహకార సంఘం కార్యాలయంలో 97 మంది లబ్దిదారులకు రూ. 30 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం యాసంగి వరి ధాన్యము కొనుగోలు కేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభాగ్యులకు అండగా వుంటూ ఆర్థిక భరోసాగా కల్పించేదే సీఎం రిలీఫ్ ఫండ్ అన్నారు. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులతో తమ ప్రాణాలను రక్షించుకుంటున్నారని తెలిపారు. డీపీవో హరిప్రసాద్, పిఏసిఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, ఎంపీడీఓ మంగమ్మ, హౌసింగ్ పీడీ రాజయ్య, సీఐ రవి కుమార్, ఎం ఏ ఓ రామారావు, ఎం ఈ ఓ వీరభద్రరావు, ఎస్సై రియాజ్ పాషా, రాంసింగ్ నాయక్, హాతీరామ్, శీలంశెట్టి ప్రవీణ్ కుమార్, ధనియాకుల రామారావు పాల్గొన్నారు.

సాగునీటిని విడుదల చేయాలని రైతుల ధర్నా

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్ నియోజకవర్గ నిర్మల్ టు మంచిర్యాల్ రహదారిపై, బుధవారం కడెం మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ చౌరస్తా వద్ద లింగాపూర్, మాసాయిపేట్, ఎలగడప, నచ్చన్ ఎల్లాపూర్, సారంగాపూర్, మల్లన్నపేట్, పాత మద్దిపడగ గ్రామాల రైతులు యాసంగి పంట సదర్ మాట ఆయకట్టకు దిగువన సాగునీటిని పంట చివరి దశ వరకు నీరు అందిస్తామని అధికారులు హామీతో పంట వేసుకున్న రైతులు పంట చివరి దశలో నీరందక ఎండిపోయే దశలో ఉన్నదని రోడ్డుపై ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న కడెం తాసిల్దార్ ప్రభాకర్ రైతుల వద్దకు వచ్చి నీటి విడుదలపై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్‌తో చరవాణి ద్వారా విషయం తెలియజేయడంతో రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ధర్నాను విరమించారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్న బీజేపీ

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్ : భిన్న సంస్కృతులు, మతాలు, కులాలు, జాతులను భాషలను ఒక తాటిపైకి తెచ్చిన రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించే విధంగా, బిజెపి తమ స్వంత ఏకపక్ష విధానాలను అమలు చేయడాన్ని ఖండిస్తున్నానని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు.గురువారం జిల్లాలోని కురవి మండల కేంద్రం అంబేద్కర్ విగ్రహం ముందు సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా పార్టీ కార్యకర్తలు కళ్లకు నల్ల గంతలు కట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ 370 ఆర్టికల్ రద్దు, త్రిబుల్ తలాక్ రద్దు, వక్ఫ్ బోర్డుకు సవరణలు లాంటి ప్రధానమైన నిర్ణయాలను ఏకపక్షంగా ఒంటెద్దు పోకడ నిర్ణయాలు, సమైక్య విధానానికి బంగకరం కలిగించే కేంద్రీకృత విధానాలు, గవర్నర్ వ్యవస్థను, రాజ్యాంగ సంస్థలైన ఈ డి, సీబీఐ, ఎలక్షన్ కమిషన్ లను దుర్వినియోగం చేయడం అవుతుందని ఆరోపించారు. ప్రశ్నించే వారిని, ప్రజాస్వామ్య వాదులపై దాడులను కొనసాగించడం లాంటి విధానాలతో రాజ్యాంగ మూల సూత్రాలకు భంగం కలిగించే విధానాలను ప్రజలు సంఘటితంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరరావు, తురక రమేష్, బుడమ వెంకన్న, కన్నె వెంకన్న, నర్సింగం, గురవయ్య, బొల్లం ఉప్పలయ్య, కలగూర నాగరాజు, బొల్లు వెంకన్న, నిలుగొండ నాగేశ్వరరావు, జిన్న వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత సింగరేణిగా మార్చేందుకు కృషి చేయాలి

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: గనులలో రక్షణపై ప్రతి ఒక్కరిలో అవగాహనా కల్పిస్తూ ప్రమాద రహిత సింగరేణిగా మార్చేందుకు కృషి చేయాలని పలువురు వక్తలు అన్నారు. గురువారం అర్జీ.1 ఏరియా కాన్ఫరెన్స్ హాలులో రామగుండం రీజియన్ రక్షణ అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్య అతిథులుగా డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఎన్. నాగేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ బానోతు వెంకన్న, కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్, అర్జీ 1 జీఎం డి.లలిత్ కుమార్ అర్జీ 3 జీఎం ఎన్.సుధాకర్‌రావు, జీఎం ఏపీఏ నాగేశ్వరరావు, రెస్క్యు జీఎం శ్రీనివాస్‌రెడ్డి, అర్జీ 2 ఇంచార్జ్ జీఎం. రాముడు, రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం కే.హెచ్.ఎన్. గుప్తాలు పాల్గొని మాట్లాడారు. వారు మాట్లాడుతూ సులపై పని ప్రదేశాలలో రక్షణ స్లొగన్స్ ఏర్పాటు చేయాలని, భూగర్భ గనులలో త్రాగునీరు, రెస్ట్ షెల్టర్స్, ఫస్ట్ ఎయిడ్ షెల్టర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రాములవారి తలంబ్రాలు లేక నిరాశతో వెనుదిరిగిన జర్నలిస్టులు

విశాలాంధ్ర - పినపాక : జిల్లా జర్నలిస్టులకు శ్రీ సీతారామచంద్రుల వారి తలంబ్రాలు ఇస్తామని... ఆలయానికి వెళ్లగా గంటల తరబడి నిరీక్షణ చేయించి తీరా ఎఈఓ నిర్లక్ష్యంగా ఇవ్వనని చెప్పడంతొ సర్వత్ర ఆగ్రహం వ్యక్తం అవుతుంది. బుధవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటన విడుదల చేస్తూ గురువారం ఒక్కరోజే మాత్రమే సిఆర్ఓ కార్యాలయంలొ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ జర్నలిస్టులకు తలంబ్రాలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. భద్రాచలం దేవాలయానికి వెళ్లి తలంబ్రాల పాకెట్లు తీసుకోవాల్సిందిగా కోరారు. దీంతో జిల్లాలోని కొందరు జర్నలిస్టులు భద్రాచలం దేవాలయానికి ఉదయమే వెళ్లారు. అక్కడ ఆలయ కార్య నిర్వహణ అధికారిణి (ఈ ఓ) రమాదేవి ని కలిసేందుకు వెళ్లగా ఆమె హైదరాబాద్ వెళ్ళినట్లు సిబ్బంది సమాచారం ఇచ్చారు. దింతో అక్కడే ఉన్న ఎఈ ఓ శ్రావణ్ కుమార్‌కు తమిచ్చిన విషయం జర్నలిస్టులు వివరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడి కాపులు దాచిన జర్నలిస్టులకు, ఇప్పుడు తాను ఇవ్వటం కుదరదని ఎఈఓ నిర్లక్ష్యం గా సమాధానం చెప్పడంతో జర్నలిస్టులు అవాక్కయ్యారు. అక్కడ ఉన్న జర్నలిస్టులలో ఒకరు డిపిఓ కు ఫోన్ చేసి విషయం చెప్పారు. దీంతో స్పందించిన డిపిఓ లైన్‌లో ఉండి.. ఫోన్ ఏఈఓకు ఇవ్వండి తాను మాట్లాడుతానని కోరారు. కానీ ఎ ఈ ఓ డిపిఓ తో మాట్లాడటానికి నిరాకరించి.. మీరు ఎవరితోనైనా చెప్పుకోండి తాను మాత్రం ఇవ్వనని మొండి సమాధానం చెప్పటం ఆశ్చర్యం కలిగించింది. చేసేదేమీ లేక తీరా దిక్కుతోచని పరిస్థితుల్లో జర్నలిస్టులు వెనుదిరిగి నిరాశగా తమ ప్రాంతాలకు వెళ్లిపోయారు.

కుల మత బేధభావం మేరగని సింగరేణి బిడ్డలు...

విశాలాంధ్ర - కొత్తగూడెం : సింగరేణి ప్రాంత ఉద్యోగులు కుటుంబాల్లో కులమత బేధం లేని దశాబ్దాల నుంచి సోదరభావం, సాన్నిహిత్యం కొనసాగుతుందని సింగరేణి అధికారులు అన్నారు. గురువారం కొత్తగూడెం ఏరియా వర్క్ షాప్ లో జమతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో రంజాన్ పండుగ నేపథ్యంలో నిర్వహించే ఈద్ మిలాబ్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా సింగరేణి అధికారులు శ్రీకాంత్, శివకేశవరావు తోపాటు ఐన్టీయుసీ వైస్ ప్రెసిడెంట్ యండి. రజాక్ లు పాల్గొని మాట్లాడారు. ఈ ప్రాంతంలో ఆదినుంచి కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరి ప్రతి పండుగల ఆనందాన్ని కలిసి పంచుకోవడం అభినందనీయమన్నారు. ఒకే కుటుంబం ఒకే లక్ష్యం అనే నినాదంతో ముందుకు సాగుతున్న సింగరేణి లో కులమతాల ప్రస్తావన ఉండదన్నారు.

ధన్యజీవి మహ్మద్ రజబ్ ఆలీ

విశాలాంధ్ర - ఖమ్మం : నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి తుదిశ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడి పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహ్మద్ రజబ్ ధన్యజీవి అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు తెలిపారు. మాజీ శాసన సభ్యులు, సిపిఐ నాయకులు మహ్మద్ రజబ్‌అలీ 29వ -వర్ధంతి సందర్భంగా గురువారం ఖమ్మం బైపాస్ రోడ్డులోని గిరిప్రసాద్ భవన్లో ఆయన చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాగం హేమంతరావు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో, ప్రజా సమస్యల పరిష్కారం కోసం రజబ్‌అలీ అలుపెరుగని పోరాటాలు సాగించారన్నారు. గిరిజనుల పక్షపాతిగా నిలిచిన ఆయనను లంబాడోళ్ల రాందాస్ గా పిలుచుకుంటారన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, యర్రాబాబు, కొండపర్తి గోవిందరావు, పోటు కళావతి, బిజి క్లైమెంట్, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు సిహెచ్ సీతామహాలక్ష్మి, గాదె లక్ష్మి నారాయణ, యానాలి సాంబశివారెడ్డి, సైదా, ఎస్ కె చానా, బోడా వీరన్న, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

సంపాదకీయం

కాంగ్రెస్ "న్యాయ పథం"

మంగళ, బుధవారాల్లో గుజరాత్ లోని సబర్మతి ఒడ్డున జరిగిన కాంగ్రెస్ విస్తృత వర్కింగ్ కమిటీ సమావేశంలో అంతో ఇంతో పోరాట పటిమ కనబర్చారు. కాంగ్రెస్ కొద్ది కాలంగా వదిలేసిన సిద్ధాంత ప్రాతిపదికను పునరుద్ధరించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ చేస్తున్న ప్రయత్నానికి ఈ విస్తృత వర్కింగ్ కమిటీ సమావేశంలో కార్య రూపం ఇవ్వడానికి ప్రయత్నించినట్టు స్పష్టంగా కనిపించింది. కొన్ని మౌలిక అంశాల మీద లోతైన చర్చ కూడా జరిగింది. శశిథరూర్ లాంటి వారు తమ మనసులోని మాట చెప్పగలిగారు. ఈ మధ్యకాలంలో బీజేపీ మాట్లాడితే జాతీయవాదం అంటోంది. అయితే ఈ జాతీయవాదం స్వాతంత్ర్యోద్యమ కాలంలో వ్యక్తమైన జాతీయ వాదం కాదు. ఇది విద్వేషపూరితమైన జాతీయ వాదం. సమాజంలోని గణనీయమైన సంఖ్యలో ఉన్న మైనారిటీలను, ముఖ్యంగా ముస్లింలను రెండవ శ్రేణి పౌరులుగా దిగజార్చే జాతీయవాదం మాత్రమే. బీజేపీ జాతీయవాదం గాంధీ, నెహ్రూ, రవీంద్రనాథ్ ఠాగోర్ లాంటి వారు చెప్పిన, అనుసరించిన జాతీయ వాదం కాదు. బీజేపీ జాతీయవాదం మన దేశంలో ఉన్న వైవిధ్యాన్ని తుడిచిపెట్టడానికి ప్రయత్నిస్తుంది. కాంగ్రెస్‌తో సహా అనేక ఇతర రాజకీయ పార్టీలు, ఆలోచనాపరులు, మేధావులు ప్రస్తావించే జాతీయవాదం ఈ దేశంలోని వైవిధ్యాన్ని, భిన్నత్వాన్ని పరిరక్షించేది. దేశంలోని వారినందరినీ ఎలాంటి అరమరికలు లేకుండా ఐక్యం చేయడానికి ఉద్దేశించింది. ఈ అంశాన్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో నీళ్లు నమలకుండా పునరుద్ఘాటించారు. ఇంత కాలం కాంగ్రెస్ ఈ విషయాన్ని ఎన్నడూ ఇంత స్పష్టంగా చెప్పలేదు. మైనారిటీలను ప్రస్తావించినప్పుడల్లా కాంగ్రెస్ ఇంతవరకూ మతపరమైన అల్ప సంఖ్యాక వర్గాలు అని అస్పష్ట రీతిలో ప్రస్తావించేది. ఇప్పుడు కచ్చితంగా ముస్లింలు, క్రైస్తవులు బీజేపీ ఆగడాలకు ఎలా గురవుతున్నారో నిర్మొహమాటంగా చెప్పారు. ముస్లింల తరఫున వకాల్తా పుచ్చుకుని మాట్లాడడానికి ఇంతవరకు జంకుతూ వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు కాస్త సాహసించినట్టుంది. రెండు రోజుల పాటు జరిగిన సమావేశంలో కాంగ్రెస్ ఒక అడుగు ముందుకు వేయడానికి ప్రయత్నించింది. గుజరాత్‌లో మిమ్మల్ని ఓడించి తీరతాం అని రాహుల్ గాంధీ ఇదివరకు బీజేపీకి బాహాటంగా సవాలు విసిరారు. ఈ సవాలును మరో అడుగు ముందుకు తీసుకు పోవడానికా అన్నట్టు విస్తృత వర్కింగ్ కమిటీ సమావేశం బీజేపీకి అపారమైన బలం ఉన్న గుజరాత్‌లో ఏర్పాటు చేశారు. మోదీ, అమిత్‌షా గడ్డ మీదే బీజేపీని లొంగదీయాలన్న అభిప్రాయం కాంగ్రెస్ శ్రేణుల్లో ఈ రెండు రోజుల్లో స్పష్టంగా వ్యక్తం అయింది. రెండు రోజుల చర్చల పర్యవసానంగా బుధవారం రోజు ఒక తీర్మానం ఆమోదించారు. ఈ తీర్మానం కాంగ్రెస్ సంకల్ప బలాన్ని తెలియజేస్తోంది. సంఘ్ పరివార్‌కు చెందిన వారెవరికీ జాతీయోద్యమంలో పాల్గొన్న చరిత్ర లేదు. అంతో ఇంతో పాల్గొన్నారనుకునే సావర్కర్ లాంటి వారు అనేక రీతుల క్షమాపణలు చెప్పి, కడకు బ్రిటీష్ ప్రభుత్వం నుంచి పించన్ కూడా తీసుకున్నారు.

స్వాతంత్ర్యోద్యమంలో తమకు చెప్పుకోదగ్గ నాయకులెవరూ లేరు కనక బీజేపీ సర్దార్ పటేల్‌ను సొంతం చేసుకోవడానికి పడరాని పాట్లు పడింది. కానీ పెద్దగా ఫలితం దక్కినట్టు లేదు. పటేల్‌ను తమ ఖాతాలో వేసుకోవడానికి బీజేపీ చేసిన ప్రయత్నంలో డొల్ల తనాన్ని కాంగ్రెస్ రెండు రోజుల సమావేశంలో గట్టిగా ఎండగట్టారు. అగ్ర నాయకులు చెప్పింది వినడం, ప్రతిపాదించిన తీర్మానానికి రెండో మాట లేకుండా సమ్మతి తెలియజేయడం అనే సంప్రదాయాన్ని ఈ సమావేశంలో పక్కన పెట్టినట్టు కనిపించింది. సచిన్ పైలెట్ ప్రతిపాదించిన తీర్మానం మీద కనీసం మూడు డజన్ల మంది మాట్లాడే అవకాశం ఇచ్చారు. ఇమ్రాన్ ప్రతాప్ ఘడీ, కన్హయ కుమార్, దివ్య లాంటి యువనేతలు తమ మనసులో మాట నిర్భయంగా చెప్పడానికి అవకాశం ఇచ్చారు. జిల్లా స్థాయి కాంగ్రెస్ అధ్యక్షులకు ప్రాధాన్యం ఇస్తామనడం మరో సానుకూల పరిణామం. కాంగ్రెస్‌లో చాలా మంది నాయకులున్నారు కానీ పార్టీకోసం నిలబడే కార్యకర్తలు లేరు అన్న అపప్రథ తొలగించుకునే ప్రయత్నం ఈ రెండు రోజుల్లో కనిపించింది. పార్టీ కోసం పని చేయని వారు పార్టీ నుంచి విరమించుకోవచ్చు అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే గట్టి హెచ్చరికే జారీ చేశారు. అయితే ఈ గంభీరమైన ప్రకటనలను ఎంత మేరకు ఆచరణలో పెడ్తారో చూడాలి. ఒక వేపు బీజేపీ అన్యాయ ప్రవర్తనను ఎదుర్కోవడానికి ఘర్షణకైనా సిద్ధ పడాలని, మరో వేపు ప్రజల ఆకాంక్షలకు ప్రాధాన్యం ఇవ్వాలని, అధికార పార్టీపై కేవలం విమర్శలకే పరిమితం కాకుండా సానుకూలంగా వ్యవహరించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. దీన్నే "న్యాయ పథం" అన్నారు. నూతన ఉత్సాహం నింపే వ్యూహాన్ని కాంగ్రెస్ ఖరారు చేసి ఉండొచ్చు. కాని ఈ వ్యూహాన్ని అమలు చేసే యంత్రాంగం ఉందా అనేది అనుమానమే. అందుకే కాంగ్రెస్‌లో వ్యవస్థాగతమైన మార్పులు చేస్తామని కూడా ప్రకటించారు. ఈ సమావేశాల్లో రెండు రకాల ధోరణులు వ్యక్తమైనాయి. ఒకటి ప్రస్తుతం అనుసరిస్తున్న బీజేపీతో ఘర్షణ పడే ధోరణిని కొనసాగించడం, రెండవది సానుకూల వైఖరి అనుసరిస్తూ, ఆశాభావం కలిగిస్తూ, అందరినీ కలుపుకు పోయే విధానాన్ని అనుసరించడం. మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ ప్రసంగాలలో వాడిగా విమర్శలు గుప్పించారు. రాజకీయంగా ఇది వారి దృష్టితో చూస్తే అవసరం కావొచ్చు. కానీ శశీథరూర్ లాంటివారు ప్రజల్లో ఆశాభావం కలిగించే రీతిలో కాంగ్రెస్ ఉండాలన్నారు. దీన్ని అగ్ర నాయకత్వం నిరాకరించకపోవడం సానుకూలమైన అంశమే. చివరకు ఆమోదించిన తీర్మానంలో ఈ రెండు ధోరణులకూ స్థానం కల్పించారు. గుజరాత్‌లో ఈ సమావేశం ఏర్పాటు చేయడానికి రెండు కారణాలు చూపారు. మొదటిది మహాత్మా గాంధీ అధ్యక్షుడిగా ఉండి వంద సంవత్సరాలు పూర్తి కావడం. రెండు సర్దార్ పటేల్ 150 వ జన్మదినోత్సవం కావడం. "న్యాయ పథ్" తీర్మానాన్ని ఆమోదించడం ద్వారా మహాత్మా గాంధీ, సర్దార్ పటేల్ వారసత్వం తమదేనని ఢంకా మీద దెబ్బ కొట్టి కాంగ్రెస్ ప్రకటించినట్టయింది. అయితే ఇంతకాలం కాంగ్రెస్ ఈ పని ఎందుకు చేయలేదో తెలియదు. ప్రస్తుతం వికృత రూపం ప్రదర్శిస్తున్న విద్వేషం, ప్రతికూలత, నిరాశ కాంగ్రెస్‌ను కుంగదీయలేవని; ఆశ, ఆకాంక్ష, సానుకూలతతో ముందుకు సాగుతామని "న్యాయ పథ్" తీర్మానంలో భరోసా ఇచ్చారు. అదే సమయంలో పోరాటమూ కొనసాగించాలని నిర్ణయించారు. బీజేపీ ప్రవచించే జాతీయవాదం కేవలం హిందూ జాతీయవాదం అని కాంగ్రెస్ తెగేసి చెప్పడం మంచి పరిణామమే. సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయం, ప్రజలను సాధికారులను చేయడమే అసలైన జాతీయవాదం అని వర్కింగ్ కమిటీ నిర్ధారణకు వచ్చింది.

జలం వినా జీవనం నాస్తి

కోట దామోదర్

నీరు లేకుండా ఏ జీవి కూడా బతకజాలదు, అందుకనే "జలం వినా జీవనం నాస్తి" అంటారు. మనం నీటిని పొదుపుగా ఉపయోగిస్తే, ప్రతి నీటి చుక్క మన భవిష్యత్తు తరాలను కాపాడుతుంది. నీటిని వృథా చేస్తే, భవిష్యత్తు తరాలు అందుకు మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. జనాభాకు తగినట్టు నీటి సరఫరా ఉండడంతో, కొన్నేళ్ల క్రితం వరకు ప్రధాన నగరాల్లో నీటి కొరత అంత తీవ్రంగా ఉండేది కాదు. కానీ ఇప్పుడు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అత్యధికంగా భూగర్భ జలాల వినియోగం, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ కారణంగా యథేచ్ఛగా అటవీ నిర్మూలన వంటి అంశాలతో నీటి సమస్య మరింత తీవ్రమవుతోంది. పర్యావరణ అసమతుల్యత కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడడం, వర్షపు నీటి సంరక్షణ, మెరుగైన సరస్సు నిర్వహణ లేకపోవడం వల్ల నీటి సమస్య గణనీయంగా పెరిగింది. నీటి సమస్యను అధిగమించాలంటే ప్రతి ఒక్కరూ చైతన్యవంతులై సుజల దీప్తికి బాటలు వేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. బాల్యం నుంచే నీటి పొదుపు జీవన శైలిలో ఒక భాగంగా మార్చాల్సి ఉంది. బెంగళూరు నీటి సంక్షోభాన్ని గట్టెక్కించేందుకు "రెయిన్ రీచ్" కార్యక్రమం ద్వారా పర్యావరణవేత్త హరిహరన్ చంద్రశేఖర్ చేపట్టిన చొరవ ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తుంది.

చాలా నగరాలలో ఏటా కురిసే వర్షపాతంలో దాదాపు 90 శాతం వృథా అవుతోంది. నగరాలలో సరస్సులు కనుమరుగవడం, వర్షపు నీరు భూమిలోకి ఇంకకుండా రోడ్ల నిర్మాణం చేపట్టడంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. నగరాలలో కురిసే వర్షపునీరు డ్రైనేజీ గుండా నేరుగా నదుల్లోకి చేరడం వల్ల భూగర్భజలాల పునరుద్ధరణకు అవకాశం లేదు. నీటిని సంరక్షించడానికి మన జీవనశైలిలో మార్పులు అవసరమని భావించి, పిల్లలలో సరైన అవగాహన కల్పిస్తే తద్వారా నీటిని ఆదా చేయడం చిన్నప్పటి నుంచే అలవాటుగా మారుతుందని పర్యావరణవేత్త డాక్టర్ హరిహరన్ చంద్రశేఖర్ పాఠశాల విద్యార్థులకు నీటి సంరక్షణ గురించి అవగాహన కల్పించడానికి "రెయిన్ రీచ్" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఫలితంగా బెంగళూరులోని 40 పాఠశాలలు ఇప్పటి వరకు 34 మిలియన్ లీటర్ల నీటిని ఆదా చేశారు. విద్యార్థుల ఈ కృషిని స్ఫూర్తిగా తీసుకుని దీనిని ప్రతి ఒక్కరూ అలవర్చుకుంటే నీటికి డోకా ఉండదు. బెంగళూరు మాదిరిగానే హైదరాబాద్‌లో కూడా నీటి సంక్షోభం ఏర్పడే అవకాశం లేకపోలేదు. రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రతతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటడానికి ఎన్నో కారణాలున్నప్పటికీ, అధిక నీటి వినియోగంతో పాటు వర్షపు నీటిని ఒడిసి పట్టి భూమిలోకి ఇంకింపచేయడంలో నగర వాసులు విఫలం కావడం ప్రధాన కారణాలుగా చెప్పొచ్చు. ఈ అంశంపై ప్రభుత్వం తగిన ఆసక్తిని చూపకపోవడం మరో కారణం. ప్రతిచోటా సీసీ రోడ్ల నిర్మాణం కారణంగా నగరంలో ఏటా కురిసే వర్షం నీరు భూమిలోకి ఇంకే అవకాశం చాలా తక్కువ. వర్షం నీరు భూమిలోకి ఇంకాలంటే అందుకు ఇంకుడు గుంత ద్వారానే సాధ్యం అని గ్రహించి మొదటిసారిగా ఇంకుడు గుంతల ఆలోచన ద్వారా జలయజ్ఞానికి శ్రీకారం చుట్టి వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపచేసిన వ్యక్తి బాకారం వద్ద గల పద్మశాలి కాలనీ వాస్తవ్యులు రాజాపేట ఆంజనేయులు. 1997లో ఒకసారి ఆయన అధికారిక పనుల నిమిత్తం గుజరాత్ లోని రాజ్ కోట్ సందర్శించిన సందర్భంగా అక్కడ కొందరు స్త్రీలు రోజంతా తలపై బిందెలు పెట్టుకుని నీళ్లు మోసే దృశ్యం ఆయనకు తీవ్ర బాధ కలిగించింది. అంతేకాక అప్పటికే తమ కాలనీలో కూడా భూగర్భ జలాలు తగ్గి నీటి ఎద్దడి ఏర్పడి ట్యాంకర్లపై ఆధారపడవలసి రావడంతో ఆయన మస్తిష్కంలో మొదటి సారి "ఇంకుడు గుంతల" ద్వారా జలయజ్ఞం చేపట్టాలనే సంకల్పానికి బీజం పడింది. వెంటనే ఆయన తమ కాలనీలోని భావసారూప్యత గల ఐదుగురు మిత్రులతో కలిసి 1997 జులై 31న ప్రయోగాత్మకంగా పూర్తి శాస్త్రీయ ప్రమాణాలతో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశారు. తొలి ప్రయత్నంలోనే ఆంజనేయులు శ్రమ ఫలించి భూగర్భజల మట్టం పెరగడంతో కాలనీలోని మిగతా వారు కూడా ఆయన సారథ్యంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని ఉపశమనం పొందారు.

తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఐఏఎస్ మాజీ అధికారి శాంతా షీలా నాయర్ వ్యూహాత్మక ప్రణాళిక, విధాన రూపకల్పన నైపుణ్యం తీవ్ర నీటి సంక్షోభం నుంచి చెన్నై బయటపడేందుకు దోహదపడింది. 2001లో ఆమె తమిళనాడు బోర్డు కార్యదర్శిగా ఉన్నప్పుడు తీవ్రమైన కరువు ఏర్పడింది. అప్పటి ముఖ్యమంత్రి జయలలిత వర్షపు నీటి సంరక్షణ ప్రాజెక్టును ప్రారంభించి, మొత్తం బాధ్యతను ఆమెకు అప్పగించారు. ఆ తర్వాత ఆమె అన్ని భవనాల్లో వర్షపు నీటి సంరక్షణను తప్పనిసరి చేస్తూ ఒక ఆర్డినెన్స్ జారీ చేశారు. నాయర్ సూచనమేరకు చెన్నైలోని ప్రజలందరూ ఇంటి అవసరాల కోసం ప్రత్యేక ట్యాంకులు, పైపులను ఏర్పాటు చేసుకొని వర్షపు నీటి సంరక్షణకు పూర్తి మద్దతు ఇచ్చారు. నీటి కొరత పరిస్థితులు మరింత తీవ్రరూపందాల్చకముందే దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు వృథా నీటిని ఒడిసి పట్టేందుకు ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతల నిర్మాణం, నిర్వహణ ఒక ఉద్యమంలా చేపడితే, భవిష్యత్తులో నీటి సమస్య ఉండదు.

మొబైల్: 9391480475

కుల వ్యవస్థపై తిరగబడ్డ పూలే

సంగిరెడ్డి హనుమంత రెడ్డి

మహాత్మా జ్యోతిరావు గోవిందరావు పూలే సామాజిక విప్లవ పితామహుడు. అస్పృశ్యుల సామాజిక పరివర్తనకు, సమగ్ర అభివృద్ధికి కృషిచేశారు. అత్యంత ప్రభావశీల రైతు నాయకుడు, పితృస్వామ్య నిరసనకారుడు. కుల వ్యవస్థపై తిరగబడ్డ, 'క్రాంతి సూర్య'గా పేరుబడ్డ సంస్కర్త. శూద్రుల, మహిళల ఆశా జ్యోతి. ప్రతీకార, ప్రతిఘాత శక్తులను, సనాతన సంప్రదాయవాదాన్ని చీల్చిచెండాడారు. జ్యోతిరావు పూర్వీకులు మహారాష్ట్ర సతారా జిల్లా ఖతావ్ తాలూకా కట్గూన్ గ్రామానికి చెందిన మాలి కులస్తులు. మాలి దళితుల్లో పైమెట్టు కులం. నేడు ఇతర వెనుకబడిన కులం (ఓబీసీ). వారి ఇంటి పేరు గోర్హే, జ్యోతిరావు ముత్తాత కొండిబా గో గ్రామచౌగుల (గ్రామాధికారి కార్యాలయ చపరాసి). కొండిబా కట్గూన్ వదిలి పూణే జిల్లా పురందర్ తాలూకా ఖానావాడి గ్రామం చేరారు. కొండిబా కొడుకు షేతిబా పూనా (పూణె) చేరారు. హిందూ రాజులు పేష్వాల ఆస్థానంలో పూల వస్తువులు చేసేవాడు. దీనితో పూలే (పూల మనిషి) అన్న ఇంటి పేరు వచ్చింది. షేతిబాకు ముగ్గురు కొడుకులు - రానోజ, కృష్ణ, గోవింద్. గోవింద్ పూణే దగ్గర కావడి గ్రామస్థుడైన జగదే పాటిల్ కూతురు చిమనాబాయిని పెళ్లాడారు. వీరికి ఇద్దరు కొడుకులు- రాజారామ్, జ్యోతి. చిన్నవాడు జ్యోతిరావు 1827 ఏప్రిల్11న జన్మించారు. మిత్రులు, ప్రజలు జ్యోతిరావును జ్యోతిబా అనేవారు. 'బా' గౌరవ మర్యాదలను, ప్రేమాభిమానాలను సూచిస్తుంది. చదువురానివారు పలకడానికి వీలుగా పేరును జోతిరావుగా మార్చుకున్నారు. ఆ కాలంలో బ్రాహ్మణులు పాఠశాలల్లో తమ కులస్తులకే చదువు చెప్పేవారు. దళితులను రానిచ్చినా వేరుగా కూర్చోబెట్టేవారు. 1834-38 మధ్య జోతిబా ప్రాథమిక విద్య ముగిసింది. బ్రాహ్మణత్వ కుతంత్రాలతో బడిమానిన జోతిబా వ్యవసాయంలోమునిగారు. పూల కొట్టులోనూ పనిచేసేవారు. ఈ దశలో 1840లో సతారా జిల్లా ఖండాలా తాలూకా నార్గావ్ గ్రామస్థుడు ఖండోజీ నెవషె పాటిల్ కుమార్తె సావిత్రిబాయితో, ఆనాటి ఆచారం ప్రకారం అతి చిన్న వయసులో, జోతిబా పెళ్లి అయింది. పెళ్లి నాటికి జోతిబా వయసు 13, సావిత్రిబాయికి 9 ఏళ్లు. సావిత్రిబాయి నిరక్షరాస్యురాలు. అందుకు వెనుకబడిన కులం మహిళ కావడం కారణం.

జోతి ఉత్సాహం గమనించిన పర్షియన్ పండితుడు మున్షీ గఫార్ బేగ్, బ్రిటీష్ ఉద్యోగి లిజత్ సాహబ్ జోతి బంగారు భవిష్యత్తుకు చదువు అవసరమని తండ్రికి నచ్చజెప్పారు. 1841లో మూడేళ్ల విరామం తర్వాత 14 ఏళ్ల వయసులో జోతి స్కాటిష్ మిషనరి బడిలో చేరారు. అక్కడ ఏడు వరకు చదివారు. బడిలో ఆంగ్లో అమెరికన్ రాజకీయ సిద్ధాంతవేత్త, తాత్వికుడు, విప్లవకారి థామస్ పెయిన్ పుస్తకం 'మనిషి హక్కులు' చదివారు. ఈ పుస్తకం సామాజిక పరివర్తనా దృష్టి కలిగించింది. జోతిబా ముస్లిం పిల్లలతో ఆడేవారు. వారి సాంగత్యంలో మతవంచన, కపట నైపుణ్యతల తప్పుడు ప్రచారాలు, మూఢనమ్మకాలు తెలిశాయి. క్రైస్తవ మిషనరీల పరిచయంతో పూలే జ్ఞానం పెరిగింది. వలసవాద యంత్రాంగంలో బ్రాహ్మణుల బంధుప్రీతి, అవినీతి అనుభవానికి వచ్చాయి.

1848లో జోతిబా జీవితంలో దుస్సంఘటన జరిగింది. ఒక మిత్రుని పెళ్లిలో ఉన్నత కులస్తులు కులం పేరుతో అవమానించారు. ఈ ఘటనతో శూద్రుల, అతిశూద్రుల విముక్తికి విద్య ఆయుధమని జోతి గుర్తించారు. 1848లోనే దళిత బాలికలకు, స్త్రీలకు పాఠశాలలు ప్రారంభించారు. బాలికలకు, స్త్రీలకు, దళితులకు పాఠశాలలు ప్రారంభించిన తొలి భారతీయుడు జోతిరావు. జోతిబా దంపతులు వితంతు వివాహాలను ప్రోత్సహించారు. దేవదాసి, సతీ సహగమన దురాచారాలకు వ్యతిరేకంగా, రైతు పన్నుల రద్దుకు, సాగునీటి కాలువల నిర్మాణానికి, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు నడిపారు. బ్రాహ్మణ వితంతువులకు గుండు గీయవద్దని క్షురకులకు నచ్చజెప్పారు. బ్రాహ్మణ వడ్డీ వ్యాపారుల ఉచ్చులో పడకుండా రైతులను చైతన్యపరిచారు. మానభంగాలకు గురయిన వితంతు గర్భవతుల సురక్షిత ప్రసవాలకు, వారి పిల్లల సంరక్షణకు 'శిశుహత్య నిరోధక కేంద్రాలు' ప్రారంభించారు. వితంతువులు, నిరాధార బాలల పోషణకు ఆశ్రమాలు ప్రారంభించారు. విద్యా హక్కు గురించి ప్రచారం చేశారు. ప్రభుత్వాలపై వత్తిడి తెచ్చారు. బడిమానే పిల్లల సంఖ్య తగ్గించడానికి విద్యార్థులకు భోజన, గృహ వసతులు కల్పించారు. విద్యార్థి వేతనాలు ఇచ్చారు. పోషకాహార లోపాలు అరికట్టడానికి పిల్లలకు సమతుల ఆహారం అందించారు. తమ పాఠశాలల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేశారు. పిల్లలకు చిత్రలేఖనం, కళలు నేర్పారు. తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశాలు జరిపారు. పిల్లల మానసిక వికాసంపై దృష్టి కేంద్రీకరించారు. రైతులు, దళితులు, వెనుకబడిన తరగతులవారు, వారి పిల్లలు, కార్మికుల కోసం రాత్రి బడులు ప్రారంభించారు. మాంగ్సన్, మహార్సల్‌లు, దళితుల కోసం 1850 లో 'ద నేటివ్ ఫిమేల్ స్కూల్ ఆఫ్ పుణే", "సొసైటి ఫర్ ప్రమోటింగ్ ఎడ్యుకేషన్ ఆఫ్ మహార్సర్, మాంగ్సర్ ఎట్సెట్రా' పేర్లతో 2 విద్యా సంస్థలు స్థాపించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో జనాభా ప్రాతిపదికన ప్రతి కులానికి ప్రాతినిధ్యం కోసం ఉద్యమాలు నిర్వహించారు. మద్యపానం పేద కుటుంబాలను సర్వనాశనం చేస్తుందనే వారు జోతిబా. ఎక్కువ సారా దుకాణాలకు అనుమతులు ఇవ్వాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను ఖండించారు. బ్రాహ్మణత్వ ఆధిపత్య వ్యతిరేక ఉద్యమాల నిర్మాణానికి పూలే 1873 లో సత్యశోధక సమాజ్‌ను స్థాపించారు. ఇది బ్రాహ్మణత్వ ఆచారాలు, ఛాందసభావాలు, విగ్రహారాధన, కుల వ్యవస్థలకు వ్యతిరేకంగా శూద్రులను చైతన్యపరిచింది. సాంస్కృతిక నిరసనలను, కట్నకానుకలు, పూజారులు, మంత్రశ్లోకాలు లేని నిరాడంబర పెళ్ళిళ్ళను, కులాంతర, వితంతు వివాహాలను ప్రోత్సహించింది. మతాచారాల్లో పూజారుల అవసరాన్ని, బ్రాహ్మణ ఆధిపత్యాన్ని, బాల్య వివాహాలను ధిక్కరించింది. దళితులకు విద్య, సమానత్వం, సామాజిక హక్కులు నేర్పింది. రాజకీయ ప్రవేశం కల్పించింది. 1852 నవంబరు 16న బ్రిటీష్ ప్రభుత్వం జోతిబాను సన్మానించింది. 1888 మే11న మరొక సంఘ సంస్కర్త విఠల్‌రావు కృష్ణాజి వడ్డేకర్ జోతిబాను మహాత్మా బిరుదుతో సత్కరించారు. 1888మే 21న షష్ఠిపూర్తి వేడుకల్లో రావుబహదూర్ బేడేకర్ అనే బిరుదు ప్రదానంచేశారు. మహారాష్ట్ర సామాజిక సంస్కరణ ఉద్యమంలో పూలే ప్రముఖ వ్యక్తిగా గుర్తింపు పొందారు. ప్రభుత్వం జోతిబాను 1876-82 మధ్య పూణే నగరపాలక సంస్థ సభ్యునిగా నియమించింది. జోతిబా తన సంపాదనంతా విద్యాలయాలకు, సేవా సంస్థలకు, సామాజిక కార్యక్రమాలకు ఖర్చుపెట్టారు. చివరికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆరోగ్య చికిత్సకు కూడా ఆయన దగ్గర డబ్బు లేదు. జోతిబా ప్రజల సమాచారం కోసం అనేక నాటకాలు, పుస్తకాలు, పద్యాలు, కవితలు, గేయాలు, 'వ్యవసాయదారుని కొరడాతాడు' పుస్తకం రాశారు.



ప్రచురించి ప్రజలకు పంచారు. ప్రజలకు సులభంగా అర్థమయ్యే భాషలో, పాడుకోవడానికి అనువైనశైలిలో జానపద గేయాలు 'పోవాడా'లు రాసి వీటిని పాడుతూ ప్రజలను చైతన్యపరిచేవారు. 'సత్యధర్మ' పుస్తకంలో ప్రపంచ మతాల గురించి రాశారు. తాను ఆచరించే 'సత్య మతం' మానవతావాద మతమని ప్రశంసించారు. 'గులాంగిరి (బానిసత్వం)' పుస్తకంలో విదేశీ విద్య, ఆంగ్లం, బ్రాహ్మణత్వం, అమెరికా జాత్యహంకారం, భారత బానిసత్వం, భవిష్యత్ కార్య ప్రణాళిక వగైరా అంశాలు వివరించారు. మార్క్స్ బోధించినట్లు జాతీయతతో పాటు అంతర్జాతీయతకూ ప్రాధాన్యత ఇచ్చారు. 'సత్సార్' (సత్యసారం) పుస్తకంలో బ్రాహ్మణాధిపత్య సంస్థలను తీవ్రంగా విమర్శించారు. దళితులకు సభ్యత్వం ఇవ్వని సార్వజనిక సభ, కాంగ్రెస్ కోరుతున్న పరిపాలన బ్రాహ్మణీయతకు దారితీస్తుందని తన రచనల్లో హెచ్చరించారు. మన అంటరానితనాన్ని అమెరికా జాత్యహంకారంతో సరిపోల్చారు. 1888లో జోతిబాకు పక్షవాతం వచ్చి కుడి చేయి పడిపోయింది. పట్టుదలతో ఎడమ చేతితో రాయడం అలవాటు చేసుకున్నారు. రెండున్నరేళ్ల తర్వాత జోతిబా మరలా పక్షవాతానికి గురయ్యారు. రెండు నెలల తర్వాత 1890 నవంబరు 28న మరణించారు. వివిధ రంగాల్లో సేవచేసిన మహాదేవ్ గోవింద రానడే, విష్ణుశాస్త్రి చిప్లున్కర్, గోపాల్ గణేశ్ అగార్కర్, దొండే కేశవ్ కర్వే, పండిత రమాబాయి, గాంధీ కంటే ముందు పుట్టారు పూలే. ఆనాటికే దళిత ఉద్ధరణ, దళిత బాలికల, మహిళా విద్య విముక్తి, సామాజిక విప్లవం పూలే దంపతుల ప్రత్యేకత. దళితుల కోసం పూలే దంపతులు జీవితాలనే త్యాగంచేశారు.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి,
సెల్ 9490204545

శతవసంతాల అరుణపథం

కొత్తపట్నం రాజకీయ పాఠశాల

ఆర్వీ రామారావ్

తమ సభ్యులకు సిద్ధాంతపరమైన శిక్షణ ఇప్పించడానికి కమ్యూనిస్టు పార్టీ మొదటి నుంచీ కృషి చేస్తూనే వచ్చింది. అందులో భాగంగానే 1937 మే నుంచి జూన్ 10వ తేదీ వరకు 40 రోజులపాటు ఒంగోలుకు పది మైళ్ల దూరంలో సముద్ర తీరంలోని కొత్త పట్నంలో రాజకీయ సిద్ధాంత పాఠశాల నిర్వహించాలని సంకల్పించింది. కానీ ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం ఈ రాజకీయ పాఠశాలను నిషేధించింది. పాఠశాలకు హాజరైన వారిపై లాఠీ చార్జీ చేసింది. కొందరిని అరెస్టు చేసింది. అందుకే 40 రోజులు సాగాల్సిన ఈ శిక్షణ శిబిరం మధ్యలోనే 20 రోజుల్లోనే ఆగిపోవలసి వచ్చింది. ఆ తరవాత 1938 లో మంతెన వారి పాలెంలో, 1939 లో మైపాడులోనూ రాజకీయ పాఠశాలలు నిర్వహించారు.

కొత్త పట్నం రాజకీయ పాఠశాలను 1937 మే ఒకటవ తేదీన కేరళ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కృష్ణ పిళ్లై ప్రారంభించారు. కృష్ణ పిళ్లై కేరళలో మొదటి కమ్యూనిస్టు అంటారు. బాట్లీవాలా, దాంగే, సజ్జాద్ జహీర్, హజారా బేగం, బి.శ్రీనివాస రావు, స్వామీ సహజానంద సరస్వతి, జయప్రకాశ్ నారాయణ, అచ్యుత పట్వర్ధన్, బీపీ బేడే, ఎన్.జి.రంగా మొదలైన వారు శిక్షణ ఇచ్చారు. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలను వ్యాపింప చేయడానికి ఏర్పాటు చేసిన రాజకీయ పాఠశాల కొత్త పట్నంలో నిర్వహించిందే. ఈ పాఠశాలకు ఎక్కువగా తోడ్పడింది సాగి విజయ రామ రాజు. ఆయన కాంగ్రెస్‌లో పని చేసే వారు. కమ్యూనిస్టు కాకపోయినా కొత్త పట్నం రాజకీయ పాఠశాల నిర్వహణకు అపారమైన సహకారం అందించారు. ఆయన ప్రగతి శీల ఉద్యమాలను ప్రోత్సహించే వారు. చంద్ర రాజేశ్వర రావు వలంటీర్లకు డ్రిల్లు నేర్పే వారు. అన్నాప్రగడ కామేశ్వరరావు వలంటీర్లకు గెరిల్లా పోరాట చాతుర్యం, తుపాకులు పేల్చడంలో శిక్షణ ఇచ్చారు. సాగి విజయరామ రాజు కర్ర, కత్తి సాము నేర్పేవారు. పాఠశాల నిర్వహణకు అన్నా ప్రగడ కామేశ్వర రావు, నేతి చలపతి రావు, సాగి విజయ రామ రాజు, అల్లూరి సత్యనారాయణ రాజు, మద్దూరి అన్నపూర్ణయ్యతో ఒక కమిటీ ఏర్పాటైంది. మంతెన వెంకట రాజు, సూర్యనారాయణ రాజు లాంటి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కూడా ఈ రాజకీయ పాఠశాలకు విరాళాలిచ్చారు.

ఈ పాఠశాల పదిహేను రోజులు సాగే సరికే ప్రభుత్వానికి కన్ను కుట్టింది. పోలీసు అధికారులు పాఠశాల వ్యవహారాలలో జోక్యం చేసుకోవడానికి ప్రయత్నించారు. తమకు కూడా తరగతులకు హాజరయ్యే అవకాశం ఇవ్వాలని కోరారు. పోలీసులు ఈ పాఠశాలపై ప్రభుత్వానికి అనేక నివేదికలు పంపారు. ఇది శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తోందని చెప్తూ మే 15వ తేదీన దానిని "అక్రమ సంఘం"గా ప్రకటించి నిషేధించారు. అయితే ఎన్.జి.రంగాకు నెహ్రూ రాసిన ఉత్తరంలో మే 20న నిషేధించినట్టు పేర్కొన్నారు. కానీ 1937 మే 18న నిషేధ ఉత్తర్వు జారీ అయింది. పాఠశాలకు హాజరవుతున్న విద్యార్థులు, అధ్యాపకులు ఈ నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘించాలని నిర్ణయించుకున్నారు.

నిషేధ ఉత్తర్వులను అమలు చేయడానికి 1937 మే 21న జిల్లా కలెక్టర్ వెల్లోడీ కొత్తపట్నం వచ్చారు. ఆయనతో పాటు రెండు వ్యాన్ల నిండా రిజర్వు పోలీసులు కూడా వచ్చారు. మరో రెండు బస్సుల నిండా స్థానిక పోలీసులు ఉన్నారు. డీఎస్పీ., సబ్ ఇన్స్పెక్టర్, ఆంగ్లో ఇండియన్ సార్జెంట్ కూడా ఉన్నారు.

కొత్తపట్నం రాజకీయ పాఠశాల ప్రచార బాధ్యత నిర్వహిస్తున్న వాసిరెడ్డి శివలింగ ప్రసాద్ రాజద్రోహ పూరిత ఉపన్యాసం ఇచ్చారని అరెస్టు చేసి ఒంగోలు సబ్ జైలుకు తరలించారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిని పోలీసులు తీవ్రంగా కొట్టారు. 80 మందిని అరెస్టు చేశారు. 17 మందిని శిక్షించారు. అల్లూరి సత్యనారాయణ రాజును ఒంగోలు సబ్ ఇన్‌స్పెక్టర్ అరుగుపై నుంచి కిందకు లాగాడు. డీఎస్పీ ఆయనను సార్జెంట్ వైపు నెట్టారు. ఆంగ్లో ఇండియన్ సార్జెంటు సత్యనారాయణ రాజును ఛాతీపైన ఇతర చోట్ల పిడిగుద్దులు గుద్దారు. గుండెపైన, ముఖంపైన పొడిచారు. వంద గజాల దూరంలో ఉన్న లారీలోకి తోసే ముందు కూడా కొట్టారు. అన్నాప్రగడ కామేశ్వర రావును కూడా ఈ సార్జెంట్ తల మీద, బుజాల మీద లాఠీతో కొట్టారు. మునిపల్లె రామారావును ఆంగ్లో ఇండియన్ సార్జెంట్ ముక్కు మీద గట్టిగా కొట్టడంతో ధారాళంగా రక్తం కారింది. చంద్ర రాజేశ్వర రావుపై గూడా ఈ సార్జెంటే చేయి చేసుకున్నాడు. రాజేశ్వర రావు పెదవి చిట్లింది. కంభం పాటి సత్యనారాయణను మొదట సబ్ ఇన్ స్పెక్టర్ కణతపై చేత్తో మోదాడు. తరవాత లాఠీతో కొట్టారు. సంకు అప్పారావు, యాళ్లబండి రంగ నాయకులు, మైలవరపు రామారావు మొదలైన వారు గాయపడ్డారు. స్త్రీలపై కూడా నిర్దాక్షిణ్యంగా లాఠీచార్జీ చేశారు. పోలీసులు రాజకీయ పాఠశాల విద్యార్థులనే గాక లాఠీ చార్జీ చేయడాన్ని చూస్తున్న ప్రజలను కూడా లాఠీలతో మోదుతూ వెనక్కు నెట్టారు. కొందరిని లాఠీలతో డొక్కలో పొడిచారు. ఉద్రిక్తులైన ప్రజలు కొత్తపట్నం సమీప గ్రామాలైన పాదర్తి, మొటుకుల పాలెం నుంచి తరలి వచ్చారు.



1937 కొత్తపట్నం రాజకీయ పాఠశాలలో నిలబడినవారిలో మూడవ వరుస ఎడమ నుండి కుడికి : 1. పోలేపెద్ది నరసింహమూర్తి, 2. కె. శ్రీరాములు, 3. జొన్నలగడ్డ రామలింగయ్య, 4. ఏటుకూరి బలరామమూర్తి, 5. చలపతిరావు (కృష్ణాజిల్లా కార్యదర్శి) రెండవ వరుస : 1. బెల్లపు వెంకట్రామయ్య, 2. బసవారెడ్డి శంకరయ్య, 3. టి.కె.రామస్వామి, 4. తుమ్మల వెంకట్రామయ్య, 5. నీలం రాజశేఖరరెడ్డి, 6. చంద్ర పుల్లారెడ్డి, 7. కొండపల్లి సీతారామయ్య, 8. డి.సీతారామయ్య, 9. ఇనుగంటి నారాయణరావు, 10. కాట్రగడ్డ రాజగోపాలరావుబీ ఒకటవ వరుస : 1. సి.వి.కె.రావు, 2. ఎల్.జోగారావు, 3. ఏళ్లబండి పోలిశెట్టి, 4. గోళ్ల రాధాకృష్ణమూర్తి, 5. నందూరి ప్రసాదరావు, 6. తాపీ మోహనరావు, 7. పంజం నరసింహారెడ్డి, 8. మాకినేని బసవపున్నయ్య, 9. ఎస్.ఆర్.దాట్ల. కుర్చీలలో కూర్చున్నవారు : 1.. కంభంపాటి సత్యనారాయణ (జూనియర్), 2. చలసాని వాసుదేవరావు, 3. పుచ్చలపల్లి సుందరయ్య, 4. కడియాల గోపాలరావు, 5. చంద్ర రాజేశ్వరరావు, 6. మద్దుకూరి చంద్రశేఖరరావు, 7. కండపల్లి కృష్ణారావు. నేలపై కూర్చున్నవారు 1. మోటూరు హనుమంత రావు, 2. తుమ్మల వెంకటసుబ్బయ్య, 3. ముక్తేవి మాధవాచార్య, 4. సర్వదేవభట్ల రామనాథం, 5. కంభంపాటి సత్యనారాయణ (సీనియర్)

ముంబై పేలుళ్లలో రాణా కీలకం

ఉగ్రవాది హెడ్లీకి అత్యంత సన్నిహితుడు

ముంబై: ముంబైలో 2008 నవంబర్ 26 నుంచి 29 వరకు జరిగిన ఉగ్రదాడులు భారతదేశ చరిత్రలో అత్యంత దారుణమైన ఘటనలలో ప్రధానమైనవిగా నిలుస్తాయి. ఈ దాడుల్లో 166 మంది ప్రాణాలు కోల్పోగా, 300 మందికి పైగా గాయపడ్డారు. పాకిస్థాన్ ఆధారిత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా ఈ దాడులకు పాల్పడింది. ఈ దాడుల లక్ష్యాలలో తాజ్ మహల్ ప్యాలెస్ హోటల్, ఒబెరాయ్ ట్రైడెంట్, ఛత్రపతి శివాజీ టెర్మినస్ (సీఎస్‌టీ), నారిమన్ హౌస్ మొదలైనవి ఉన్నాయి. ఎన్‌డీటీవీ కథనం ప్రకారం ముంబైలోని జల వాయు విహార్ పేరిట ఉన్న సైనిక కాలనీ కూడా ఉగ్రవాదుల లక్ష్యంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతం ముంబైలోని కోలాబాలో ఉంది. ఇక్కడ నావికా దళ సిబ్బంది, వారి కుటుంబాలు ఉంటాయి. ఈ ప్రాంతం దాడి జరిగిన నారిమన్ హౌస్ సమీపంలో ఉంది. డేవిడ్ కోల్మన్ హెడ్లీ అనే ఉగ్రవాది ఈ దాడులకు ముందు అత్యంత రహస్యంగా ముంబైలో వారి లక్ష్యాలను పరిశీలించాడు. హెడ్లీ బృందం జల వాయు విహార్‌ను సైతం లక్ష్యంగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ కాలనీలో సైనిక అధికారులు ఉండటం వల్ల దీనిపై ఉగ్రవాదులు దాడులు చేయాలనుకున్నారు. చివరి నిమిషంలో వారి ప్రణాళికలు మారి, ఇతర ప్రదేశాలలో దాడులకు పాల్పడ్డారు. ఈ దాడులలో తహవ్వుర్ రాణా కీలక పాత్ర పోషించాడని ఆ కథనం చెబుతోంది. తహవ్వుర్ రాణా పాకిస్థాన్ సంతతికి చెందిన కెనడా పౌరుడు. తొలుత పాకిస్థాన్ సైన్యంలో వైద్యుడిగా పనిచేసిన రాణా... ఆ తర్వాత అమెరికాలోని చికాగోలో స్థిరపడ్డాడు. అక్కడ అతను ఇమ్మిగ్రేషన్ సర్వీస్ సెంటర్ నడిపాడు. రాణా... డేవిడ్ హెడ్లీకి అత్యంత సన్నిహితుడు. ఈ దాడుల్లో కీలక సహాయకుడిగా వ్యవహరించాడు. హెడ్లీ అసలు పేరు దావూద్ సయ్యద్ గిలానీ. అతను పాకిస్థానీ-అమెరికన్ ఉగ్రవాది. రాణా ఈ దాడులకు సంబంధించిన రవాణా సహాయం అందించాడనే ఆరోపణలు ఉన్నాయి. రాణా స్వయంగా హెడ్లీకి ఆర్థిక సహాయం, ప్రయాణ ఏర్పాట్లు చేశాడని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఆరోపించింది. తహవ్వుర్ రాణా లష్కరే తోయిబాతో సంబంధాలు కలిగి ఉన్నాడని, ఈ దాడులకు సంబంధించిన ప్రణాళికలో పాల్గొన్నాడనే ఆరోపణలు ఉన్నాయి. 2009లో అమెరికాలోని చికాగోలో రాణాను ఎఫ్‌బీఐ అరెస్టు చేసింది. అతనిపై ముంబై దాడులకు సంబంధించిన ఆరోపణలతో పాటు డెన్మార్క్‌లోని ఒక వార్తాపత్రికపై దాడికి సంబంధించిన ఆరోపణలు కూడా ఉన్నాయి. 2011లో అమెరికా కోర్టు రాణాను లష్కరే తోయిబాకు సహాయం చేసినందుకు దోషిగా తేల్చింది. కానీ ముంబై దాడులకు సంబంధించిన ఆరోపణల నుంచి విముక్తి కల్పించింది. హెడ్లీ ఇచ్చిన సాక్ష్యం ఆధారంగా రాణాను ఈ దాడుల్లో భాగస్వామిగా భారత్ గుర్తించింది. 2025 ఏప్రిల్‌లో రాణాను భారతదేశానికి అప్పగించేందుకు అమెరికా సుప్రీం కోర్టు అంగీకరించింది. దీంతో తహవ్వుర్ రాణా ఇప్పుడు భారత న్యాయస్థానంలో విచారణ ఎదుర్కోనున్నాడు.

హెడ్లీ అప్పగింత సాధ్యం కాదా?

న్యూఢిల్లీ: భారత్ అభ్యర్థనతో ముంబై పేలుళ్ల కేసు కుట్రదారుడు తహవ్వుర్ రాణాను అమెరికా అప్పగించింది. దీంతో మరో కీలక సూత్రధారి డేవిడ్ హెడ్లీని భారత్‌కు ఎప్పుడు తీసుకొస్తారనే ప్రశ్న తలెత్తుతోంది. అయితే హెడ్లీని భారత్‌కు తీసుకురావడం సాధ్యం కాదని తెలుస్తోంది. జాతీయ మీడియా కథనాల ప్రకారం ముంబై దాడులకు ముందు ఆ కుట్రకు సూత్రధారిగా భావిస్తున్న డేవిడ్ కోల్మన్ హెడ్లీ ముంబైలో రెక్కీ నిర్వహించాడు. అతడికి రాణా సహకరించాడు. ఇప్పుడు రాణాను అమెరికా ప్రభుత్వం భారత్‌కు అప్పగించింది. కానీ హెడ్లీని అప్పగించేందుకు అమెరికా సుముఖంగా కనిపించడం లేదు. అందుకు కొన్ని చట్ట, దౌత్య, వ్యూహాత్మక కారణాలున్నాయని నిఘా వర్గాలు వెల్లడించాయి. తనను భారత్, పాక్, డెన్మార్క్‌కు అప్పగించవద్దని 2010లోనే అమెరికా అధికారులతో హెడ్లీ ఒప్పందం చేసుకున్నట్లు తెలిపాయి. ఇది చట్టపరమైన ఒప్పందమని, రాణా వంటి కుట్రదారులకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పినందుకు బదులుగా అతడికి మరణ శిక్ష తప్పిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ముంబై దాడుల్లో ప్రమేయం, లష్కరే తొయిబా, పాకిస్థాన్ ఐఎస్ఐతో సంబంధాల గురించి అతడు అంగీకరించడంతో అమెరికా దర్యాప్తు సంస్థలకు కీలకంగా మారాడు. ఇప్పుడు అతడిని అప్పగించడం వల్ల నిఘా కార్యకలాపాలు, విచారణలకు ఆటంకం ఏర్పడుతుందని అమెరికా భావిస్తున్నట్లు చెప్పాయి. ఎఫ్‌బీఐ వంటి అమెరికా సంస్థలతో అతడికి సంబంధాలున్నాయి. అతడు గతంలో వాటికి ఇన్‌ఫార్మర్‌గా పనిచేశాడని ఆ వర్గాలు వెల్లడించాయి. ముంబై దాడి గురించి ముందుగానే అమెరికా నిఘా సంస్థ దృష్టికి వచ్చిందని, దానిని అరికట్టడానికి ముందస్తు చర్యలు తీసుకోలేదని కొన్ని లీకైన పత్రాలు వెల్లడించాయి. అందువల్ల హెడ్లీని అప్పగించడం వల్ల నిఘా సమాచారాన్ని సేకరించే విధానాలు, ఉగ్రవాది-ఇన్‌ఫార్మర్‌గా హెడ్లీ వ్యవహారం బయటపడవచ్చని పేర్కొన్నాయి. ముందస్తు ఒప్పందం ప్రకారం అతడికి మరణశిక్ష విధించకూడదు. అజ్మల్ కసబ్ వంటి ఉగ్రవాదుల విషయంలో కఠినవైఖరి అనుసరించిన భారత్ ఈ షరతును అంగీకరించలేదని నిఘా వర్గాలు తెలిపాయి. ఇవన్నీ హెడ్లీ అప్పగింతకు అడ్డంకిగా మారినట్లు తెలుస్తోంది. రాణా ట్రావెల్ ఏజెన్సీ నిర్వహిస్తున్న సమయంలో అతడికి హెడ్లీ పరిచయమయ్యాడు. ముంబై ఉగ్రదాడికి ముందు రాణాతో పాకిస్థాన్-అమెరికన్ ఉగ్రవాది డేవిడ్ హెడ్లీ టచ్‌లో ఉండేవాడని ఎన్ఐఏ తెలిపినట్లు ఇటీవల ఓ మీడియా కథనం వెల్లడించింది. 26/11 దాడికి ముందు ఎనిమిది సార్లు హెడ్లీ భారత్‌కు వచ్చాడని, ఆ సమయంలో 231 సార్లు రాణాతో సంప్రదింపులు జరిపాడని తెలిపింది. దాడులకు ముందు 2006, సెప్టెంబర్ 14న హెడ్లీ తొలిసారి భారత్‌కు వచ్చి రెక్కీ నిర్వహించాడని, అప్పుడు 32 సార్లు రాణాతో మాట్లాడినట్లు పేర్కొంది. దాడులకు సంబంధించిన ప్రాంతాల ఎంపికలో హెడ్లీకి రాణా ఎలా సహకరించాడో ఎన్ఐఏ పత్రాలు స్పష్టంగా వెల్లడిస్తున్నాయని పేర్కొంది.

కసబ్‌ని కాల్చేద్దామనుకున్నా: దేవిక

న్యూఢిల్లీ: ముంబై ఉగ్రదాడి ఘటనలో కీలక సూత్రధారి తహవ్వుర్ రాణాను భారత్‌కు తీసుకురావడంపై నాటి దాడుల్లో బాధితురాలు, ఉగ్రవాది అజ్మల్ కసబ్‌ను గుర్తించడంలో కీలక సాక్షిగా ఉన్న దేవికా రోటావన్ హర్షం వ్యక్తం చేశారు. అతడిని అమెరికా నుంచి తీసుకురావడం భారత ప్రభుత్వం సాధించిన విజయమన్నారు. దేవిక గురువారం ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ 'తహవ్వుర్ రాణాను తీసుకొచ్చినందుకు భారత్, అమెరికా ప్రభుత్వాలకు ధన్యవాదాలు. రాణా నుంచి అనేక కీలక వివరాలు రాబట్టొచ్చు. పాకిస్థాన్‌లో ఇప్పటికీ దాగి ఉన్న ఉగ్రవాదులను పెంచి పోషించేవారి పేర్లు బయటకు తీయవచ్చు. పాకిస్థాన్‌లో దాగి ఉన్న ఉగ్రవాదులతో పాటు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా... ఉగ్రవాదానికి మద్దతిచ్చేవారిని శిక్షించాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేస్తున్నా. అజ్మల్ కసబ్ మాదిరిగా ఉగ్రవాదులకు మరణ దండన విధించాలి. పాకిస్థాన్‌లో ఉన్న దావూద్ ఇబ్రహీం, హఫీజ్ సయీద్ ఇతర కీలక సూత్రధారులను భారత్ తీసుకొచ్చి ఉరిశిక్ష విధించాలి. ఇప్పటికీ పొరుగు దేశంలో ఉన్న ఉగ్రవాదాన్ని ప్రోత్సహించేవారిని, కసబ్ లాంటి కిరాతకుల్ని తయారుచేసే వారిని అంతం చేయాలి. అప్పుడే ముంబై దాడుల్లో బాధితులకు న్యాయం జరుగుతుంది' అని అన్నారు. ముంబయి దాడి ఘటన రోజును గుర్తు చేసుకున్న ఆమె... కసబ్‌ను చూపెట్టినప్పుడు తనకెవరైనా తుపాకీ ఇస్తే కాల్చేద్దామనుకున్నానన్నారు. అప్పుడు తన వయస్సు పదేళ్లేనని చెప్పారు.

ఇది బాధితురాలి స్వయంకృతాపరాధమే

అత్యాచార కేసులో నిందితుడికి హైకోర్టు బెయిల్



లక్నో: వక్షోజాలు తాకడం, యువతి పైజామా లాగడం వంటి చేష్టలు అత్యాచార యత్నం కిందకు రావంటూ వివాదాస్పద తీర్పు ఇచ్చిన అలహాబాద్ హైకోర్టు(ఉత్తరప్రదేశ్)... మరోసారి వార్తల్లోకి ఎక్కింది. ఓ అత్యాచార కేసులో బాధితురాలిది కూడా తప్పు ఉందని చెబుతూ నిందితుడికి బెయిల్ మంజూరు చేసింది. దిల్లీలో ఉంటూ పీజీ చదువుతున్న ఓ విద్యార్థిని తన క్లాస్‌మేట్ అత్యాచారం చేశాడని కేసు పెట్టింది. మద్యం మత్తులో ఉన్న తనను అతని బంధువుల ఇంటికి తీసుకెళ్లి రెండుసార్లు అత్యాచారం చేశాడని బాధితురాలు ఆరోపించింది. అయితే సాక్ష్యాల పరిశీలనలో అది అబద్ధమని, పరస్పర అంగీకారంతో ఇద్దరూ కలిశారని నిందితుడి తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. రెండువైపులా వాదనలు విన్న తర్వాత... ధర్మాసనం కీలక అంశాలను పరిగణనలోకి తీసుకుంది. ఈ కేసులో బాధితురాలిగా ఉన్న యువతి ఎంఏ చదువుతోంది. ఏది తప్పో...ఏది ఒప్పో... నైతికత గురించి ఆమెకు తెలియంది కాదు. ఒకవేళ బాధితురాలి ఆరోపణే నిజమనుకున్నా... ఇక్కడ సమస్యను స్వయంగా ఆమెనే ఆహ్వానించినట్లు తెలుస్తోంది. కాబట్టి, జరిగిన దానికి ఆమె కూడా బాధ్యురాలే. ఇది ముమ్మాటికీ బాధితురాలి స్వయంకృతాపరాధమే. పైగా వైద్య పరీక్షల్లో కన్నెపొర చిరిగిపోయినట్లు తేలింది. కానీ లైంగిక వేధింపులు జరిగినట్లుగా వైద్యులు ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయలేదు. ఈ కేసులో నిందితుడికి ఎలాంటి నేర చరిత్ర లేదు. బెయిల్ షరతులను ఉల్లంఘించడని హామీతో పాటు సాక్ష్యాలను ప్రభావితం చేయలేడన్న నమ్మకం కుదిరిన తర్వాతే నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తున్నామని జస్టిస్ సంజయ్ కుమార్ సింగ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటన కిందటి ఏడాది సెప్టెంబర్‌లో జరిగింది. పీజీ చదువుతున్న బాధితురాలిని ఆమె స్నేహితులు హౌజ్ ఖాస్‌లోని ఓ రెస్టారెంట్‌కు ఆహ్వానించారు. అర్ధరాత్రి 3 గంటల దాకా ముగ్గురు స్నేహితులతో కలిసి ఆమె చిత్తుగా తాగింది. మత్తులో ఉన్న ఆమె తన గదికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఓ స్నేహితుడిని అతని ఇంటికి తీసుకెళ్లాలని ఆమె కోరింది. బాగా మత్తులో ఉన్న ఆమెను నిందితుడు తన బంధువుల ఇంటికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడన్నది ఆమె ఆరోపణ. ఈ కేసులో కిందటి ఏడాది డిసెంబర్ నుంచి నిందితుడు జైల్లోనే ఉన్నాడు. ఈ కేసులో ఇలాంటి వ్యాఖ్యలు చేసి నిందితుడికి అలహాబాద్ హైకోర్టు ధర్మాసనం మార్చి 11న బెయిల్ మంజూరు చేసింది. పలు ఆంగ్ల మీడియా వరుస కథనాలతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

ఉప ప్రధానిగా నితీశ్

బీజేపీ నేత ఆకాంక్ష



పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు ఉపప్రధాని పదవిపై దేశ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. బీజేపీ సీనియర్ నేత అశ్వనీ కుమార్ చౌబే వ్యాఖ్యలు ఇందుకు కారణమయ్యాయి. కేంద్ర మాజీ మంత్రి అశ్వినీ కుమార్ చౌబే గురువారం మీడియాతో మాట్లాడుతూ జేడీయూ అధినేత నితీశ్ కుమార్‌ను ఉపప్రధానిగా చూడాలనుకుంటున్నట్లు చెప్పారు. 'ఎన్డీయేకు నితీశ్ చేసిన సేవలు వెలకట్టలేనివి. సంకీర్ణ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సేవలను గుర్తించి ఆయనకు డిప్యూటీ పీఎం పదవి ఇవ్వాలన్నది నా కోరిక. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం. ఒకవేళ అదే జరిగితే... బీహార్ నుంచి ఆ స్థానానికి చేరిన రెండో వ్యక్తిగా నితీశ్ నిలుస్తారు' అని అన్నారు. అంతకుముందు బీహార్ నుంచి బాబూ జగ్జీవన్ రామ్ ఉపప్రధానిగా పనిచేశారు. ఈ ఏడాది చివర్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లనుంది. నితీశ్ మరోసారి ఎన్నికల్లో పోటీ చేయాలని అనుకుంటున్నారు. రెండు దశాబ్దాలకుపైగా రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న నితీశ్... ముఖ్యమంత్రి పదవిపై ఆశతో మళ్లీ కూటమి మారే ప్రయత్నం చేస్తారని విమర్శలు వస్తున్నాయి. ఏ పార్టీతో జట్టుకట్టినా ముఖ్యమంత్రి స్థానం మాత్రం ఆయనదే. రాష్ట్రంలో ఈ రాజకీయాలతో కూటమిలో రెండోస్థానానికే పరిమితమైన బీజేపీ... ఆయనను గౌరవప్రదంగా పక్కన పెట్టాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. సీఎం అభ్యర్థిగా నితీశ్ కుమార్‌ను ప్రకటించేందుకు బీజేపీ ఆసక్తి చూపడం లేదని ఇటీవల ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ పరిణామాల మధ్య బీజేపీ నేత వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

మమతా బెనర్జీకి కోర్టు ధిక్కార నోటీసు

కోల్‌కతా: రాష్ట్ర స్కూల్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) రిక్రూట్‌మెంట్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బహిరంగంగా విమర్శించిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి కోర్టు ధిక్కార నోటీసు జారీ అయింది. స్వచ్ఛంద సంస్థ 'ఆత్మదీప్' తరఫున న్యాయవాది సిద్ధార్థ్ దత్తా ఈ నోటీసులు జారీ చేశారు. ఎస్ఎస్‌సీ రిక్రూట్‌మెంట్‌లో అవకతవకలు జరిగాయంటూ 26,000 మంది టీచర్ల నియామకాలను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఈ నెల మూడో తేదీన సుప్రీంకోర్టు సమర్థించింది. సుప్రీం తీర్పును ఈ నెల ఎనిమిదో తేదీన బహిరంగంగా మమతా బెనర్జీ తప్పుపట్టడం అత్యున్నత న్యాయస్థానానికి ఉన్న అథారిటీని బలహీనపరచడమేనంటూ ఆమెకు పంపిన నోటీసులో స్వచ్ఛంద సంస్థ పేర్కొంది. సుప్రీంకోర్టు అధికారాలను ఉద్దేశ్యపూర్వకంగా ధిక్కరించినట్టు స్పష్టమవుతోందని, తీర్పుకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని ప్రోత్సహించే విధంగా ఆమె వ్యాఖ్యలు ఉన్నాయని నోటీసులో పేర్కొంది. కాగా, 26 వేల మంది టీచర్ల నియమకాల రద్దును మమతా బెనర్జీ ఇటీవల సవాలు చేస్తూ 'ఎవరి ఉద్యోగమైనా తీసివేసే హక్కు ఎవరికుంటుంది... ఎవరికీ ఉండదు. మా ప్లాన్ 'ఏ' సిద్ధంగా ఉంది, బీ, సీ, డీ, ఈ కూడా సిద్ధంగా ఉంది. ఈ మాట అన్నందుకు నన్ను జైలులో పెట్టొచ్చు. అయినా ఖాతరు చేయను' అని అన్నారు. కోర్టు నిర్ణయం వెనుక 'కుట్ర' ఉందని ఆరోపించారు. అర్హులైన టీచర్లను దొంగలు, అనర్హులుగా ముద్రవేసే ప్రయత్నం జరుగుతోందని అన్నారు.

కులగణనకు మోదీ వ్యతిరేకం: తేజస్వీ యాదవ్

పాట్నా: ప్రధాని మోదీ, బీజేపీలు కులగణనకు వ్యతిరేకమని ఆర్‌జేడీ నేత తేజస్వీయాదవ్ ఆరోపించారు. మీడియాతో గురువారం ఆయన మాట్లాడుతూ... 'దేశవ్యాప్తంగా కలగణన చేపట్టాలి. కానీ ప్రధాని మోదీ, బీజేపీ కులగణనను వ్యతిరేకిస్తున్నారు.

అందుకే కులగణన జరగడం లేదు. ఎప్పుడైతే దేశం వాస్తవిక చిత్రం ముందుకు వస్తుందో అప్పుడు వారి హిందూ- ముస్లిం రాజకీయాలు అంతమవుతాయి' అని అన్నారు. కాగా, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ... కేంద్రం కులగణన నిర్వహించనందుకు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో గిరిజనులు, దళితులు, బలహీనవర్గాలను మోదీ ప్రభుత్వం గౌరవించడం లేదు. మైనార్టీల వాటాను తెలుసుకునేందుకు కులగణన చేపట్టమని తాము డిమాండ్ చేస్తే... మోదీ, ఆర్ఎస్ఎస్ కులగణనను వ్యతిరేకిస్తున్నాయి. ఎందుకంటే ఈ దేశంలో మైనార్టీలకు లభించే వాటాను వెల్లడించడానికి వారు ఇష్టపడరు' అని రాహుల్ ఆరోపించారు.

14 ఏళ్లు ఎందుకు పట్టింది?

న్యూఢిల్లీ: ముంబై ఉగ్రదాడిలో కీలక నిందితుడు తహవ్వుర్ హుస్సేన్ రాణాను భారత్ తీసుకురావడానికి 14 ఏళ్లు పట్టింది. ముంబై దాడులు జరిగిన ఏడాది అనంతరం 2009 అక్టోబరులో అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ చేతికి రాణా చిక్కాడు. డెన్మార్క్ వార్తా పత్రిక కార్యాలయాలపై దాడికి కుట్ర పన్నాడనే అభియోగాలపై షికాగోలో అతడిని అరెస్టు చేశారు. అనంతరం లాస్‌ఏంజెలెస్‌లోని మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్‌లో నిర్బంధంలో ఉంచారు. ఉగ్రదాడికి సంబంధించి ముంబై పోలీసులు 2009లో వేసిన తొలి ఛార్జిషీటులో రాణా పేరు లేదు. కేంద్ర దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) 2011లో వేసిన ఛార్జిషీట్‌లో మాత్రం తొలిసారి అతడి పేరును పేర్కొంది. ఈ దాడికి ప్రధాన కుట్రదారుల్లో రాణాను ఒకడిగా తెలిపిన ఎన్ఐఏ... 26/11 దాడికి సూత్రధారి అయిన పాకిస్థానీ అమెరికన్ ఉగ్రవాది డేవిడ్ కోల్‌మన్ హెడ్లీకి రవాణా పరంగా, ఆర్థికంగా ఎలా సాయం చేశాడనే వివరాలను స్పష్టంగా వెల్లడించింది. దాడికి రెండేళ్ల ముందే లక్షిత ప్రదేశాల్లో హెడ్లీ రెక్కీ నిర్వహించినట్లు తెలిసింది. కాగా, రాణాను తీసుకువచ్చేందుకు దౌత్య ప్రయత్నాలు మొదలుపెట్టిన భారత్... అతడిని అప్పగించాలని కోరుతూ అమెరికా ప్రభుత్వానికి 2019లో లేఖ రాసింది. అనంతరం అతడి అరెస్టు వారెంటును కోరుతూ 2020లో అభ్యర్థించగా కాలిఫోర్నియా కోర్టు అందుకు అనుమతించింది. ఇప్పటికే ఒకేవిధమైన ఆరోపణలపై రెండుసార్లు ఎలా విచారిస్తారంటూ రాణా తరఫు న్యాయవాదులు వాదించారు. అయినప్పటికీ వారి వాదనను కోర్టు తోసిపుచ్చింది. అప్పటి అధ్యక్షుడు జో బైడెన్ కూడా భారత్‌కు రాణాను అప్పగించేందుకు అంగీకరించారు.

భారత్‌కు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక న్యాయస్థానాల్లో రాణా అనేక పిటిషన్లు దాఖలు చేశాడు. శాన్‌ఫ్రాన్సిస్కోలోని అప్పీల్ కోర్టు... అప్పగింతపై ఆదేశాలు ఇవ్వడంతో చివరకు 2024 నవంబర్‌లో సుప్రీం కోర్టును ఆశ్రయించాడు. ఆ రివ్యూ పిటిషన్‌ను ఈ ఏడాది జనవరి 21న అమెరికా సర్వోన్నత న్యాయస్థానం కూడా తోసిపుచ్చడంతో భారత్‌కు అప్పగించడం అనివార్యమైంది. మోదీ అమెరికా పర్యటనకు ముందు రోజు (ఫిబ్రవరి 11న) ఇదే అంశంపై మాట్లాడిన విదేశాంగ మంత్రి మార్కో రూబియో... రాణాను భారత్‌కు అప్పగించే విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. అయితే, ఆరోగ్య కారణాలు చూపుతూ అప్పగింతను నిలిపివేయాలని జిల్లా కోర్టులు సహా సుప్రీంను ఆశ్రయించినప్పటికీ అవి తిరస్కరణకు గురికావడంతో భారత్ రావడం రాణాకు తప్పలేదు.

రాణా అప్పగింత వెనుక 'యూపీఏ' కృషి

మోదీ సర్కారు చేసిందేమీ లేదు

మాజీ హోంమంత్రి చిదంబరం

న్యూఢిల్లీ: ముంబై పేలుళ్ల కేసులో నిందితుడు తహవ్వుర్ రాణాను అమెరికా ప్రభుత్వం భారత్‌కు అప్పగించడం తమ ఘనతేనని కేంద్రంలోని మోదీసర్కారు చెప్పుకోడాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ హోంశాఖమంత్రి పి.చిదంబరం తప్పుబట్టారు. మోదీ ప్రభుత్వం ఈ ప్రక్రియను ప్రారంభించకపోగా... యూపీఏ ప్రభుత్వం ప్రారంభించిన పరిణతితో కూడిన వ్యూహాత్మక దౌత్యం నుండి రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తోందన్నారు. రాణా అప్పగింతను సాధ్యం చేయడానికి మోదీ సర్కారు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. ఈ పరిణామంపై మోదీ ప్రభుత్వం తమ గొప్పతనమేనని చెప్పుకోడానికి తొందరపడుతున్నప్పటికీ, నిజం వారి మోసానికి దూరంగా ఉందని చిదంబరం ఒక ప్రకటనలో తెలిపారు. రాణా అప్పగింత... యూపీఏ ప్రభుత్వం అమెరికాతో సమన్వయంతో చేపట్టిన దౌత్య, చట్టపరమైన నిఘా ప్రయత్నాల పరాకాష్ఠ అన్నారు. 64 ఏళ్ల రాణా పాకిస్థాన్‌లో జన్మించిన కెనడా జాతీయుడు. 2008 ముంబై ఉగ్రవాద దాడుల ప్రధాన కుట్రదారులలో ఒకరైన అమెరికా జాతీయుడ డేవిడ్ కోల్మన్ హెడ్లీ అలియాస్ దావూద్ గిలానీకి సన్నిహితుడు. రాణా భారత్‌కు తీసుకువచ్చే నవంబర్ 11, 2009న ప్రారంభమైందని చిదంబరం చెప్పారు. 26/11 కుట్రలో పాల్గొన్న హెడ్లీ (అమెరికా పౌరుడు), తహవ్వుర్ రాణా (కెనడా పౌరుడు), ఇతరులపై న్యూఢిల్లీలో ఎన్ఐఏ కేసు నమోదు చేసిందని ఆయన అన్నారు. ఆ నెలలోనే యూపీఏ ప్రభుత్వ ప్రభావశీల విదేశాంగ విధానానికి కృతజ్ఞతలు తెలుపుతూ కెనడా విదేశాంగ మంత్రి భారత సంస్థలకు సహకారం అందిస్తామన్నారు. కోపెన్‌హాగన్‌లో విఫలమైన ఎల్‌ఈటీ కుట్రకు సహకరించినందుకు ఎఫ్‌బీఐ 2009లో చికాగోలో రాణాను అరెస్టు చేసిందని... నవంబర్ 2008 నుండి జులై 2012 వరకు కేంద్ర హెూం మంత్రిగా ఉన్న చిదంబరం స్పష్టం చేశారు. 2011 జూన్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిలో ప్రత్యక్ష ప్రమేయంపై రాణాను అమెరికా కోర్టు నిర్దోషిగా ప్రకటించినప్పటికీ ఉగ్రవాద సంబంధిత ఇతర నేరాలకు ఆయన దోషిగా నిర్ధారించబడి 14 సంవత్సరాల జైలు శిక్ష విధించబడిందని తెలిపారు. ఆనాడే యూపీఏ ప్రభుత్వం ముంబై పేలుళ్ల కేసులో రాణా నిర్దోషిగా విడుదలవడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేసిందని, దౌత్యపరమైన ఒత్తిడిని సజీవంగా ఉంచిందని చిదంబరం పేర్కొన్నారు.

వయనాడ్ బాధితులకు కేంద్రం ద్రోహం

ప్రియాంకాగాంధీ మండిపాటు

తిరువనంతపురం: కేరళలోని వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడిన సర్వం కోల్పోయిన బాధితుల రుణాలను మాఫీ చేయలేమని కేంద్రంలోని మోదీ సర్కారు చేతులెత్తేయడంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, వయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ గురువారం మండిపడ్డారు. ఈచర్యను నమ్మకద్రోహంగా అభివర్ణించారు. వయనాడ్ బాధితులు ఇళ్లు, భూమి, జీవనోపాధితో పాటు సర్వం కోల్పోయారు. అయినా కేంద్ర ప్రభుత్వం వారికి రుణ మాఫీ చేసేందుకు కూడా నిరాకరిస్తోంది. వారికి రుణాల రీషెడ్యూల్, పునర్ నిర్మాణం మాత్రమే దక్కింది. ఇది ఉపశమనం కాదు... నమ్మకద్రోహమని ఫేస్‌బుక్ పోస్ట్‌లో ఆమె పేర్కొన్నారు. కేంద్రం ఉదాసీనతను కాంగ్రెస్ పార్టీ, తాను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వయనాడ్‌లోని తమ సోదర, సోదరీమణులకు అండగా నిలబడతామని ఆమె హామీ ఇచ్చారు. వారి బాధను విస్మరించబోమని, న్యాయం జరిగే వరకు ప్రతి వేదికపైనా వారి తరఫున గొంతుకను వినిపిస్తామని స్పష్టం చేశారు. ఇటీవల కేరళ హైకోర్టుకు కేంద్ర ప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్‌ను ప్రియాంక తప్పుబట్టారు. ప్రకృతి వైపరీత్యాలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు అనుగుణంగా మాత్రమే రుణాలను రీషెడ్యూల్ చేయవచ్చు లేదా పునర్నిర్మించవచ్చు అని కేంద్రం పేర్కొంది. బాధిత వ్యక్తులు తీసుకున్న రుణాలను మాఫీ చేసే అవకాశం గురించి హైకోర్టు నోటీసుకు సమాధానంగా కేంద్రం అఫిడవిట్ సమర్పించింది. గత సంవత్సరం ఆగస్టు 19న కేరళ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) ప్రత్యేక సమావేశంలో జరిగిందని, ప్రకృతి వైపరీత్యాలపై ఆర్బీఐ మార్గదర్శకాలలో పేర్కొన్న విధంగా సహాయ చర్యలను వర్తింపజేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి పినరయి విజయన్ హాజరైనట్లు తెలిపింది.

ఏఐతో సాంకేతిక యుద్ధం: రాజ్‌నాథ్ సింగ్

చెన్నై: రాజకీయ, సైనిక లక్ష్యాలు సాధించుకునేందుకు కొందరు సైబర్ దాడులను సాధనాలుగా వినియోగిస్తున్నారని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. తప్పుడు సమాచా రాన్ని వ్యాప్తి చేయడం అందులో ఓ భాగమని వ్యాఖ్యానించారు. తమిళనాడులోని డిఫెన్స్ సర్వీస్ స్టాఫ్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ మాట్లాడారు. ప్రస్తుతం కొనసాగుతున్న సంఘర్షణలు, పరిస్థితులు సంప్రదాయ యుద్ధాలకు భిన్నంగా మారుతున్నాయని రాజ్‌నాథ్ అన్నారు. 'నానాటికీ అభివృద్ధి చెందుతున్న సాంకేతికత మానవ ప్రమేయం లేని వ్యవస్థను సృష్టిస్తోంది. చాలా విషయాలను ఏఐ అంచనా వేయడం చూస్తున్నాం. ఇప్పుడు సంప్రదాయ యుద్ధాలు (భూమి, జల, వాయు మార్గాల్లో చేసే యుద్ధం) చేసుకునే కాలం పోయింది. ఏఐ రాకతో సాంకేతిక యుద్ధం జరుగుతోంది' అని అన్నారు. 'ప్రస్తుతం మనమంతా 'గ్రే జోన్', హైబ్రిడ్ యుద్ధ శకంలో ఉన్నాము. రాజకీయ, సైనిక లక్ష్యాలు సాధించుకోవడానికి కొందరు సైబర్ దాడులను వినియోగిస్తున్నారు. ఆర్థిక యుద్ధం అనేది ఒక్క తూటా కూడా పేల్చకుండా రాజకీయ, సైనిక లక్ష్యాలను అమలుచేయగలవు. అందుకే వీటిని సాధనాలుగా మలచుకుంటున్నారు. సైబర్, అంతరిక్షం, సమాచార యుద్ధాలు కూడా సంప్రదాయ యుద్ధంలా ఎంతో శక్తిమంతమైనవి. వీటితో పోరాడేందుకు బహుళ- డొమైన్ వాతావరణంలో సాయుధ దళాలు కలసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉంది' అని వ్యాఖ్యానించారు. 'మన పొరుగునున్న ప్రాంతాల నుంచి మనపై పరోక్ష యుద్ధం జరుగుతోంది. అక్కడి నుంచి ఉగ్రవాద ముప్పుతో ఇది మరింత తీవ్రమవుతోంది. సైబర్ దాడులకు బలికాకుండా ఉండాలంటే మనమంతా కలిసి పోరాడాలి' అని అన్నారు.

కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ అరెస్ట్

బెంగుళూరు: కోఆపరేటివ్ బ్యాంక్‌లో అవకతవకలకు పాల్పడిన బ్యాంక్ మాజీ చైర్మన్ ఆర్‌ఎం మంజునాథ గౌడ్‌ను ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్ట్ చేశారు. మనీల్యాండరింగ్ చట్టం కింద అతడిని అదుపులోకి తీసుకున్నారు. బెంగుళూరులోని ప్రత్యేక కోర్టులో మాజీ చైర్మన్‌ను ప్రవేశ పెట్టారు. మంజునాథ గౌడ్‌ను సుమారు 14 రోజుల పాటు కస్టడీలోకి తీసుకున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... కర్నాటకలోని కోఆపరేటివ్ బ్యాంకుకు చెందిన ఓ బ్రాంచ్‌లో సుమారు రూ.63 కోట్లు అవకతవకలు జరిగాయి. బెంగుళూరుతో పాటు శివమొగ్గ జిల్లాల్లో ఈడీ ఇటీవల తనిఖీలు చేపట్టింది. శివమొగ్గ జిల్లా సహకార సెంట్రల్ బ్యాంక్‌లో అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. భారీ స్థాయిలో నిధుల అవకతవకలు జరిగాయని, గౌడ ఆదేశాల మేరకు సిటీ బ్రాంచ్ మేనేజర్ బి. శోభ అక్రమాలకు పాల్పడినట్లు ఈడీ ఆరోపించింది. ఈడీ చేసిన ఆరోపణలపై స్పందించేందుకు బ్రాంచ్ మేనేజర్లు అందుబాటులో లేరు. లోకాయుక్త పోలీ సులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. మేనేజ ర్ శోభతో కలిసి చైర్మన్ రూ.63 కోట్ల నిధులను అక్రమంగా తరలించినట్లు ఈడీ పేర్కొంది. బ్యాంక్ ఖాతాదారులకు తెలియకుండా గోల్డ్ లోన్ అకౌంట్లను అక్రమంగా తెరిచి నిధులను స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీని కోసం నకిలీ డాక్యుమెంట్లు సమర్పించి నట్లు ఈడీ తెలిపింది. బ్యాంక్ నుంచి అక్రమంగా తీసిన నగదును ... మేనేజర్ శోభ, చైర్మన్ గౌడకు పంపినట్లు ఈడీ తన రిపోర్టులో తెలిపింది. ఆ డబ్బుతో మంజునాథ గౌడ్... వివిధ ప్రాంతాల్లో ఆస్తులు కొనుగోలు చేశారు.

అమిత్‌షా ఆదర్శం

రేఖాగుప్తా

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలను ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కొనియాడారు. మోదీని సాధువు మనస్తత్వంతో ఆమె పోల్చారు. అమిత్ షా మాదిరిగా తాను ఉండాలని కోరుకుంటున్నట్లు ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీఎం వెల్లడించారు. 'ప్రధాని మోదీ సాధువు మనస్తత్వం కలవారుగా భావిస్తున్నా. సాధారణంగా కొందరు భగవంతుడి సేవకు తమ జీవితాన్ని అంకితం చేస్తారు. కానీ, దేశానికి సేవ చేసేందుకు ప్రధాని తన జీవితాన్ని అంకితం చేశారు.' అని చెప్పుకొచ్చారు. 'కేంద్ర హోంమంత్రి అమిత్ షా ధైర్యవంతుడు. ఎంత క్లిష్ట పరిస్థితులనైనా ఆయన ఎదుర్కోగలరు. కఠిన నిర్ణయాలు తీసుకుని చివరి వరకు వాటిని పాటిస్తారు. ఆయన మాదిరి నేను ఉండాలని కోరుకుంటున్నాను. దేశం పట్ల బీజేపీ ఎంతో విధేయతతో ఉంటోంది' అని కొనియాడారు.

విశాలాంధ్ర హైదరాబాద్

పూలే మార్గం అందరికీ ఆచరణీయం : సీఎం

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహాత్మా జ్యోతిరావు పూలే అనుసరించిన మార్గం అందరికీ ఆచరణీయమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. పూలే 198వ జయంతి (ఏప్రిల్11) సందర్భంగా ముఖ్యమంత్రి ఆయన త్యాగాలను, సమాజానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఒక సామాన్యుడిగా మొదలై ఒక సామాజిక ఉద్యమ కెరటంగా ఎదిగిన పూలే జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. సామాజిక కార్యకర్తగా, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్కర్త పూలే భావితరాలకు సైతం మార్గదర్శకుడని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. సమాజంలో వివక్షకు తావు లేదని, సమానత్వం ఉండాలని జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. వెనుకబడిన వర్గాలు, దళిత జనోద్ధరణకు ఆయన ఎంచుకున్న బాట, అనుసరించిన మార్గం సమాజ శ్రేయస్సును కాంక్షించే వారందరికీ స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే స్ఫూర్తితోనే రాష్ట్ర ప్రభుత్వం అనేక వినూత్న ప్రజాప్రయోజన కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రగతి భవన్‌కు మహాత్మా జ్యోతిభా పూలే పేరు పెట్టి ప్రజా భవన్‌గా మార్చడం జరిగిందన్నారు. పూలే స్ఫూర్తితోనే విద్య, ఉపాధి అవకాశాలు అన్ని వర్గాల వారికి అందించాలనే లక్ష్యంతోనే ఎస్సీ వర్గీకరణ చేపట్టడం జరిగిందన్నారు. దేశంలోనే తొలి సారిగా బీసీ కుల గణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ఆమోదించడం జరిగిందన్నారు. అంతేగాకుండా మహిళల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త పథకాలు ప్రవేశపెట్టింద న్నారు. మహిళా శక్తి పాలసీ ద్వారా డ్వాక్రా సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు, వారి పేరిట పెట్రోల్ బంకుల ఏర్పాటు, సోలార్ పవర్ ప్లాంట్ల కేటాయింపు, ఆర్టీసీకి అద్దె బస్సులు ఇలా ప్రతి రంగంలో మహిళలను ప్రోత్సాహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుందన్నారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు అయిదు వందల రూపాయలకు గ్యాస్ సిలిండర్ పథకాలను ఇప్పటికే అమలు చేసిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పట్టాలు కూడా మహిళల పేరు మీద ఇవ్వడం జరుగుతుందన్నారు.

పోలింగ్ విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

ట్రైనింగ్ మేనేజ్మెంట్ నోడల్ అధికారి డా.సునంద రాణి

విశాలాంధ్ర - హైదరాబాద్ : పోలింగ్ విధుల పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు శిక్షణ ఉపయోగపడుతుందని ఎన్నికల ట్రైనింగ్ మేనేజ్మెంట్ నోడల్ అధికారి డా.సునంద రాణి అన్నారు. పోలింగ్ అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, ఓపిఓ లకు తొలి విడత ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్స్ వారికి ఎన్నికల నియమ నిబంధనలు, బ్యాలెట్ బాక్సుల సీల్ విధానం, బ్యాలెట్ పేపర్స్, అవసరమైన ఫారాలు పూరించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డెమో బ్యాలెట్ బాక్స్ ద్వారా వారితో ప్రత్యక్షంగా చేయించి హ్యాండ్స్ ఆన్ శిక్షణను ఇచ్చారు. శిక్షణలో పి.ఓ లు, ఏపిఓ లకు తలెత్తిన సందేహాలను మాస్టర్ ట్రైనర్స్ నివృత్తి చేసారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు విజయలక్ష్మి(పి.ఓ యు.సి.డి), మమత (ఈ ఈ ఎలక్ట్రికల్), పిఓ లు, ఏపిఓ లు, మైక్రో అబ్జర్వర్, ఓపిఓలు పాల్గొన్నారు.

తృణధాన్యాల ఉత్పత్తుల విభాగంలోకి తెనాలి డబుల్ హార్స్ గ్రూప్

దశలవారీగా విదేశాలకు మిల్లెట్ మార్వెల్స్

గ్రూప్ సీఎండీ మునగాల మోహన్ శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - హైదరాబాద్ : పప్పులు, ధాన్యాల విక్రయంలో ఉన్న తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ తాజాగా తృణ ధాన్యాల ఉత్పత్తుల విభాగంలోకి మిల్లెట్ మార్వెల్స్ పేరుతో ప్రవేశించింది. బ్రాండ్ కింద ధాన్యాలు, నూడుల్స్, కుకీస్, రెడీ టు కుక్ విభాగంలో 18 రకాల ఉత్పత్తులను ఆఫర్ చేయనుంది. అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జేఎండీ, మిల్లెట్ మార్వెల్స్ చైర్మన్ డాక్టర్ సంగీత రెడ్డి చేతుల మీదుగా వీటిని మార్కెట్లోకి విడుదల చేసింది. ఆర్గానిక్ ఉత్పత్తులు సైతం రానున్న రోజుల్లో విడుదల చేస్తామని వెల్లడించారు.

విదేశాలకు మిల్లెట్ మార్వెల్స్...

తొలుత తెలుగు రాష్ట్రాల్లో మిల్లెట్ మార్వెల్స్ ఉత్పత్తులను ప్రవేశపెడతామని మోహన్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఆ తర్వాత దేశవ్యాప్తంగా విస్తరిస్తామని చెప్పారు. 'రాబోయే 3 సంవత్సరాలలో గ్రూప్ ఆదాయంలో 5 శాతం మిల్లెట్ మార్వెల్స్ ద్వారా సమకూరుతుందని భావిస్తున్నాం. 2024-25లో సంస్థ సేల్స్ టర్నోవర్ రూ.535 కోట్లు దాటింది. మూడేళ్లలో నాలుగు అంకెల స్థాయికి టర్నోవర్‌ను చేర్చాలన్నది లక్ష్యం. 2005లో కంపెనీ ప్రస్థానం మొదలైంది. బ్రాండెడ్ కమాడిటీస్ రంగంలో మార్కెట్ లీడర్‌గా నిలిచాం. 12 దేశాల్లో అడుగుపెట్టాం. భారత్‌లో 15 రాష్ట్రాలోని కస్టమర్లకు చేరువయ్యాం. పప్పులు, ధాన్యాలు, రెడీ టు ఈట్, రెడీ టు కుక్ స్నాక్స్, డ్రై ఫ్రూట్స్, చాకొలేట్స్ విక్రయిస్తున్నాం' అని వివరించారు. తెనాలి డబల్ హార్స్ ఉత్పత్తులు జనరల్ ట్రేడ్, మోడరన్ ట్రేడ్, ఈ-కామర్స్, క్విక్ కామర్స్ ద్వారా వినియోగదారులకు అందజేస్తున్నామని తెలిపారు.

బీసీ రిజర్వేషన్ రౌండ్ టేబుల్ సమావేశం

విశాలాంధ్ర - ఎల్.బి.నగర్ : న్యూ నాగోల్ ఏ.ఎస్.డాంగే భవన్‌లో శనివారం ఉదయం 10:00 గంటలకు బిసి రిజర్వేషన్ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం, ఎన్నికల ముందు కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగానే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టి, ఆమోదింపజేసి పార్లమెంటుకు పంపిన సందర్భంగా, కేంద్ర ప్రభుత్వంపై మరింత ప్రజాతీవ్ర ఒత్తిడి తీసుకురావడానికి, అందులో భాగంగా క్షేత్రస్థాయి నుండి మరింత ప్రభావితం తీసుకురావడం కోసం, ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కావున్న బీసీ వాదులు, వివిధ బీసీ సంఘాల నాయకులు, బీసీ ఉద్యమకారులు, హాజరు కావలసిందిగా ఆయన కోరారు.

పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ మహా నగరానికి తాగునీరు సరఫరా చేసే గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై పథకంలో భాగంగా హైదర్ నగర్ నుంచి ఆల్వాల్ వరకు ఉన్న 1200 ఎంఎం డయా ఎంఎస్ గ్రావిటీ మెయిన్ పైపులైనుకు షాపూర్ నగర్ వద్ద మరమ్మతు పనులు చేపడుతున్నారు. 12న శనివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 9 గంటల వరకు ఈ పనులు జరుగుతాయి. కావున ఈ 15 గంటల పాటు జలమండలి ఓ అండ్ ఎం డివిజన్-12 పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా, మరికొన్ని ప్రాంతాల్లో పాక్షికంగా నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుంది. ఓ అండ్ ఎం డివిజన్-12 (షాపూర్ నగర్): షాపూర్‌నగర్, సంజయ్ గాంధీ నగర్, కలావతి నగర్, హెచ్ఎంటి సొసైటీ, హెచ్ఏఎల్ కాలనీ, టిఎస్ఐఐసి కాలనీ, రోడమేస్త్రి నగర్, శ్రీనివాస్ నగర్, ఇందిరానగర్, గాజులరామారం, శ్రీ సాయి హిల్స్, దేవేందర్ నగర్, కైలాస్ హిల్స్, బాలాజీ లేఅవుట్, కైసర్ నగర్, గాజులరామారం గ్రామం ప్రాంతాలలో అంతరాయం ఉంటుంది.

స్మశానవాటికను వైకుంఠ ధామంగా తీర్చి దిద్దుతాం

విశాలాంధ్ర - కాప్రా : నాచారం ఎర్రకుంట లోని హిందూ స్మశాన వాటికలో చాలా కాలం క్రితం నిర్మించిన స్నానాల గదులు, మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి స్థానంలో కొత్త మరుగుదొడ్లు, స్నానాల గదుల నిర్మాణానికి, అలాగే ఒక అదనపు బర్నింగ్ ప్లాట్ ఫామ్ నిర్మాణం కొరకు ప్రతిపాదనలు తయారుచేసి ఈ విషయమై నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ అధికారులతో కలిసి స్మశాన వాటికను పర్యటించారు. ఈ కార్యక్రమంలో డి ఈ బాలకృష్ణ ఏ ఈ కీర్తి క్వాలిటీ డి ఈ పవన్ ఏ ఈ వినీత్ బి ఆర్ ఎస్ నాయకులు దాసరి కర్ణ, కట్ట బుచ్చన్న గౌడ్, చిలుక శంకర్, రామచందర్, వినయ్, మల్లికార్జున గౌడ్, యాదగిరి కృష్ణ శ్రీరాములు, వెంకటేశ్వర్లు, వాసు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య పెంచాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : వేసవి సెలవుల్లో అంగన్వాడి బాట ప్రత్యేక కార్యక్రమం చేపట్టి అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మహిళా శిశు సంక్షేమ శాఖ అ ధికారులను ఆదేశించారు. గురువారం పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా హిమాయత్ నగర్ సెక్టర్ నాంపల్లి ప్రాజెక్ట్ లో గల భీమా మైదాన్ అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సెలవులలో జిల్లాలోని అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో అంగన్వాడి బాట కార్యక్రమాన్ని చేపట్టి కేంద్రాలకు ఎక్కువ మంది పిల్లలు వచ్చే విధంగా ప్రతి టీచర్, ఆయా చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతికేంద్రంలో పిల్లల హాజరు శాతం పెంచాలని పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. కేంద్రానికి వచ్చే పిల్లలు యూనిఫాంతో వచ్చేలా చూడాలని, కేంద్రంలోని పిల్లలకు అందించే మిల్క్, బాలామృతం, గుడ్లు, బియ్యాన్ని పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలతో పాటు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన సేవలు అందాలని ఆ దిశగా సిబ్బంది నిబద్ధతతో పని చేయాలని సూచించారు. డిడబ్ల్యుఓ అక్కేశ్వరరావు, తహసిల్దార్ సంధ్యారాణి, సిడిపిఓ కృష్ణ చైతన్య, సూపర్వైజర్ బాల, డిస్టిక్ కో ఆర్డినేటర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

మాతృ మరణాలు జరగకుండా గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి : కలెక్టర్

జిల్లాలో మాతృ మరణాలు జరగకుండా గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి గర్భిణీలకు తగు సూచనలు, సలహాలు, చికిత్స అందించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వైద్య ఆరోగ్యశాఖ వైద్యులను, సిబ్బంది కి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాతృ మరణాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో అయన పాల్గొని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాతృ మరణాలు సంభవించకుండా గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. గర్భిణీ స్త్రీల (జనన పూర్వ సంరక్షణ) సేవలు మెరుగుపరచాలని, గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ఏఎన్ఎంలో ఆశా వర్కర్లు ఫాలో అప్ చేయాలన్నారు. మాతృ మరణాలపై సమీక్షించారు. జిల్లాలో జరిగిన మాతృ మరణాలలో ఆరు మాతృ మరణాలపై సమీక్షించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్యులు, సిబ్బంది గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సరైన సమయంలో చికిత్సలు అందించి ఇకముందు మాతృమరణాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. హై రిస్క్ కేసులను సకాలంలో గుర్తించి గర్భిణి సమయంలో కాన్పు సమయంలో ఇబ్బంది కలగకుండా తల్లి బిడ్డ క్షేమంగా ఉండేటట్టు వైద్య సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. అవసరమైతే కాన్పు కోసం రిఫరల్ ఆసుపత్రికి పంపాలన్నారు. అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి దాక్టర్ జయమాలిని, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సూచేత,గాంధీ మెడికల్ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యవతి, ఎస్ పి హెచ్ ఓ లు, మెడికల్ ఆఫీసర్స్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తక్కువ సమయంలో స్లాట్ బుకింగ్ పద్ధతిని పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - మేడ్చల్-మల్కాజిగిరి : రాష్ట్రప్రభుత్వం రిజిస్ట్రేషన్లు పారదర్శకంగా, అవినీతి రహితంగా, సులువుగా, తక్కువ సమయంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు స్లాట్ బుకింగ్ పద్ధతిని ప్రవేశపెట్టిందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానాన్నిగురువారం నుండి అమలు పరుస్తున్న ప్రక్రియను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ప్రజలు వారికి అనుకూలమైన తేది, సమయాన్ని registration. tlangana.gov.in వెబ్సైట్ లో ఎంపిక చేసుకుని రిజిస్ట్రేషన్లకు వచ్చే విధంగా ప్రభుత్వం వెసలుబాటు కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో ప్రయోగాత్మకంగా చేపట్టిన ప్రక్రియలో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ ద్వారా నిర్వహిస్తున్న రిజిస్ట్రేషన్ విధానాన్ని కలెక్టరు వివరింగా పరిశీలించారు. దస్తావేజుల రిజిస్ట్రేషన్, ఆన్ లైన్ ఫోటో, స్కానింగ్ చేసే విధానాన్ని కలెక్టరు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ తహసీల్దారు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పేరుతో తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోం

విశాలాంధ్ర - హైదరాబాద్ : కొంతమంది పెయిడ్ జర్నలిస్టులు కావాలనే ప్రభుత్వం పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ మండిపడ్డారు. జర్నలిస్టులుగా ప్రభుత్వాన్ని విమర్శించినా, తిట్టినా పర్లేదు కాని ఇలా అబద్దాలను ప్రచారం చేస్తే మాత్రం ఊరుకోమని హెచ్చరించారు. ముఖ్యంగా జర్నలిస్ట్ ముసుగులో ఉన్న బీఆర్ఎస్ పెయిడ్ బ్యాచ్ కి ఇది చివరి హెచ్చరిక అంటూ వ్యాఖ్యానించారు. గురువారం నాడు గాంధీభవన్‌లో అయన విలేఖరులతో మాట్లాడుతూ పొద్దునే లేస్తే చాలు ముఖ్యమంత్రిని ఎలా తిట్టాలి అనే విషయంలోనే ఈ పెయిడ్ బ్యాచ్ ఆలోచిస్తుందని దుయ్యబట్టారు. జర్నలిస్టుల ముసుగులో కొందరు బీఆర్ఎస్ తొత్తులు కాంగ్రెస్ పార్టీపై బురద చల్లుతున్నారని, 33 యూ ట్యూబ్ ఛానెల్స్ పెడితే బాగుండని కేటీఆర్ అన్నారని అయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. యూ ట్యూబ్ ఉచ్చులో పడి ఇబ్బంది పడేది కేటీఆర్ మాత్రమే అని కాని, కొందరు జర్నలిస్టుల వల్ల నిజమైన జర్నలిస్టుల పరువు పోతోందని అయన అవేధన వ్యక్తం చేశారు. కొందరు జర్నలిస్టులు బీఆర్ఎస్ తొత్తులుగా, పేటీఎం బ్యాచులుగా, పెయిడ్ వర్కర్లుగా పని చేస్తున్నారని, జర్నలిస్టుల పేరుతో కొందరు చేస్తున్న అక్రమాలు మామూలుగా లేవని అన్నారు. జర్నలిస్టుల పేరుతో తెలంగాణ రాష్ట్ర ప్రజలను కొందరు ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర మరవలేమని, అమ్మాయిలను ఇబ్బంది పెట్టి కేసులైన వాళ్లు కూడా ప్రభుత్వం జర్నలిస్టుల గొంతు నొక్కుతోంది అంటే ఏం చేయాలని నిలదీశారు. బీఆర్ఎస్ అక్రమ డబ్బుతో యూ ట్యూబ్ ఛానెల్స్ ను పెంచి పోషిస్తోందని ఆరోపించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

విశాలాంధ్ర - హైదరాబాద్ : చాలాకాలంగా పెండింగ్లో వున్న బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్లు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లే కార్డులతో మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాద య్యగౌడ్ మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు రాక సర్పంచ్ లు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని అవేధన వ్యక్తం చేశారు. నేడు రేపు అంటూ బిల్లుల విడుదలలో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లులు విడుదల చేయకపోగా రేవంత్ ప్రభుత్వం మాజీ సర్పంచ్లపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని దుయ్యబట్టారు. పెండింగ్ బిల్లుల కోసం సీఎంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసినా ఫలితం కానరావడం లేదని విమర్శించారు. పెండింగ్ బిల్లులను విడుదల చేసేంత వరకు ప్రతీ రోజు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉంటామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లో సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లయ్య, కార్యదర్శి, నాయకులు పాల్గొన్నారు.

కంబైన్డ్ డిఫెన్స్ ఎగ్జామినేషన్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో మూడు సెషన్స్‌లలో నిర్వహించే డిఫెన్స్ సర్వీస్ ఎగ్జామినేషన్ అలాగే రెండు సెషన్స్‌లలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ ఎగ్జామినేషన్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డిఆర్ఓ ఈ. వెంకట చారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న జరుగు పరీక్షలపై చీఫ్ సూపర్డెంట్లు, రూట్ ఆఫీసర్స్, లోకల్ ఇన్స్పెక్టింగ్ అధికారులు అలాగే ట్రైం డిపార్ట్మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 22 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఈ పరీక్షలకు 8086 మంది పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షల నిర్వహణ దృష్ట్యా మౌలిక వసతులు కల్పించాలని అన్ని కేంద్రాలను ముందుగా పరిశీల చేసి వసతులు కల్పన పై నివేదికలు అందించాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో భాగంగా ఐదు రూట్లుగా విభజించడం జరిగిందని లోకల్ ఇన్స్పెక్టింగ్ అధికారులుగా 22 మందిని నియమించడం జరిగిందని తెలిపారు. డిఫెన్స్ సర్వీస్ ఎగ్జామినేషన్ ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు ఇంగ్లీష్, మధ్యాహ్నం 12 నుండి నుండి 2.30 వరకు జనరల్ నాలెడ్జ్ పరీక్ష అలాగే సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు ఎలిమినేటరి మ్యాథమెటిక్స్ పరీక్ష ఉంటుందని అన్నారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ ఎకాడమీ ఎగ్జామినేషన్ పరీక్షలు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు మ్యాథమెటిక్స్ పరీక్ష అలాగే మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు జనరల్ ఎబిలిటీ టెస్ట్ పరీక్ష ఉంటుం దని ఆయన తెలిపారు. యు పి ఎస్ సి నుండి అండర్ సెక్రెటరీ పవన్ కుమార్ గుప్తా అలాగే అబ్జర్వర్‌గా అదనపు కమిషనర్ గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ శివ్ నారాయణ్ పరీక్ష కేంద్రాలను కేంద్రాలను తనిఖీ చేస్తారని విధులు నిర్వహించే అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. అదనపు డిసిపి భాస్కర్, పర్యవేక్షకులు జహీరుద్దీన్, చీఫ్ సూపర్డెంట్లు, రూట్ ఆఫీసర్లు, లోకల్ ఇన్స్పెక్టింగ్ అధికారులు, ట్రైం డిపార్ట్మెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మౌలాలి డివిజన్ పిల్లి నర్సింగరావు నగర్ కాలనీ కమిటీ పిలుపు మేరకు అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన దుర్మార్గున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి వినోద, ఐద్వా మల్కాజిగిరి మండల కార్యదర్శి మంగ మాట్లాడుతూ కాలనీలో నివాసం ఉంటున్న 11 సంవత్సరాల మైనర్ అమ్మాయి పై 60 సంవత్సరాల కిషన్ అనే వ్యక్తి దుర్మార్గపు ఆలోచనతో చిన్నపిల్ల అని కూడా చూడకుండా అత్యాచారం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. 30 ఏళ్ల చరిత్రలో అక్క చెల్లి, అన్న, తమ్ముడు, తండ్రి, కూతురులాగా అందరూ కలిసిమెలిసి కాలనీలో ఉంటున్నారు. బాధితురాలు తండ్రి చనిపోవడంతో తల్లి ప్రవేటు డ్యూటీకి వెళ్ళింది, ఆ సమయంలో వర్షం రావడం కాలనీ వారు ఎవరు బయటకు రాకపోవడం చూసుకొని మైనర్ బాలిక ఇంటికి వెళ్లి డోర్ పెట్టి అమ్మాయిని అత్యాచారం చేయడం అతి దుర్మార్గమైన అంశం అతన్ని కఠినంగా శిక్షించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం జరిగిన అమ్మయి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలబడి అమ్మాయికి ఉచితంగా పై చదువుల వరకు చదివించాలని ఆ కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ప్రభుత్వం ఇల్లు ఇవ్వాలని డిమాండ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.రాజ్యలక్ష్మి, నజీమా, అనిత, షాహిన్, కె.పద్మ, నరసమ్మ, అంజమ్మ, లక్ష్మి, పౌజీయ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఉష్ణోగ్రతల్లో ఆరోగ్య సౌకర్యాలపై సమావేశం

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మేడ్చల్ మాల్కాజిగిరి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వేడి-ఆరోగ్యం హీట్‌వేవ్ పై జిల్లా లోని ప్రాథమిక /పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులకు సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.సి.ఉమా గౌరీ అధ్యక్షత వహించారు. ఈ సమావేశం తీవ్ర ఉష్ణోగ్రతల ప్రభావం, వాటి వల్ల జరిగే ఆరోగ్యపరమైన సమస్యలను ఎదుర్కొనే విధానాలపై దృష్టి పెట్టింది. టాస్క్ ఫోర్స్ సమావేశంలో అధిక ఉష్ణోగ్రతల సందర్భాల్లో ఆరోగ్య సౌకర్యాలకు ప్రాథమిక సేవలకు సమర్థమైన యాక్సెస్ కల్పించడంపై చర్చలు జరిగాయి. అధిక ఉష్ణోగ్రతల కొరకై జాగ్రత్తల గురించి సమయానికి ముందస్తు ప్రజలకు హెచ్చరికలను ఆరోగ్య సౌకర్యాలకు వారి ఇన్-చార్జీలకు అందించడంపై నిర్ణయాలు తీసుకున్నారు. అంబులెన్సులు, ప్రాథమిక ఆరోగ్య సేవలు, నీరు, ఐస్ ప్యాక్స్, వంటి సామగ్రితో సేవలను అందించడానికి అవసరమైన ముందస్తు చర్యలపై పై కూడా చర్చించారు. రెవెన్యూ, వ్యవసాయం, నీరు శానిటేషన్, కృత్రిమ పోషణ, గ్రామీణ అభివృద్ధి, విద్య, ఐసిడిఎస్, వాతావరణం, సంక్షేమం మరియు కాలుష్య నియంత్రణ బోర్డు వంటి ఇతర లైన్ డిపార్ట్మెంట్‌లతో సమన్వయం ఏర్పరచుకోవడానికి సూచించారు. వేడి ప్రభావాలకు ఎక్కువగా దారితీసే మురికివాడలు, గ్రామీణ ప్రాంతాలు, పాఠశాలలు బయట జరిగే బహిరంగ కార్యక్రమాల వంటి హాట్ స్పాట్లను గుర్తించడం ఎంతో అవసరమని డా. సి.ఉమా గౌరీ తెలిపారు. ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, వైద్య సేవలను, శీఘ్ర శీతలీకరణ చర్యలను సమర్థంగా ఏర్పాటు చేయడం గురించి కసరత్తు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి నాన్-కమ్యూనికబుల్ వ్యాధుల జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మల్లీశ్వరి, మల్కాజిగిరి డివిజన్ల డిప్యూటీ జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారులు, డాక్టర్ శోభా రాణి, వెక్టర్ వ్యాధుల జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్రీదేవి, ఎన్యూఎచ్ఎం జిల్లా ప్రోగ్రామ్ అధికారి డా.గీత, మాతాశిశువు జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ చంద్రకల, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కౌశిక్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల అరెస్టులను ఖండించండి

ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి యండి యూసుఫ్

విశాలాంధ్ర- హైదరాబాద్ : ఉద్యోగ భద్రతకై ప్రజాస్వామ్యబద్ధంగా ఉన్నత విద్యా మండలి ఎదుట ధర్నా నిర్వహించటానికి వచ్చిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల అక్రమ అరెస్టును ఖండిస్తూ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లందర్నీ పర్మినెంట్ చేయాలని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.డి.యూసుఫ్ డిమాండ్ చేశాడు. ప్రభుత్వ విద్యా విధానాన్ని నీరుగార్చటానికి కాంట్రాక్ట్ విధానంలో ఉపాధ్యాయులను, అసిస్టెంట్ ప్రొఫెసర్లను అలాగే మిగిలిన సిబ్బందిని కాంట్రాక్ట్ విధానంలో నియమించి ఈ ఉద్యోగం ఎంతకాలం ఉంటుందో తెలియక అభద్రతా భావానికి లోనవుతూ విద్యార్థులకు పూర్తి స్థాయిలో బోధించలేకపోవటం వల్ల ప్రభుత్వ విద్యలో నాణ్యత లోపిస్తూ ప్రభుత్వ విద్యాలయాలకు ఉన్న పేరు ప్రతిష్టలు కాలక్రమేణా తగ్గటం, ప్రైవేటు విద్యనే నాణ్యమైన విద్య అనేటట్లు ప్రభుత్వాలు అవలంభించే విధానాలు ఉన్నాయి. ఈ విధానాలను విడనాడి వెంటనే విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తూ వారి ఉద్యోగాలను క్రమబద్దీకరించాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు, కాంట్రాక్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.డి.యూసుఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల, ఉపాధ్యాయుల, అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యలను వెంటనే పరిష్కరించని యడల ఎఐటియుసి పూర్తి స్థాయిలో ఉద్యమాలు నిర్వహిస్తుందని, అలాగే కాంట్రాక్ట్ ప్రొఫెసర్లు నిర్వహిస్తున్న ఉద్యమాలకు పూర్తి మద్దతును తెలియజేస్తుందని యం.డి.యూసుఫ్ తెలియజేశారు.

నకిలీ డాక్యుమెంట్స్‌తో భూమిని కాజేయాలని చూసే వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర–బషీర్‌బాగ్: రూల్స్ ప్రకారమే తాము భూమి కొనుగోలు చేశామని కొందరు నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించి తమ భూమిని కాజేయాలని, తమకు రక్షణ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, డిజిపికి భూయాజమాని రిజ్వాన్ షేక్ కోరారు. బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలంలోని కమ్మగూడలోని సర్వే నెంబరు 240, 241,242లో గల 10.9 ఎకరాల భూమిని ఉప్పల్‌కు చెందిన గుండ్ల రాజమ్మ వద్ద తాము కొనుగోలు చేశామని తెలిపారు. ఈ భూమికి 2024లో కోర్టు నుంచి ఫైనల్ డిగ్రీ వచ్చిందని తమ న్యాయవాదుల చేత అన్ని సలహాలు తీసుకుని భూమిని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. గతంలో కొందరు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి అమాయకులైన ప్రజల నుంచి డబ్బులు దండుకుని డబుల్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారని ఆరోపించారు. ఆ భూమికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, దీంతో తాము కొనుగోలు చేసిన భూమికి సరిహద్దులు వేసేందుకు కూలీలను తీసుకొని వెళ్లడం జరిగిందని, కాగా అక్కడ ఉన్న కొంతమంది తమ కూలీలపై కర్రలు, రాళ్ళతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై డయల్ 100కు పలు మార్లు ఫోన్ చేసినా పోలీసులు స్పందించలేదని ఆరోపించారు. తమకు కోర్టు నుంచి ఫైనల్ డిగ్రీ ఉన్నప్పటికి పోలీసులు రక్షణ కల్పించకపోవడం బాధకరమాని, ఈ విషయంలో డిజిపి జోక్యం చేసుకుని, న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఫూలే స్ఫూర్తితో ప్రజాపాలన : మంత్రి పొన్నం

విశాలాంధ్ర – హైదరాబాద్ : కుల వివక్షకు వ్యతిరేకంగా సమ సమాజం కోసం పోరాడిన బహుజన తత్వవేత్త దార్శనికుడు మహాత్మా జ్యోతి రావు పూలే 198వ జయంతి సందర్భంగా రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళులు అర్పించారు. దేశానికి జ్యోతిబాపులే అందించిన సేవలను ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ స్మరించుకున్నారు. వర్ణవివక్షను రూపుమాపడం కోసం దళిత బహుజన మహిళా వర్గాల అభ్యున్నతి కోసం, మహాత్మా జ్యోతిరావు పూలే ఆచరించిన కార్యచరణ మహొన్నతమైందని తెలిపారు. భారతదేశంలో అట్టడుగు వర్గాల పై జరుగుతున్న దాస్టికాలపై పోరాటం చేసిన వ్యక్తి జ్యోతిరావు పూలే. తన జీవితాన్ని భార్య సావిత్రిబాయి సహకారంతో పోరాటం ప్రతిఘటన సంస్కరణకు అంకితం చేసిన మహొన్నతుడాయన. కుల లింగ వివక్షతకు తావు లేకుండా విద్యా సమానత్వం ద్వారానే సామాజిక ఆర్థిక సమున్నతికి బాటలు పడతాయని పూలే ఆలోచన విధానాన్ని తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వం జ్యోతి బాపులేను స్మరించు కుంటూ ప్రగతి భవన్‌కు మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌గా నామకరణం చేసుకున్నామని గుర్తు చేశారు. జ్యోతిబాపూలే విద్యా కు ఇచ్చిన ప్రాధాన్యతతో వెనబడిన తరగతుల గురుకులాలకు మహాత్మ జ్యోతిరావు పూలే గురుకులాలుగా ముందుకు వెళున్నాయి. తెలంగాణలో సామాజిక న్యాయం కోసం దేశానికే దిక్సూచిగా తెలంగాణ ప్రభుత్వం కుల గణన చేసుకున్నామని వెల్లడించారు. బీసీలకు 42శాతం రాజకీయ విద్య ఉద్యోగాలు రిజర్వేషన్లు పెంచడానికి చట్టం చేసుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం జ్యోతిరావు పూలే ఆశయాలను ముందుకు తీసుకుపోతూ సామాజిక న్యాయం ఆర్థిక అభివృద్ధి తదితర అంశాలతో ముందుకు పోతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

ఎన్నారై అడ్వయిజరీ కమిటీ నియామకం

విశాలాంధ్ర – హైదరాబాద్ : ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు గల్ఫ్ కార్మికుల సంక్షేమం, సమగ్ర ఎన్నారై పాలసీపై అధ్యయనం చేయడానికి అడ్వయిజరీ కమిటీని నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గురువారం జి.ఓ. విడుదల చేశారు. రెండేళ్ల కాలపరిమితి గల ఈ కమిటీ చైర్మన్‌గా ఇండియన్ ఫారిన్ సర్వీస్ రిటైర్డ్ అధికారి, అంబాసిడర్ డా. బి.ఎం. వినోద్ కుమార్, వైస్ చైర్మన్‌గా గల్ఫ్ వలసల నిపుణులు మంద భీంరెడ్డిలను నియమించారు. జిఎడి ప్రోటోకాల్, ఎన్నారై విభాగానికి చెందిన జాయింట్ సెక్రెటరీ స్థాయి ఐఏఎస్ అధికారి కమిటీకి మెంబర్ సెక్రెటరీగా వ్యవహరిస్తారు. కమిటీలో సభ్యులుగా మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్.భూపతిరెడ్డి, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్, బాల్కొండ మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌లను నియమించారు. గల్ఫ్ వలసలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కలిగిన ప్రవాసీ కార్మిక నాయకులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, డా. జీ జోసెఫ్, చెన్నమనేని శ్రీనివాస రావు, కొట్టాల సత్యంనారా గౌడ్, గుగ్గిల్ల రవిగౌడ్, సంగి దేవేందర్‌రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల లను కమిటీ సభ్యులుగా నియమించారు. గత సంవత్సరం ఏప్రిల్ 16న ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి హైదరాబాద్ తాజ్ దక్కన్‌లో గల్ఫ్ సంఘాల ప్రతినిధులతో సమావేశమైన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గల్ఫ్ తదితర గమ్యస్థాన దేశాలలోని అల్పాదాయ తెలంగాణ వలస కార్మికులకు ఆయా దేశాలలో లభిస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. దేశంలోని కేరళ, పంజాబ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో గల్ఫ్ కార్మికులకు అందుబాటులో ఉన్న సంక్షేమ పథకాలను ఈ కమిటీ అధ్యయనం చేస్తుంది. ప్రవాసీ కార్మికుల సమస్యలను అర్థం చేసుకోవడానికి, పరిష్కారాలను కనుగొనడానికి ఈ కమిటీ గల్ఫ్ దేశాలను కూడా సందర్శిస్తుంది. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా సమగ్ర ప్రవాస భారతీయుల విధానం (ఎన్నారై పాలసీ) రూపకల్పనతో పాటు, తెలంగాణ గల్ఫ్ అండ్ అదర్ ఓవర్సీస్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుంది.

కేఎల్ మహేంద్ర సోషల్ స్టడీ సర్కిల్‌కు ఏటుకూరి ప్రసాద్ పుస్తకాల వితరణ

విశాలాంధ్ర – కాప్రా : ఈసీఐఎల్ సీపీఐ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన కెఎల్. మహేంద్ర సోషల్ స్టడీ సర్కిల్ గ్రంథాలయానికి సీపీఐ సీనియర్ నేత, ప్రముఖ పాత్రికేయులు, రచయిత ఏటుకూరి ప్రసాద్ వి.ఎస్.బోస్ ద్వారా 100 పోటీ పరీక్షల మెటీరియల్స్‌ను అందజేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్. బోస్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులు అన్ని అంశాలపై పఠనం చేయాలని అన్నారు. ఏటుకూరి ప్రసాద్ తన రచనల ద్వారా సామాజిక అంశాలపై ఎనలేని కృషి చేశారని అన్నారు. గతంలో అనేక దినపత్రికలకు సంపాదకులుగా పనిచేసిన అనుభవం ఆయన సొంతమని బోస్ తెలిపారు. అందుకే సాహిత్యంపై మంచి పట్టు ఉందని 85 సంవత్సరాలు గడిచినా ఇప్పటికి అనేక వ్యాసాలు, రచనల ద్వారా సమసమాజ మార్పు కోసం అవిరాళంగా కృషి చేస్తున్నారని తెలిపారు. కెఎల్. మహేంద్ర సోషల్ స్టడీ సర్కిల్ కార్యదర్శి జీ.దామోదర్ రెడ్డి,ఎస్. శంకర్‌రావు, నారా నర్సింహా, రాఘవేంద్రరావు, సత్య ప్రసాద్, ధర్మేంద్ర, పోటీ పరీక్షల అభ్యర్థులు సాయి, అరుణ్, ప్రదీప్, నరహరి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర – హైదరాబాద్ : వివిధ రంగాలలో తెలుగు రాష్ట్రాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన గురువారం సికింద్రాబాద్‌లోని తాజ్ మహల్ హొటల్‌లో ఘనంగా నిర్వహించారు. 50 సంవత్సరాల తర్వాత జరిగిన ఈ ప్రత్యేక సమావేశంలో ప్రముఖ డాక్టర్లు, పారిశ్రామిక వేత్తలు, విద్యావేత్తలు, చదివిన స్కూల్, కాలేజీ గుర్తుకు చేసుకునేందుకు ప్రత్యేకంగా రూపొందించిన జ్ఞాపికను పూర్వపు విద్యార్థులందరూ గుర్తుగా అందుకొని అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మీరంతా కడప పట్టణంలోని శ్రీ రామకృష్ణ పాఠశాల, జూనియర్ కళాశాలలో 1965 – 2005 మధ్య చదివిన పూర్వపు విద్యార్థులు. ఈ సమావేశానికి జీ. ప్రకాష్‌రావు, సుజాత, శారద పూర్వ గురువులు హాజరై పూర్వపు విద్యార్థులను ఆశీర్వదించారు. పూర్వ విద్యార్థులను ఎన్ సత్యనారాయణ, షబ్బీర్ హుస్సేన్ షేక్‌లు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ జగదీష్ బాబు డాక్టర్ కొండారెడ్డి కే సంజీవరెడ్డి ఉదయ భాస్కర్ రెడ్డి రఘురాం మూర్తి గోపినాథ్ తోపాటు సుమారు వందమంది ప్రాంతాలలో కడప, కర్నూల్, హైదరాబాద్, విజయవాడ, వరంగల్ తదితర నగరాలలో స్థిరపడిన ప్రముఖులే, ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ చదువుతూనే ఈరోజు వివిధ స్థాయిలో ఉన్నామని తెలిపారు. ఈ సందర్భముగా తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తాం

విశాలాంధ్ర–బషీర్‌బాగ్: తెలంగాణ రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ చేస్తుందని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ప్రకటించారు. ఇందుకు సంబంధించి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఆప్ క్యూఆర్ కోడ్ పోస్టర్ విడుదల చేశారు. బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యులు కాకపోయినా ఎవరైనా సామాన్యులు పారదర్శకత, జవాబుదారీతనం ఉన్న వారు రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ నుండి పోటీ చేయడానికి ఆప్ క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించి దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. రైతులు, మహిళలు, యువతతో సహా సమాజంలోని ప్రతి వర్గానికి మంచి విద్య, ఆరోగ్య సంరక్షణ, జీవనోపాధికి హామీ ఇస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ ను విస్తరించే ప్రతిష్టాత్మక ప్రణాళికలో భాగంగా దేశవ్యాప్తంగా స్థానిక సంస్థలకు జరిగే అన్ని ఎన్నికలలో పోటీ చేయాలని ఆప్ జాతీయ నాయకత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్ నేతలు జావీద్ షరీఫ్, నర్సింగ్ యమునా గౌడ్, డా. లక్ష్య నాయుడు, సుధారాణి, షాబాజ్, లియాఖత్ ఖాన్, లతా, మౌనిక, ధర్మేందర్ తివారి, స్వామి, సురేష్, జూలకంటి నాగరాజ్, విజయ్ ముల్లంగి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు

విశాలాంధ్ర–షాద్‌నగర్, రూరల్: ఇష్టపడి క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలను ఆదిరోహించవచ్చు అని అన్నారు. షాద్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించిన కళాశాల వార్షికోత్సవ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు మంచి నడవడిక అలవర్చుకోవాలన్నారు. మెరుగైన సమాజం యువత ద్వారా సాధ్యమని పేర్కొన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని పెట్టుకునే విద్యను అభ్యసించాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే కచ్చితమైన ప్రణాళిక, కృషి అవసరం అని తెలిపారు. ప్రతి విద్యార్థి జీవితంలో డిగ్రీ దశ అనేది చాలా కీలకం అనీ, జీవితంలో ఎదిగేందుకు డిగ్రీ కీలక మలుపు అని అన్నారు. గతంలో కళాశాలలో మౌలిక వసతుల కల్పనకై కృషి చేశానని, రాబోవు రోజుల్లో కళాశాలను ఒక ఉత్తమ కళాశాలగా అభివృద్ధి చేయుటకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్, విశ్వం, చెన్నయ్య, శ్రీకాంత్ రెడ్డి, బాలరాజ్ గౌడ్, వెంకట్రామిరెడ్డి, రఘు నాయక్, అగ్గనూరు బస్వం, ఇబ్రహీం, ముబారక్ అలీ ఖాన్, మాధవులు, బచ్చాలి నరేష్ పాల్గొన్నారు.

సోమాలియా రోగికి మెదడులో తుపాకీ బుల్లెట్ తొలగింపు

విశాలాంధ్ర – శేరిలింగంపల్లి : కేర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ, హైదరాబాద్‌లో వైద్య నిపుణులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. సోమాలియాకు చెందిన 26 ఏళ్ల గులెమ్ మొహమద్ హెర్సీ అనే యువకుడి మెదడులో ఉన్న తుపాకీ బుల్లెట్‌ను శస్త్రచికిత్స ద్వారా సురక్షితంగా తొలగించారు. తుపాకీ గాయం కారణంగా ఆయన స్వదేశంలోనే గాయపడగా, హైదరాబాదులోని కేర్ హాస్పిటల్‌కు ఎయిర్‌లిఫ్ట్ చేయడం జరిగింది. పేషెంట్ కోమాలో ఉండి, చేతులు, కాళ్లలో బలహీనతతో బాధపడుతూ ఆసుపత్రికి రాగా, న్యూరోసర్జన్ డా. లక్ష్మినాథ్ శివరాజు నేతృత్వంలోని బృందం శస్త్రచికిత్సకు సిద్ధమైంది. ఈ క్లిష్టమైన సర్జరీ గురించి, డా. శివరాజు మాట్లాడుతూ, "బుల్లెట్ మెదడులో చాలా సున్నితమైన ప్రాంతంలో ఉంది. చిన్న పొరపాటు కూడా మెదడు పనితీరును ప్రభావితం చేస్తుంది. అలాంటి క్లిష్టతలో సురక్షితంగా బుల్లెట్ తొలగించడం చాలా గర్వకారణం," అని తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం పేషెంట్ ఆరోగ్యంలో వేగంగా మెరుగుదల కనిపించి, నెమ్మదిగా కోలుకుంటున్నాడు. రోగి గులెమ్ మాట్లాడుతూ, "ఇక్కడికి రాగానే నేను అచేతనంగా ఉన్నాను. ఇక జీవితమే లేదనిపించింది. కానీ కేర్ హాస్పిటల్స్ బృందం నాకు కొత్త జీవితం ఇచ్చింది. ఇక్కడి వైద్యులు నాకు కుటుంబ సభ్యుల్లా ఆదరించారు. వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు," అని పేర్కొన్నారు. కేర్ హాస్పిటల్స్ హైటెక్ సిటీ సీఓఓ శ్రీ నిలేశ్ మాట్లాడుతూ, "ఇలాంటి క్లిష్టమైన కేసులు మా ఆసుపత్రిలో ఉన్న అత్యాధునిక వైద్య సదుపాయాల్ని, నిపుణుల నైపుణ్యాన్ని చూపిస్తాయి.

రాజ్యాంగంపై అవగాహన పెంచడమే లక్ష్యం : కొలను

విశాలాంధ్ర–కుత్బుల్లాపూర్: రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా పరిరక్షణ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పెద్ద ఎత్తున పాదయాత్ర జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ అనే నినాదంతో కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ ఎం సి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తూ ప్రతి డివిజన్లకు కాలినడకతో ప్రజల మధ్యకు వెళ్లి మన దేశం గొప్పదనం మన రాజ్యాంగం గొప్పతనం తెలుపుతూ ప్రజలలో చైతన్యం కలిగిస్తూ ముందుకు వెళ్లడం కొనసాగుతుంది. అందులో భాగంగా గురువారం 7వ రోజు ప్రగతి నగర్ 6,24,25 డివిజన్లో పాదయాత్ర కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజల మధ్యకు వెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగం గొప్పతనం తెలుపుతూ ప్రజలలో చైతన్యం కలిగిస్తున్న జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ అనే ఈ కార్యక్రమానికి మాతోపాటు మీరందరూ పాల్గొని మీ వంతు బాధ్యతను మీరు నిర్వహిస్తున్నందుకు ఎంతో గర్వంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొలన్ వీరేందర్ రెడ్డి, చెట్ల దివాకర్, ఇంద్రజిత్ రెడ్డి, ఆవుల జగదీష్, రఫియా బేగం, కడియాల ఇందిరా, సీనియర్ నాయకులు కొలన్ జీవన్ రెడ్డి, రాజిరెడ్డి, వీరబాబు, వరగాని వాసు, మురళీకృష్ణ, మేడ శ్రీనివాస్, బిక్కన్ షా, రఫత్, పంగా శ్రీనివాసరావు, మల్లికార్జున్, నారాయణరెడ్డి, మహేష్, రాములు నాయక్, చిరంజీవి, ఏ రవీంద్ర, రమేష్, ఏనుగుల మధుసూదన్ రెడ్డి, లింగాల గంగాధర్, ఏలూరి సత్య, విజయ్, శ్రీశైలం యాదవ్, మౌలేశ్వరరావు, శ్రీనివాసరాజు మహిపాల్, రాము యాదవ్, ప్రవీణ్, రఘు, బాలాజీ, శ్రీరామ్ రెడ్డి, ఆలేటి శ్రీను, హరిబాబు, ప్రభాకర్ రెడ్డి, సత్తిరెడ్డి, బలవంత రెడ్డి, క్రాంతి, సురేష్, ఏవి రెడ్డి, భాస్కర్ రెడ్డి, సాయిరాజ్, మహమ్మద్, విష్ణు, ఆజాద్, రవికుమార్, లక్ష్మణ్, పితాని శ్రీనివాస్, గౌస్, శ్రీనివాస్, నాగరాజు యాదవ్,ఆంజనేయులు, వర్మ పాల్గొన్నారు.

13న గ్రాండ్ బైశాఖి మేళా

విశాలాంధ్ర – శేరిలింగంపల్లి : పంజాబీ సంప్రదాయాలు కాపాడటం, ఐక్యతను పెంపొందించడమే లక్ష్యంగా ఈనెల 13వ తేదీన గ్రాండ్ బైశాఖి మేళా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ పంజాబీ సభ అధ్యక్షుడు రవీందర్ సింగ్ సర్నా తెలిపారు. ఈ మేళా వివరాలు తెలిపేందుకు సికింద్రాబాద్ లో ఉన్న రాయల్ రెవ్ హొటల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఈవెంట్ హెచ్‌ఐసీసీ నోవోటెల్ లో నిర్వహించనున్నామని చెప్పారు. ఈ మేళాలో ప్రముఖ పంజాబీ గాయకుడు గురదాస్ మాన్ జీ ప్రత్యక్ష ప్రదర్శన, పాటియాలకు చెందిన ప్రముఖ డాన్స్ బృందంచే భాంగ్రా, గిద్దా ప్రదర్శన, చండీగఢ్ కు చెందిన శశి ధీమన్ హాస్య ప్రదర్శనలు కలవన్నారు. తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారిక ఆతిథ్య భాగస్వామిగా ఉంటుందన్నారు. మూడు నుంచి నాలుగు వేల మంది ఈ మేళాకు విచ్చేస్తారని తెలిపారు. సంగీతం, నృత్యం, సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో అలరించనున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ పంజాబీ సభ సలహాదారులు సురేందర్ పాల్ సింగ్ సలుజా మాట్లాడుతూ తెలంగాణ పంజాబీ సభ 1963లో స్థాపించబడిందన్నారు. ఆరు దశాబ్దాలుగా ఈ పంజాబీ సభ సాంస్కృతిక పరంగా, సమాజ సేవ పరంగా ఎంతో కృషి చేస్తుందన్నారు. లోహ్రీ, బైసాఖీ, దివాళి మిలన్ తదితర ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. భంగ్రా ప్రదర్శనలు, ఉత్సవ విందులు వంటి కార్యక్రమాలతో ఈ ప్రాంతంలో పంజాబీ సంస్కృతిని సజీవంగా ఉంచడంలో కృషి చేస్తున్నామన్నారు. ఎంతో పేరుగాంచిన దలేర్ మెహంది, జస్బీర్ జస్సీ, హార్డ్ కౌర్, హన్స్ రాజ్ హన్స్, సుగంధ మిశ్రా, మీట్ బ్రదర్స్, సతీందర్ సర్తాజ్ తదితరాలకు ఆతిథ్యం ఇచ్చామన్నారు. తెలంగాణ పంజాబీ సభ ఉపాధ్యక్షులు ప్రేమ్ కుమార్ కపూర్, హరీష్ శేఠీ, ప్రధాన కార్యదర్శి జోగిందర్ సింగ్ ముజ్రాల్ పాల్గొన్నారు..

ఆంజనేయ స్వామి కరుణా కటాక్షాలు అందరిపై ఉండాలి

విశాలాంధ్ర–కుత్బుల్లాపూర్: శ్రీ అంజనేయస్వామి కరుణ కటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని మాజీ కార్పొరేటర్ ఆగంరాజు ముదిరాజ్ పేర్కొన్నారు. గురువారం నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆలయ ధర్మకర్త, 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ శ్రీ వెంకట శివ రామాలయం నందు శ్రీ అంజనేయ స్వామి వారి విజయవత్సవ వేడుకల సందర్భంగా ఆంజనేయ స్వామి వారికీ క్షీరాభిషేకము, వేశేష పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

పేదలకు ఆసరాగా ముఖ్యమంత్రి సహాయనిధి

ఎంపీ ఈటెల రాజేందర్

విశాలాంధ్ర–దుండిగల్: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఆసరాగా నిలుస్తుందని మేడ్చల్ మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ పేర్కొన్నారు. నియోజకవర్గం నిజాంపేట్ కార్పొరేషన్ 1వ డివిజన్ మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు చొరవ, ఎంపి ఈటల రాజేందర్ సిఫార్సుతో హరితవనం కాలనీ నివాసి కనకమెడల కిషోర్ కుమార్‌కి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 50 వేల రూపాయలు మంజూరు చేయించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావుకి కృతజ్ఞతలు తెలిపారు.

యువత క్రీడలపై దృష్టి సారించాలి : ఎమ్మెల్సీ

విశాలాంధ్ర – కొత్తూరు : నేటి సమాజంలో యువత చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం నందిగామ మండలం మామిడిపల్లి గ్రామం యువకులు నిర్వహించిన ఎంపిఎల్ –9 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సి నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు మానసిక ప్రశాంతతకు దోహదపడతాయని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు తమలోని దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీసి గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో రాణించి తమ గ్రామాలకు గొప్పపేరు తేవాలని అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడంలో తాను ఎల్లప్పుడు ముందుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మామిడిపల్లి మాజీ ఎంపిటిసి కాట్న మాదవి రవీందర్, మాజీ సర్పంచ్ కవిత శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్‌లు సత్యనారాయణ, హన్మంత్ రెడ్డి, సోఫియా షఫీ, వార్డ్ సభ్యులు రఘుపతి రెడ్డి, వెంకటేష్ రెడ్డి, అబ్బాస్, ప్రభు, బీఆర్‌ఎస్ నాయకులు ప్రతాప్ రెడ్డి, మొయినోదీన్, అశ్రఫ్, పురుషోత్తం రెడ్డి, వినోద్, అన్వర్, రాంరెడ్డి, ఆంజనేయులు గౌడ్, రాంచెంద్రయ్య, క్రిష్ణ రెడ్డి, రవీందర్ రెడ్డి, మధు, చంద్రశేఖర్ రెడ్డి, రాజు, మనోహర్, ఆర్గనైజర్స్ చిట్టీ, చందు, మాజిద్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలి

విశాలాంధ్ర – జవహర్‌నగర్ : సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మేడ్చల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం జవహర్ నగర్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్ బస్‌స్టాప్ దగ్గర కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ కి వ్యతిరేకంగా పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను 50 రూపాయలు పెంచడాన్ని నిరసిస్తూ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా మేడ్చల్ డివిజన్ కమిటీ కార్యదర్శి వి.ప్రవీణ్ మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పటికీ గ్యాస్ ధరలు పెంచడం అన్యాయమని అన్నారు. 2014 సంవత్సరం నుండి నేటి వరకు 41% క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పటికీ పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెంచి వాహనదారులపై మరియు గృహిణులపై భారం మోపడం దుర్మార్గమని అన్నారు. పెరుగుతున్న నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో గ్యాస్ బండ 50 రూపాయలు పెంచడం సరైనది కాదని పెంచిన గ్యాస్ సిలిండర్ ధర వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డి. స్వరూప మాట్లాడుతూ బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 11 సంవత్సరాల కాలంలో అనేకమార్లు గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడానికి వ్యతిరేకించారు. మహిళలకు ఉజ్వల గ్యాస్ సిలిండర్ ధరలు కూడా పెరగటం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు బి లక్ష్మీబాయి, జి రాజేశ్వరి, జి రేణుక, అండాలు పాల్గొన్నారు.

శంకర్ నాయక్‌కి ఎమ్మెల్సీ శంబిపూర్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర–దుండిగల్: గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి దుండిగల్ 27వ వార్డ్ మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ జన్మదిన సందర్భంగా ఎమ్మెల్సీ శంబిపూర్ రాజుని ఆయన నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు మాట్లాడుతూ నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ అభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. అనంతరం శంబిపూర్ రాజు సంతోషం వ్యక్తం చేస్తూ శంకర్ నాయక్ ని శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చర్చి గాగిలాపూర్ 28 వార్డ్ మాజీ కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర – శేరిలింగంపల్లి : మాదాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ నగర్‌లో సీనియర్ నాయకులు సురేష్ నాయక్ జ్ఞాపకార్థం సురేష్ నాయక్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత నగేష్ నాయక్ వారి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రంను ఏంబీసీ చైర్మన్ జేరిపేటి జైపాల్‌తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. అనంతరం చల్లని మజ్జిగను కాలనీ వాసులకు, బాటసారులకు అందచేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ వేసవి కాలంలో చలివేంద్రం ఏర్పాటు చేసుకోవడం చాలా అభినదించదగ్గ విషయం అని, నగరంలో రోజు రోజుకూ ఎండలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ప్రజలు ఎండలకు నీళ్లకు ఇబ్బంది పడకుండా ఉండటానికి ఈ చలివేంద్రం దాహార్తిని తీర్చడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని, చలివేంద్రంను ఏర్పాటు చేయడం చాలా అభినదించదగ్గ విషయం అని తెలిపారు. వేసవి కాలంలో ప్రజలకు ఉపయోగపడేలా ఇలాంటి చలివేంద్రలు ఏర్పాటు చేయడం మంచి కార్యక్రమం అని ఈ సందర్భంగా చలివేంద్రం ఏర్పాటు చేసిన నిర్వాహకులను సురేష్ నాయక్ చారిటబుల్ ట్రస్ట్ వారిని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించచారు. అందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, మహిళలు పాల్గొన్నారు.

పేదలకు భూమి దక్కేవరకు పోరాటం

- అర్హులందరికీ నివేశిత స్థలం ఇవ్వాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్
- ఒంగోలులో అగ్రహారం భూముల పరిశీలన

విశాలాంధ్ర-ఒంగోలు: రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవాడికి నివేశిత స్థలం ఇచ్చేవరకు తమ పోరాటం ఆగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని అగ్రహారం వద్ద గత వైసీపీ ప్రభుత్వం 22 వేల మందికి పంపిణీ చేసిన భూములను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, ప్రకాశం జిల్లా సమితి నాయకులు, ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో కలిసి రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ... రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది పేదలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు వంతున నివేశిత స్థలం కేటాయించి... ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. ఇందు కోసం పేదలు వేచి చూస్తున్నారన్నారు. అయితే ఒంగోలులో అగ్రహారం వద్ద గత ప్రభుత్వం 4 వందల ఎకరాలకు పైగా కొనుగోలు చేసి 22 వేల మంది పేదలకు భరోసా పత్రాలు ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. భూమిలో రాళ్లు వేశారే కానీ... ఏ ఒక్కరికి పొజిషన్ చూపలేదని, కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవన్నారు. ఈ పత్రాలను ఏం చేసుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అనర్హుల పేరుతో ఎవరికి పొజిషన్ చూపకపోవడంతో ఒంగోలులోని పేదలు అద్దె ఇళ్లల్లో మగ్గుతున్నారన్నారు. అదేవిధంగా గతంలో టీడీపీ ప్రభుత్వం నిర్మించిన టిడ్కో గృహాలు దాదాపుగా 80% పూర్తి అయినప్పటికీ లబ్ధిదారులకు అప్పగించలేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం టిడ్కో గృహాల నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా కేటాయించని ఫలితంగా... కనీస వసతులు లేక టిడ్కో గృహాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న తీరుగా మారాయన్నారు. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన టిడ్కో ఇళ్లు పూర్తి చేయడమే కాకుండా, మౌలిక సదుపాయాలు కల్పించి వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఈపాటికే ప్రభుత్వ భూములలో నివాసం ఉంటున్న పేదలకు వెంటనే ఇంటి పట్టాలు ఇవ్వటంతో పాటు ఆయా కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ మాజీ రాష్ట్ర మంత్రి బాలినేని శ్రీనివాసులరెడ్డి నివేశిత స్థలాల పత్రాలు ఇచ్చారే తప్ప ఎవరికి పొజిషన్ చూపలేదన్నారు. ఎన్నికలలో ఓడిపోయిన తర్వాత తన స్వార్థం చూసుకొని వేరే పార్టీకి మారిపోయారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు చొప్పున పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు భూమి దక్కేవరకు సీపీఐ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అంతకుముందుగా సీపీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ ఒంగోలు సరళా దేవి నగర్ లో 2 కుటుంబాలు, దత్తాత్రేయ కాలనీలో 150 ఎస్టీ కుటుంబాలు, కార్మిక నగర్ లో 150 కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. వారందరికీ ప్రభుత్వం వెంటనే పట్టాలు మంజూరు చేయటంతో పాటుగా మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ముందుగా ఒంగోలు మల్లయ్య లింగం భవన్ నుండి పెద్దసంఖ్యలో సీపీఐ శ్రేణులు, వందలాదిమంది లబ్ధిదారులు, పేదలు ఎర్రజెండాలు చేతబట్టి అగ్రహారం భూముల వద్దకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ వెంకట్రావు, వడ్డే హనుమారెడ్డి, కే వీరారెడ్డి, ఆర్ రామకృష్ణ, ఎం. విజయ, ఎన్.మురళి, సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి శ్రీ రామ్ శ్రీనివాసులు, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, సీపీఐ జిల్లా నాయకులు ఆర్.లక్ష్మి, ముత్తని అంజయ్య, గద్దల రవి, గద్దల బాలకోటయ్య, ప్రభాకర్ వందలాది మంది పేదలు, మహిళలు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి

మిత్తల్ స్టీల్ కోసం పాకులాట తగదు: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరి స్పష్టం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును కాదని, మిత్తల్ స్టీల్ ప్లాంట్ కోసం పాకులాట తగదన్నారు. అనకాపల్లిలో ఏర్పాటు చేయనున్న మిత్తల్ స్టీల్‌కు క్యాపిటివ్ మైన్స్, పోర్టు కేటాయించవలసిందిగా పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరటం సరికాదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నప్పటికీ ప్రభుత్వాలకు పట్టకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో 'ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు'గా సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించి, అభివృద్ధి చేయకపోతే పాలకులు చరిత్ర హీనులుగా మిగిలిపోవటం ఖాయమని అన్నారు. విశాఖ ఉక్కుకు క్యాపిటివ్ మైన్స్ కేటాయించమని అడగకుండా, మిత్తల్ ఏర్పాటు చేసే స్టీల్ ఫ్యాక్టరీకి మైన్స్ కేటాయించి, పోర్టు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరటం దుర్మార్గమని పేర్కొన్నారు. కేంద్ర కుటిలయత్నాలకు రాష్ట్ర ప్రభుత్వం సై అనటాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే... తొలుత విశాఖ ఉక్కుకు క్యాపిటివ్ మైన్స్ కేటాయించేందుకు కేంద్రంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు.

'వక్ఫ్'పై 16న సుప్రీం విచారణ

న్యూఢిల్లీ: వివాదాస్పద వక్ఫ్ (సవరణ) చట్టం రాజ్యాంగ చట్టబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పదికిపైగా పిటిషన్లను సుప్రీంకోర్టు ఈనెల 16న విచారించనుంది. సీజేఐ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్లు విచారిస్తుందని సర్వోన్నత న్యాయస్థానం అధికారిక వెబ్‌సైట్ వెల్లడించింది. ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఆప్ నేత అమానతుల్లా ఖాన్, పౌర హక్కుల పరిరక్షణ సమాఖ్య ప్రతినిధి అర్షద్ మదనీ, సమస్త కేరళ జమైతుల్ ఉలేమా, అంజుమ్ ఖాద్రీ, తయ్యిబ్ ఖాన్ సల్మానీ, మహమ్మద్ షఫీ, మహమ్మద్ ఫజ్లుర్‌రహీం, ఆర్‌జేడీ నేత మనోజ్ కుమార్ ఝా దాఖలు చేసిన పిటిషన్లు 16వ తేదీన (బుధవారం) విచారణకు రానున్నాయి. అయితే మిగతా పిటిషన్ల లిస్టింగ్ ఇంకా జరగలేదు. కాగా, తమ పక్షం వినకుండా ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని కోరుతూ ఈనెల 8వ తేదీన కేంద్ర ప్రభుత్వం కావియట్‌ను దాఖలు చేసిన విషయం విదితమే.

మత మార్పిడి ఫిర్యాదులపై కూడా...

మత మార్పిడికి సంబంధించిన పిటిషన్లపై ఈనెల 16న సుప్రీం కోర్టు విచారణ చేపట్టబోతోంది. అనేక రాష్ట్రాల్లో మత మార్పిడి వ్యతిరేక చట్టాలు అమల్లోకి రావడాన్ని సవాల్ చేస్తూ కొందరు పిటిషన్లు దాఖలు చేయగా, బలవంతంగా మతం మార్చారని మరికొందరు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ ఫిర్యాదులన్నీ 16వ తేదీన సీజేఐ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించనున్నట్లు వెబ్‌సైట్ పేర్కొంది. ఇదిలావుంటే, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో మత మార్పిడి వ్యతిరేక చట్టాల అమలును సవాల్ చేస్తూ జమాతే ఉలేమా యే హింద్ పిటిషన్ వేసింది. ఈ చట్టాల ముసుగులో మతాంతర వివాహాలు చేసుకున్న జంటలను వేధింపులకు గురిచేస్తూ... వారిపై క్రిమినల్ కేసులు పెడుతున్నారని పేర్కొంది. వ్యక్తి మత గుర్తింపును తెలుసుకోవడమే కాకుండా తద్వారా వారి గోప్యతకు విఘాతం కలిగించేలా ఈ ఐదు రాష్ట్రాల స్థానిక చట్టాలు ఉన్నాయని జమాతే ఉలేమా యే హింద్ ఆరోపించింది.

ఆదర్శ 6వ తరగతి ప్రవేశ పరీక్ష 21కి మార్పు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలలో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షను ఈనెల 20వ తేదీ నుంచి 21వ తేదీకి మార్చినట్లుగా ఆంధ్రపదేశ్ పాఠశాల విద్యా కమిషన్ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రంలోని 164 మోడల్ స్కూళ్ల (ఆదర్శ పాఠశాలల)లో 2025-2026 విద్యా సంవత్సరానికిగాను '6' వ తరగతిలో విద్యార్థులను చేర్చేందుకుగాను ఈనెల 20వ తేదీ ఆదివారం ఈస్టర్ పర్వదినం ఉండటంతో... 21వ తేదీకి మార్చినట్లు వివరించారు. ఈ ప్రవేశ పరీక్షతేదీ మార్పును గమనించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఏ మండలంలో ఆదర్శ పాఠశాలలు పనిచేస్తున్నాయో...ఆ పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించబడే ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని సూచించింది. విద్యార్థుల హాల్ టిక్కెట్లను www.cse.ap.gov.in or www.apms.apcfss.in వెబ్ సైట్స్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని తెలిపింది.

'గిన్నిస్'కెక్కిన శ్రీ లలిత నాట్య కళానికేతన్

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రతిష్ఠాత్మక గిన్నిస్ వరల్డ్ రికార్డును శ్రీసత్యసాయి జిల్లా, ధర్మవరం పట్టణానికి చెందిన శ్రీ లలిత నాట్య కళానికేతన్ సాధించింది. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కోసం భారత్ అకాడమీ 2023లో నిర్వహించిన కార్యక్రమంలో పేర్లు నమోదైన వారికి గురువారం తెలంగాణ సారస్వత పరిషత్‌లో ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ మేరకు కళానికేతన్‌కు చెందిన గురువు బాబు బాలాజీ తెలిపారు. మొత్తం 12 మంది శిష్యులు పాల్గొనగా, తమ సంస్థకు ఈ గౌరవం దక్కడం సంతోషంగా ఉందని చెప్పారు. హైదరాబాద్, కోఠిలో జరిగిన కార్యక్రమంలో కూచిపూడి గురువు శేషుబాబు, నటి జ్యోతి రెడ్డి చేతుల మీదుగా గిన్నిస్ రికార్డు పత్రాలు అందుకున్నట్లు తెలిపారు. శ్రీ లలిత నాట్య కళానికేతన్ ద్వారా గిన్నిస్ రికార్డు సాధించిన శిష్యులలో బాబు బాలాజీ కుమార్తె రామ లాలిత్య సహా ఉమా ప్రియా, తనులత, హా షిత, వేద ప్రజ్ఞ, లీలా మాధవి, జాహ్నవి, వైష్ణవి, అదిత్రీ, ఉదయశ్రీ, సహస్ర ఉన్నారు. ఈ అవార్డు తమకు సంతృప్తిని, సంతోషాన్ని ఇచ్చిందని, దీనిని కళాఖండానికి అంకితమిస్తున్నామని వారన్నారు. అనంతరం బాబు బాలాజీని తెలంగాణ సారస్వత పరిషత్ నిర్వాహకులు సన్మానించారు.

ఒప్పందం కుదిరింది

'బలిమెల జలాశయ' వినియోగంపై లెక్కలు తేల్చిన ఇరురాష్ట్రాల అధికారులు

విశాలాంధ్ర - సీలేరు: ఆంధ్రా-ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయ నీటి వినియోగంపై గురువారం ఇరురాష్ట్రాల అధికార్లు ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా బలిమెలలో సమావేశమై సమీక్షించారు. 2024-2025లో ఇప్పటి వరకు ఏపీ రాష్ట్రం తమ వాటాగా ఎన్ని టీఎంసీలు వినియోగించుకున్నారో లెక్కలు తేల్చారు. 2024 జులై నుంచి 2025 మార్చి నాటికి ఆంధ్రా తన వాటాగా 69.8369 టీఎంసీలను వినియోగించుకోగా ఒడిశా 73.5147 టీఎంసీలను వినియోగించుకున్నట్లు నిర్ధారించారు. ఆంధ్రా కంటే ఒడిశా 3.6778 టీఎంసీల నీటిని అధికంగా వినియోగించినట్లు లెక్కలు తేల్చారు. ప్రస్తుతం జోలాపుట్ బలిమెల జలాశయాల్లో 44.7730 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్లు అధికారులు లెక్కలు కట్టారు. ఇందులో ఆంధ్రా వాటాగా 24.2254 టీఎంసీలు, ఒడిశా వాటాగా 20.5476 టీఎంసీల గాను ఇరురాష్ట్రాల అధికార్ల మధ్య ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి, ఇరిగేషన్ అవసరాల నిమిత్తంగా ఆంధ్రాకు మూడు వేల క్యూసెక్కులు, ఒడిశాకు మూడువేల క్యూసెక్కుల నీటిని ఈనెలాఖరు వరకు వినియోగించడానికి అధికార్లు ఏకగ్రీవంగా అంగీకరించారు. ఒడిశా తరపున బీహెచ్‌ఈపీ సీనియర్ జనరల్ మేనేజర్ దిలీప్ కుమార్ స్వైన్, టెక్నికల్ వింగ్ జనరల్ మేనేజర్ రాధామాదబ్, జనరల్ మేనేజర్ జ్యోతిర్మయిదాస్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఓంప్రకాష్‌నాయక్, అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్, పొట్టేరు ఇరిగేషన్ ఛీఫ్ కన్‌స్ట్రక్షన్ ఇంజినీర్ పీతాబాస్ సేధి, సూపరింటెండెంట్ ఇంజినీర్ రమాకాంతపాత్ర, ఏఈఈ తుషార్‌రంజన్‌కుంటియా, ఈఈఈ గదాదర్ ప్రధాన్ హాజరవగా... ఆంధ్రా తరపున సీలేరు కాంప్లెక్స్ జెన్‌కో అధికార్లు, సూపరింటెండెంట్ ఇంజినీర్ బి.చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈలు ఎం.శ్రీనివాసరెడ్డి, డీఈఈ కె.దుర్గా శ్రీనివాసరావు హాజరయ్యారు.

వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు...

ఐటీడీపీ కిరణ్ అరెస్ట్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి సతీమణి భారతి రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సెల్ టవర్ లొకేషన్ ఆధారంగా విజయవాడ, ఇబ్రహీంపట్నం ప్రాంతంలో కిరణ్ ఉన్నట్లు గుర్తించిన గుంటూరు జిల్లా పోలీసులు అతడిని పట్టుకున్నారు. వైఎస్ భారతిపై నిందితుడు సోమవారం అనుచిత వ్యాఖ్యలు చేశాడు. అతడి వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో విషయం కాస్త టీడీపీ పెద్దల వద్దకు చేరింది. సీఎం చంద్రబాబు ఆదేశాలతో కిరణ్ కుమార్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని గుంటూరు జిల్లా పోలీసులకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. కిరణ్ కుమార్ లొకేషన్‌ను గుర్తించిన పోలీసులు వెంటనే ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం చేరుకుని అరెస్టు చేశారు. కిరణ్ వీడియోపై టీడీపీ అధిష్టానం సీరియస్ అయిన వెంటనే.. "నా మాటలు ఎవరినైనా బాధించి ఉంటే క్షమించమని కోరుతున్నా. ఈ వ్యాఖ్యలు ఎలాంటి దురుద్దేశంతో చేయలేదు. క్షణికావేశంలో మాత్రమే చేశా. క్షమించండి " అంటూ కిరణ్ కుమార్ మరో వీడియో విడుదల చేశాడు. అయినా పార్టీ అధిష్టానం మాత్రం వెనక్కి తగ్గలేదు. ప్రతిపక్ష, స్వపక్ష నేతల భార్యలు, వారి ఇళ్లలోని మహిళపై ఎవరైనా కామెంట్లు చేస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలోనే హెచ్చరించారు. అయినా పార్టీ లైన్ దాటి వ్యాఖ్యలు చేయడంతో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కిరణ్ కుమార్ అరెస్ట్ అయ్యారు.

గోరంట్ల మాధవ్ అరెస్ట్: చేబ్రోలు కిరణ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి గుంటూరు తరలించే క్రమంలో విషయం తెలుసుకున్న వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, కిరణ్‌ను తీసుకు వెళుతున్న వాహనాన్ని వెంబడించి అడ్డుకొని అతడిపై దాడికి యత్నించారు. దీంతో గోరంట్ల మాధవ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి మంగళగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కార్పొరేట్లకు అటవీ సంపద దోచిపెట్టడమే కగార్ లక్ష్యం

ఆదివాసీలను తరిమేసే కుట్ర: జేవీఎస్ మూర్తి



విశాలాంధ్ర-పలాస: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాల పరిధి దండకారణ్యంలోని విలువైన సహజ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టడమే ఆపరేషన్ కగార్ లక్ష్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. గతంలో సల్వార్‌జుడుం, ఆపరేషన్ గ్రీన్ హంట్, ప్రస్తుతం ఆపరేషన్ కగార్‌తో ప్రజలపై ప్రత్యక్ష యుద్ధమే జరుగుతోందన్నారు. శ్రీకాకుళం జిల్లా పలాసలోని గణపతి రెసిడెన్సిలో గురువారం సీపీఐ అధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ అటవీ సంపద ప్రైవేట్ కబంధ హస్తాల్లో పెట్టేందుకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని, ప్రజలపై, ప్రజా నేతలపై, ఉద్యమకారులపై ప్రత్యక్ష యుద్ధానికే ఆపరేషన్ కగార్ అని విమర్శించారు. ఆదివాసీలకు విద్య, వైద్యం వంటి మౌలిక వసతులు కల్పించకుండా... రహదారులు వేస్తామనడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అడవుల నుంచి సాయుధ బలగాలను, పోలీస్ క్యాంపులను ఉపసంహరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖనిజ సంపద తవ్వకాలను అడ్డుకుంటున్నారనే మావోయిస్టుల సానుభూతిపరులు, ఇన్ఫార్మర్ల నెపంతో ఆదివాసీలను వేధిస్తున్నారని, కొన్ని చోట్ల మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని జేవీ సత్యనారాయణ మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. 2026 మార్చికి మావోయిస్టులను అంతం చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించడాన్ని ఖండించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హోం మంత్రిగా జలగం వెంగళరావు ఇదే తరహాలో ప్రకటించారు కానీ ఉద్యమాలు ఆగలేదని గుర్తు చేశారు. శ్రీకాకుళం ఉద్యమం ద్వారానే వన్ ఆఫ్ సెవెంటీ యాక్ట్ వచ్చిందన్నారు. ఉద్యమాల ద్వారానే హక్కులు సాధించుకునే పరిస్థితి నెలకొన్నదని, ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు గొంతెత్తాలని జేవీఎస్ సత్యనారాయణ మూర్తి పిలుపునిచ్చారు. మానవ హక్కుల వేదిక నేత ఎస్‌వీ కృష్ణ మాట్లాడుతూ నిర్బంధం, అణచివేత ప్రధాన అస్త్రాలుగా పాలకులు తమ గమననీతిని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. గత మూడున్నర నెలల్లో 135 మంది ఉద్యమకారులను కాల్చిచంపారన్నారు. మూడేళ్లలో సుమారు 550 మందికిపైగా హత్యకు గురయ్యారని, ఇవన్నీ ప్రభుత్వ హత్యలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవెల్లి కృష్ణ, తాంధ్ర ప్రకాశ్ రావు, సన్యాసిరావు ప్రసంగించారు. పత్తిరి దానేసు, అరుణ అక్క, చాపర వేణుగోపాల్, యుగంధర్, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు. కగార్ వ్యతిరేక గీతాలతో కళాకారులు ఆలోచింపజేశారు.

చంద్రబాబుకు గుణపాఠం తప్పదు

- అటకెక్కిన ఎన్నికల హామీలు... పూర్వపు బీహార్‌లా ఏపీ
- మంచి చేస్తే ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం
- ఉమ్మడి కర్నూలు స్థానిక సంస్థల నేతలతో జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గోడకు కొట్టిన బంతిలా గుణపాఠం తప్పదని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ... సీఎం చంద్రబాబు నాయుడును హెచ్చరించారు. అబద్ధపు హామీలతో ప్రతి వర్గాన్ని మోసగించారని, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అటకెక్కించారని మండిపడ్డారు. హామీల అమలుకు సాకులు వెదుకుతున్నాడని, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్ని పూర్తిగా చంద్రబాబు నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వైసీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్ గురువారం సమావేశమయ్యారు. ప్రజలకు మంచి చేసి వారి మనసుల్లో స్థానం సంపాదించుకోవాలేగానీ... మనుషులను చంపే స్థాయిలో ఇంతలా దిగజారిపోవాల్సిన అవసరం ఉందా అని ప్రశ్నించారు. పూర్వపు బీహార్ రాష్ట్రంలా మన రాష్ట్రం తయారైందని, ఇలాంటి పరిస్థితుల మధ్య మనం యుద్ధం చేస్తున్నామని అన్నారు. వైసీపీకి బీజం కర్నూలులోనే పడిందని, ఇచ్చిన మాట కోసం ఎందాకైనా వెళ్తామని, ఆ దిశలోనే చిత్తశుద్ధితో, అంకితభావంతో పని చేశామన్నారు. అందుకే వైసీపీ బలమైన పార్టీగా ఆవిర్భావించిందని, విలువలు, విశ్వసనీయతే మన పార్టీ సిద్ధాంతమని, వాటికి అర్థం చెప్పిందే వైసీపీ అని పునరుద్ఘాటించారు. రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజమని, మన పార్టీ ప్రజల వద్దకు గర్వంగా వెళ్లగలదని, ఆ స్థాయిలో ప్రతి ఒక్కరికీ మంచి చేశామని చెప్పారు. మేనిఫెస్టో అంటే గతంలో చెత్తబుట్ట లో వేసేవారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే దానికి విశ్వసనీయత అనేదీ రుజువైందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో 99 శాతం నెరవేర్చామని జగన్ గుర్తుచేశారు. కష్టాలు అనేవి శాశ్వతంగా ఉండబోవని, వైసీపీ కచ్చితంగా తిరిగి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జగన్ 2.ఓ పాలన మీరు తప్పకుండా చూస్తారని, ప్రతి కార్యకర్తకూ న్యాయం జరుగుతుందని పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. మనమంతా ప్రజలకు అండగా నిలడాల్సిన సమయం ఆసన్నమైందని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, సీఎంకు ఉండాల్సిన హుందాతనం చంద్రబాబుకు లేదని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో బాబు అక్రమాలకు అంతులేదని, అయినా వైసీపీ క్యాడర్ తెగింపుతో పని చేసిందంటూ ప్రశంసించారు.

భగవాన్ మహావీర్‌కు జగన్ ఘననివాళి

వైసీపీ కేంద్ర కార్యాలయంలో మహావీర్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. భగవాన్ మహావీర్ చిత్రపటానికి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వైసీపీ ప్రధాన కార్యదర్శి ఎస్.వి. సతీశ్‌కుమార్ రెడ్డి, జైన్ వెల్ఫేర్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మనోజ్ కొఠారి, జైన్ సమాజ్ మాజీ అధ్యక్షుడు సుక్రాజీ ఫౌలాముతా, జైన్ సమాజ్ సెక్రటరీ పన్నాలాల్ జీ, జైన్ సమాజ్ కమిటీ మెంబర్ విక్రమ్ బండారి, జైన్ సమాజ్ మాజీ ఉపాధ్యక్షుడు మోహన్‌లాల్ కొఠారి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం

తహసీల్దారుకు రైతు నేతల ఫిర్యాదు

వెంటనే పంట సేకరించాలని డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: రబీలో పండిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి రైతులను, కౌలు రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్నీడి యల్లమందారావు, కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు బుడ్డి రమేష్, సంఘ నాయకులు నిమ్మగడ్డ వాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వీరంతా ఎన్టీఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం మండల తహసీల్దారు వై. వెంకటేశ్వర్లును కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గత 15 రోజుల నుంచి అనేక గ్రామాల్లో రైతులు వరికోతలు పూర్తి చేసి... ధాన్యాన్ని ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రానికి తీసుకెళితే... అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈలప్రోలు, మూలపాడు తదితర గ్రామాల్లో ఇంతవరకు ఒక ధాన్యపుగింజ కూడ కొనుగోలు చేయకపోవటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా మూలపాడులో చింతల పటేల్ అనే కౌలురైతుతోపాటు మరో నలుగురి రైతుల ధాన్యం, ఈలప్రోలులో చెరుకూరిసత్యంబాబుతో పాటు మరో 10మంది రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల్లోని అధికారులు ఈలప్రోలు గ్రామానికి చెందిన మిల్లు యజమాని మల్లయ్య, పి.నైనవరం గ్రామానికి చెందిన మిల్లు యజమాని రెడ్డి నాయుడు చెప్తేనే ధాన్యం సేకరిస్తామని చెబుతున్నారని, ధాన్యం కొనుగోలులో మిల్లర్ల అక్రమాలకు అంతులేకుండా పోతోందని మండిపడ్డారు. అక్రమాలకు పాల్పడిన మిల్లర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని కోరారు. సకాలంలో రైతుల, కౌలురైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని తహసీల్దారు వై.వెంకటేశ్వర్లుకు విన్నవించారు. ఈ విషయంపై తహసీల్దారు స్పందిస్తూ ఈలప్రోలు, మూలపాడు తదితరు గ్రామాల అధికారులతో మాట్లాడి తక్షణమే ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా చర్యలు చేబడతామన్నారు. భవిష్యత్తులో ఇటువంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటామని నేతలకు హామీ ఇచ్చారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.